PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సిటీ

సంపుటి : 42 సంచిక : 319 | విజయవాడ, మంగళవారం 20 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 20 June 2023 | Rs

కెనడాలో ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్

హర్‌దీప్ సింగ్ కాల్చివేత

• లోపలి పేజీలో.. •

'రా' చీఫ్‌గా రవి సిన్హా

న్యూఢిల్లీ : సీనియర్ ఐపిఎస్ అధికారి రవి సిన్హాను రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (ఆర్ఎడబ్ల్యు-రా) నూతన చీఫ్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. 1988 బ్యాచ్ ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి రవి సిన్హాను రా చీఫ్‌గా నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రా చీఫ్‌గా ఉన్న సమంత్ కుమార్ గోయెల్ పదవీకాలం ఈ నెల 30న ముగియనుండటంతో.. ఆయన స్థానంలో కొత్త చీఫ్‌గా రవి సిన్హాను నియమించినట్లు సోమవారం జారీచేసిన ఉత్తర్వుల్లో కేంద్రం పేర్కొంది. రవి సిన్హా రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన ప్రస్తుతం క్యాబినెట్ సెక్రెటేరియట్ స్పెషల్ సెక్రెటరీగా ఉన్నారు. 2019 జూన్‌లో రా చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన గోయల్ పదవీ కాలం 2022లో ముగియగా, మరో ఏడాది కేంద్రం పొడిగించిన సంగతి తెలిసిందే.

కేలండరు ప్రకారమే సాగు నీరు

- ప్రాధాన్యత ప్రాజెక్టుల పనులు వేగవంతం
- జలవనరులశాఖ సమీక్షలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత ప్రాజెక్టుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు కేలండరు ప్రకారం సాగునీటి విడుదల కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరులశాఖపై సిఎం జగన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణ పనులపై సిఎంకు అధికారులు వివరించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి, కృష్ణాడెల్టా, తోటపల్లి కింద ప్రాంతాలకు సాగునీరు విడుదల చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కూడా దృష్టిపెట్టాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్‌కమ్ రాక్‌ఫీల్డ్ డ్యామ్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు వివరించారు. కేంద్ర జలశక్తిశాఖ, కేంద్ర జలమండలి అధికారులు గైడ్ బండ్‌లో కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారని, నేల స్వభావంలో

జాతీయ స్థాయి పురస్కారాన్ని ముఖ్యమంత్రి జగన్‌కు చూపిస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి, ఉన్నతాధికారులు

మార్పులు కారణంగా ఇది జరిగి ఉండొచ్చన్న అనుమానాన్ని కమిటీ వెల్లడించిందని తెలిపారు. దెబ్బతిన్న ప్రాంతాన్ని పునర్నిర్మించేందుకు కమిటీ సూచనల మేరకు ముందుకెళ్తున్నట్లు వివరించారు. పోలవరం తొలిదశను పూర్తిచేసేందుకు కేంద్ర ఆర్థికశాఖ రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, కేంద్ర కేబినెట్‌లో పెట్టేందుకు కేబినెట్ నోట్ తయారీపై వివిధ మంత్రిత్వశాఖల మధ్య సంప్రదింపులు కొలిక్కి వస్తున్నాయని తెలిపారు. పోలవరం మొదటి దశ పరిధిలోకి వచ్చే 20,946 ముంపు బాధిత కుటుంబాల్లో 12,658 మందిని ఇప్పటికే తరలించామని, మిగిలిన 8,288 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రభుత్వం ప్రాధాన్యతగా నిర్దేశించుకున్న ప్రాజెక్టుల పూర్తిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సిఎం ఆదేశించారు. వెలిగొండ, వంశధార, అవుకు తదితర ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో పరిస్థితులను మిగతా 7లో

వైసిపిని అన్నింటా ఓడించాలి

- టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసిపిని చిత్తుగా ఓడించి విజయకేతనం ఎగురవేయాలని తమ పార్టీ శ్రేణులకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. ప్రజాచైతన్యంతో జగన్ వంటి నియంతను ఎదుర్కోవాలని తెలిపారు. టిడిపి విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో చంద్రబాబు ఆధ్వర్యాన సోమవారం జరిగింది. రాబోయే ఏడు నెలలు చాలా కీలకమని, నేతలందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి పార్టీకి నివేదిక ఇవ్వాలని, దీనిని బట్టే దసరా నాటికి పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టో తయారుచేస్తామని వెల్లడించారు. పార్టీ అధికారంలోకి వస్తే అన్ని ధరలూ తగ్గుతాయని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నిత్యావసర ధరలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. పన్నుల హేతుబద్ధీకరణతో అభివృద్ధి చేసి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రతి కుటుంబంపై రూ.4 లక్షల భారం పడిందని విమర్శించారు. ప్రజల ఆదాయం తగ్గిందని, అసమర్థ ముఖ్యమంత్రే మిగతా 2లో



సహకారమా? సంఘర్షణా?

- తేల్చుకోవాలని అమెరికాకు స్పష్టం చేసిన చైనా
- జిన్‌పింగ్‌తో బ్లింకెన్ భేటీ

7

విశాఖలో స్వామి సంపూర్ణానంద లీలలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ



విశాఖ నగరం పరిధి వెంకోజీపాలెంలోని జ్ఞానానంద రామానంద ఆశ్రమంలో బాలికపై సంపూర్ణానంద స్వామీ చాలా రోజులుగా సాగిస్తున్న ఆకృత్యాల బాగోతం సోమవారం వెలుగులోకి వచ్చింది. వెంకోజీపాలెంలోని జ్ఞానానంద రామానంద ఆశ్రమం నుంచి తప్పించుకున్న బాలిక నేరుగా విజయవాడకు చేరుకుంది. దిశ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. రెండేళ్లుగా బంధించి, రాత్రిపూట వేధిస్తున్నారని బాలిక ఫిర్యాదులో పేర్కొన్నట్లు దిశ డిఎస్‌పి వి.వి. నాయుడు తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆస్పత్రికి తరలించామన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు విశాఖ పోలీసులు సంపూర్ణానంద స్వామీని అదుపులోకితీసుకున్నారు. అయితే సదరు బాలిక కనిపించడం లేదని ఆశ్రమ సిబ్బంది ఈ నెల 15వ తేదీన ఎంవిపి కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజమండ్రి సమీపంలోని గండేపల్లి గ్రామానికి చెందిన సదరు బాలిక తలిదండ్రులు 12 ఏళ్ల వయస్సులో చనిపోవడంతో ఆమె పెద్దమ్మ ఆశ్రమంలో చేర్పించారు.

పోలవరం నిర్వాసితుల స్థితిగతులపై రాసిన పుస్తకాన్ని పాత్రికేయులతో కలిసి ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా

నేటి నుండి పోలవరం పోరుయాత్ర

- మీట్ ది ప్రెస్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ముంపు ప్రజలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పునరావాసం కోసం ప్రత్యామ్నాయ ప్రణాళిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ముంపు ప్రాంత నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వరదలో ముంచేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం నుండి జులై 4వ తేదీ వరకూ పోలవరం పోరుయాత్ర పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో ఎపియుడబ్ల్యుజె, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. సుమారు 300 కిలోమీటర్లపాటు సాగే యాత్ర నెల్లిపాకలో బయలుదేరి పోలవరం ముంపు ప్రాంతాలతోపాటు ఏలూరు, కృష్ణా జిల్లాలో పర్యటించి విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా పునరావాసం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. రూ.55 వేలకోట్ల ప్రాజెక్టులో రూ.33 వేల కోట్లు పునరావాసమే ఉంటే అంత ప్రాధాన్యతగల అంశాన్ని పక్కనబెట్టేసి డ్యాం నిర్మాణం గురించే చర్చిస్తున్నారని అన్నారు. పునరావాసం సహజ న్యాయసూత్రమని, ప్రభుత్వాలు ఆ అంశాన్నే పట్టించుకోవడం లేదని తెలిపారు. నోరులేని గిరిజనులు పడుతున్న బాధలు కూడా బయట ప్రపంచానికి తెలియనీయడం లేదని, బెదిరింపులతో వారిని వెళ్లగొట్టే పని చేస్తున్నారని తెలిపారు. గ్రామాలకు గ్రామాలను వరదల్లో ముంచేసి కనీస పరిహారం కూడా ఇవ్వకుండా అక్కడ నుండి పంపించేస్తున్నారని అన్నారు. 45 మీటర్ల ఎత్తు వస్తే మునుగుతాయని చెప్పిన గ్రామాలు 41 మీటర్ల ఎత్తుకే మునిగిపోతున్నాయని, చింతూరు మండలం కూడా పూర్తిగా ముంపునకు గురైందని అన్నారు. గత పాలకులు రూ.6.50 లక్షలు ఇస్తామంటే జగన్మోహన్‌రెడ్డి రూ.10 లక్షలు ఇస్తామన్నారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. చింతూరు, ఎటపాక, వి.ఆర్.పురం, కూనవరం, దేవీపట్నం, కుక్కునూరు, వేలేరుపాడు పోలవరం మండలాల్లో ప్రజలు ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని వదులుకుని నేడు ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా రోడ్డున పడ్డారని అన్నారు. పైగా అధికారుల బెదిరింపులు కూడా తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. నెలల తరబడి ముంపులో ఉన్న ప్రజలకు కొద్దిగా బియ్యం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇంటి నిర్మాణానికి ఇస్తానన్న పదివేలు కూడా ఇవ్వలేదని అన్నారు. పునరావాసం విషయంలో కేంద్రం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పోలవరం పునరావాసం విషయంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను సిపిఎం పార్టీగా అడుగుతున్నామని తెలిపారు. 20వ తేదీ నుండి నిర్వహించబోయే యాత్ర కడుపు మండిన గిరిజనులు ఉనికి మిగతా 7లో



అవినాశ్ రెడ్డి, సిబిఐకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద్ రెడ్డి హత్య కేసులో కడప ఎంపి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. అవినాశ్‌తో పాటు సిబిఐకి కూడా ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. వివేకా హత్య కేసులో తెలంగాణ హైకోర్టు అవినాశ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వైఎస్ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఈ క్రమంలో అవినాశ్ రెడ్డితోపాటు సిబిఐకి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేసింది. జులై 3న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు కేసును విచారించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అంగన్‌వాడీలను అవమానించే యాప్‌ను రద్దు చేయాలి

- యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల నమోదు కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లను అవమానించేలా రూపొందించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ 1.2.9 కొత్త వెర్షన్‌ను రద్దు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కొత్త యాప్‌లో గర్భిణులు, బాలింతలు, కాన్పులు వంటి అంశాలను ఎఎన్‌ఎంలు సేకరించిన జాబితాను సచివాలయానికి పంపితే ఆ తర్వాత జివిఎంకెకు నివేదించాక అంగన్‌వాడీ వర్కర్లు మళ్లీ సచివాలయాల నుంచి జాబితాను తీసుకొని సేవలు అందించేలా కొత్త యాప్‌ను రూపొందించారని తెలిపారు. మొదటి నుంచి చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లను కాదని ఇపుడు ఎఎన్‌ఎం, ఎంఎస్‌కెల ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పడం తగదని పేర్కొన్నారు. అంగన్‌వాడీలను జాబితాల కోసం సచివాలయాల చుట్టూ తిప్పే ఈ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సేవలు సజావుగా సాగేందుకు ఈ యాప్‌ను పాతపద్ధతిలో కొనసాగించాలని కోరారు.

కప్పట్రాళ్ల బొజ్జమ్మ వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ప్రముఖ ఫ్యాక్షనిస్ట్ కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తె కర్నూలు జిల్లా దేవనకొండ మాజీ జెడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ (సుశీలమ్మ) దంపతులు సోమవారం వైసిపిలో చేరారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు కోట్ల సుజాతమ్మకు టిడిపి టికెట్ ఇవ్వడంతో ఆమె వర్గీయులు అంతా వైసిపి అభ్యర్థి అయిన గుమ్మనూరు జయరామ్ గెలుపుకోసం పనిచేశారు. అయితే ఎన్నికల తర్వాత మంత్రి గుమ్మనూరు జయరామ్ తన హత్యకేసులో నిందితులైన మద్దిలేటి నాయుడుకు ప్రాధాన్యతను ఇవ్వడంతో కప్పట్రాళ్ల బొజ్జమ్మ బిజెపిలో చేరారు. అయితే అక్కడ సరైన గుర్తింపు రావడం లేదని స్తబ్దుగా వుండిపోయింది. ఇపుడు ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సుశీలమ్మ, ఆమె భర్త, దేవనకొండ మాజీ ఎంపిపి రామచంద్రనాయుడు వైసిపి కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, కడప జెడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు. కర్నూలు జిల్లా ఆలూరులో టిడిపి కనుమరుగైందని మంత్రి గుమ్మనూరు జయరామ్ మీడియాకు వివరించారు.

ఆ స్క్రిప్ట్ చంద్రబాబుదే : అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పవన్‌కల్యాణ్ మొత్తం స్క్రిప్ట్ చంద్రబాబుదేనని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనను ఎదుర్కోలేకే కుట్ర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. చంద్రబాబును సిఎం చేసేందుకే పవన్ ప్రసంగాలున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో గంజాయి సాగులో ఎపి నెంబర్ వన్ అని అయ్యన్న, గంటా శ్రీనివాసరావు మీడియాతో చెప్పలేదా? అని ప్రశ్నించారు.

పోలవరం నిర్వాసితుల పోరుకేక

- నెల్లిపాక నుంచి నేడు మహాపాదయాత్ర
- 15 రోజులు 400 కి.మీ
- జులై 4న విజయవాడలో ముగింపు

బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్న పోలవరం నిర్వాసిత యువత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితులు పోరుకేక పెట్టనున్నారు. రాజకీయాలకతీతంగా చేపట్టే ఈ మహాపాదయాత్ర అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక నుంచి మంగళవారం ప్రారంభం కానుంది. రాష్ట్రానికి జీవనాడిగా పిలవబడుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిర్వాసితులు తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. అయినా వారికి పునరావాసం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వారు పాదయాత్రకు కదులుతున్నారు.

జాతీయ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తమదేనంటూ తొలుత ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పునరావాసంపై మడతపేచీ పెడుతోంది. ప్రాజెక్టు నిర్మాణానికి మాత్రమే నిధులు కేటాయిస్తామని లెక్కలు చెబుతోంది. ప్రాజెక్టులో కీలకమైన నిర్వాసితుల భాగస్వామ్యాన్ని విస్మరించింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిధులు రాబట్టడంలో గత తెలుగుదేశం ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తొలి దశ మాత్రమే అంటూ 20 వేల మందికి పునరవాసం అంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ పరిస్థితులలో పోలవరం నిర్వాసితులు రోడ్డెకాల్సి వస్తోంది.

పోలవరం నిర్వాసితుల డిమాండ్లివే

నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకు గ్రామాలు ఖాళీ చేయించరాదని మహాపాదయాత్ర డిమాండ్ చేస్తోంది. పది డిమాండ్లను పాలక ప్రభుత్వాల ముందు ఉంచింది. పోలవరం నిర్వాసితులకు పునరావాసం పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలని కోరుతోంది. 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాల రీ సర్వే చేయాలని, పునరావాసం దశల వారీగా కాకుండా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తోంది. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని పునరావాసం, పరిహారం అర్హులందరికీ ఇవ్వాలని, ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలని, ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికీ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. జీవో 224 అమలు చేయాలని, గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. పెండ్లి అయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలని, సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుతోంది. ముంపు ప్రాంతాల ఉద్యోగులందరినీ యథాతథంగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది.

మహా పాదయాత్ర షెడ్యూల్

ప్రజాశక్తి -ఎటపాక, అల్లూరి సీతారామరాజు జిల్లా

నెల్లిపాక నుంచి మంగళవారం ప్రారంభమయ్యే పాదయాత్ర 15 రోజుల పాటు సాగి జులై 4వ తేదీన విజయవాడ చేరుకుంటుంది. అదే రోజు మహాధర్నాతో ముగుస్తుంది. ఈ పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారు. నెల్లిపాకలో ప్రారంభం రోజున నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రధాన వక్తగా, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారు.

చింతూరు డివిజన్‌లో మహా పాదయాత్ర సాగుతుందిలా...

- 20వ తేదీన - నెల్లిపాక నుంచి మురుమూరు (నెల్లిపాక)
- 21న- మురుమూరు నుంచి టేకులబోరు (కూనవరం)
- 22న - టేకులబోరు నుంచి కూటూరు (కూనవరం)
- 23న -కూటూరు నుంచి ఎర్రంపేట (చింతూరు)
- 24న -ఎర్రంపేట నుంచి రామవరంపాడు (విఆర్.పురం)
- 25న - రామవరంపాడు నుంచి రేఖపల్లి (విఆర్.పురం)
- 26న - రేఖపల్లి నుంచి కూనవరం-రుద్రంకోట (కుకునూరు)

మహిళల, ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం

పోలీసు పనితీరులో సమూల మార్పులు

ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలు, ప్రజల రక్షణ కోసం పోలీసు పనితీరులో సమూల మార్పులు చేపట్టాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో జరిగిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్‌ను అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుర్ఘటన రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేసిందని అన్నారు. ఇటీవల కాలంలో ఆడపిల్లల మీద అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, సంఘ వ్యతిరేక శక్తులు మితిమీరిపోతున్నారని అన్నారు. ఆడపిల్లలకు రక్షణ లేని దుస్థితి ఏర్పడిందని, దిశ యాప్, చట్టాల ప్రభావం ఏమీ కనిపించడం లేదని పేర్కొన్నారు. గతంలో చిన్న, పెద్ద పట్టణాలకు పరిమితమైన ఆకతాయిల అకృత్యాలు నేడు గ్రామాలకూ విస్తరించాయని తెలిపారు. దీన్ని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని మహిళా సంఘాలు, ప్రముఖులతో సమావేశం జరిపి నిర్దిష్ట చర్యలకు పూనుకోవాలని, ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ సంఘాన్ని నియమించాలని కోరారు. అమర్నాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు కొనసాగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులకు శిక్ష పడేలా సత్వరం చర్యలు తీసుకోవాలని, చొరవ తీసుకుని ఈ చర్యలపై అజమాయిషీ చేయాలని సిఎంను కోరారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు ఉన్నాయని, ప్రత్యేకంగా పోలీసు విభాగం ఉందని తెలిపారు. వీధి వీధికి వాలంటీర్లు ఉన్నారని, కొత్తగా చేర్చుకున్న సచివాలయ పోలీసులకు ఉద్యమాలను అణచివేయడానికి, ప్రజలపై పెత్తనం చేయడానికి శిక్షణ ఇస్తున్నారే తప్ప ప్రజలకు రక్షణగా ఉండేందుకు వారిని ప్రోత్సహించడం లేదని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ యొక్క పరిధి, దాని పని విధానం పూర్తిగా ప్రజా అనుకూలంగా మార్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వివరించారు. తక్షణం గ్రామ, వార్డు సచివాలయం పోలీసు విభాగం ఆ గ్రామ వార్డుల్లో విద్యార్థినులు, ఆడపిల్లల వివరాలు సేకరించి నిరంతరం వారి రక్షణను, భద్రతను పర్యవేక్షిస్తుండాలని కోరారు. ఆకతాయిలపై నిఘాపెట్టి ఆడపిల్లల రక్షణకు భరోసా కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు విభాగం పనిలో అత్యధిక భాగం రాజకీయ కార్యకలాపాలకు, ప్రతిపక్షాలపై నిఘాకు, ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికి సరిపోతోందని, ఇలా రాజకీయ స్వార్థ సంకుచిత ప్రయోజనాలకు పోలీసులను వినియోగించడం సరికాదని తెలిపారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించి శాంతిభద్రతలు కాపాడాలని, ప్రజలకు రక్షణగా ఉండాలని తెలిపారు. ఇలాంటి ప్రజా పోలీసు వ్యవస్థ కోసం సంస్కరణలు చేపట్టాలని కోరారు. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని అమల్లోకి తేవాలని, రాష్ట్ర క్యాబినెట్ చర్చించి అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం జరిపి ఆడపిల్లల భవిష్యత్ భద్రత, రక్షణ విషయంలో తగుచర్యల కోసం చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

అమర్‌నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలి

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు మహిళా ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోదరిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారిని వారించినందుకు దారుణంగా హత్యకు గురైన అమర్‌నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలని మహిళా ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు సోమవారం మహిళా సంఘాల ఆధ్వర్యాన మహిళా కమిషనర్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన ఆమె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే అతని అక్కపై నిందితుడు లైంగికదాడి చేసినట్లు పెద్దల దృష్టికి తీసుకెళ్లాడని తెలిపారు. దీంతో అతనికి హానీ ఉంటుందనే ఉద్దేశంతో ట్యూషన్ మాన్పించారని, పదో తరగతి కావడంతో ట్యూషన్‌కు పంపించారని అన్నారు. దీంతో కక్షగట్టిన నిందితుడు వెంకటేశ్వరరెడ్డి.. అమర్‌నాథ్‌ను దారుణంగా హత్య చేశాడని తెలిపారు. దీనిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమర్‌నాథ్ తల్లి మాధవికి అంగన్‌వాడీ ఉద్యోగం ఇవ్వాలని, దాంతోపాటు సాగుభూమిని కూడా ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఒంటరి మహిళలు, పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలను టార్గెట్ చేసుకుని దుండగులు క్రూరమైన చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. ఒంటరి మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాసిరెడ్డి పద్మను కలిసిన వారిలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకులు పి దుర్గాభవానీ, పిఒడబ్ల్యు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి పద్మ, ఐప్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి అరుణ, ఆర్ నాగమణి తదితరులు ఉన్నారు.

సాత్విక్ - చిరాగ్ శెట్టికి సిఎం అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇండోనేషియా ఓపెన్ టైటిల్ గెలిచిన సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు సోమవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అందరూ గర్వపడేలా గెలుపొందారని, భవిష్యత్తులో ఈ జోడీ మరిన్ని విజయాలు సాధించాలని సిఎం ఆకాంక్షించారు.

రైతు సమస్యలపై 30న చలో అసెంబ్లీ

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజయనగరం శ్రామిక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుజల స్రవంతి కాలువ, గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేలైన్, కారిడార్, గిరిజన యూనివర్సిటీ, పెందుర్తి - బొడ్డవర హైవే, బైపాస్, బొడ్డవర-రామవరం రహదారి, సాగునీటి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు నామమాత్రపు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలకు మద్దతుధరలు.. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా లేవన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ తుంగలోకి తొక్కి ద్రోహం చేశారని విమర్శించారు. 50 రకాల పంటలు పండిస్తుంటే కేవలం 14 పంటలకు మద్దతుధర కల్పించి, వరికి మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. పాల రైతులకు రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు లీటరుకు రూ.నాలుగు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మామిడిపంటకు వాతావరణ బీమా అమలు చేయాలని, జీడి, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి ధర కల్పించాలని కోరారు. విద్యుత్తు పంపు సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, నాయకులు ఆదినారాయణమూర్తి, నాయకులు దేవర జగన్, గెద్ద లక్ష్మి, ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- అక్టోబరు 17న ముసాయిదా విడుదల
- నవంబరు 30 వరకు అభ్యంతరాలు స్వీకరణ
- పిఎస్‌వితో 10.20 లక్షల ఓట్లను తొలగించాం
- రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా వుండేలా రూపొందిస్తామని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న సాధారణ ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందుకోసం ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఈ నెల ఒకటి నుంచి మొదలైన ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ, బిఎల్‌ఒలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను జులై 20 వరకు కొనసాగుతాయన్నారు. జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ కేంద్రాల పరిశీలన, జెండర్, యూత్ వంటి అంశాలతో ఓటర్ల జాబితా రేషనలైజ్‌ను పరిశీలిస్తామన్నారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు ఓటర్ల జాబితాను 8 రకాల ఫార్మాట్‌లలో రూపొందించి, అక్టోబరు 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ జాబితాలో తప్పొప్పులపై క్లెయిమ్స్, అభ్యంతరాలను నవంబరు 30 వరకు స్వీకరిస్తామన్నారు. వీటికోసం అక్టోబరు 28, 29 తేదీల్లో, నవంబరు 18, 19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. డిసెంబరు 26 నాటికి అన్ని అభ్యంతరాలనూ పరిశీలించి జనవరి ఒకటి నాటికి ఎన్నికల కమిషన్‌కు తుది జాబితా పంపుతామని తెలిపారు. ఎన్నికల కమిషన్ అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను జనవరి 5న విడుదల చేస్తుందని అన్నారు. వచ్చే జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించేందుకు మార్చి ఒకటి దాకా యువత ఓటర్ల నమోదును చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 18-19 సంవత్సరాల వయసున్న యువ ఓటర్లు జనాభా ప్రాతిపదికన 12 లక్షలు వుండాల్సి వుండగా, కేవలం 3.5 లక్షల మంది మాత్రమే వున్నారని తెలిపారు. యువతను భాగస్వామ్యం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఇంటింటి వెరిఫికేషన్‌లో ప్రతి రాజకీయ పార్టీ వారి బూత్ స్థాయి ఏజెంట్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వబోమని అన్నారు. రాష్ట్రంలో ఒకే డోర్ నెంబర్‌తో 50 ఓట్లకు పైగా ఓటర్లు వున్న ఇళ్లు రెండు వేలకు పైగా వున్నాయని తెలిపారు. ఒకే ఫొటోతో వుండటం, ఇతర నియోజకవర్గాల్లో ఓటును కలిగి వుండటం వంటి కేసుల్లో ఇప్పటికే 10.20 లక్షల ఓట్లను తొలగించామన్నారు. ఓటర్లకు సంబంధించి ఆధార్ డేటాను 80 శాతానికి పైగా సేకరించామని, ఇప్పటి వరకు లింక్ చేయలేదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో తప్పులు జరిగితే ఉపేక్షించబోమని, ఇటీవల ఉరవకొండ నియోజకవర్గంలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుపుతున్నామని తుది నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా హనుమంతునిపాడు

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్‌కు జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డు దక్కింది. ప్రకాశం జిల్లాలోని హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్‌ను ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా కేంద్ర హోంశాఖ మంత్రిత్వశాఖ ఎంపిక చేసిన నేపథ్యంలో జిల్లా ఎస్‌పి, స్టేషన్ ఎస్‌ఐను డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం అభినందించారు. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో వారిని అభినందిస్తూ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కేంద్ర హోంశాఖ ప్రతియేటా దేశంలోని ప్రజలకు అత్యుత్తమమైన, మెరుగైన సేవలందించే పోలీస్ స్టేషన్లను వివిధ అంశాల్లో గుర్తించి, వాటిని అత్యుత్తమ పోలీస్ స్టేషన్లుగా ప్రకటిస్తుందని ఈ సందర్భంగా డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. నేరాల నియంత్రణ, లా అండ్ ఆర్డర్, చట్టాల అమలు, కేసుల దర్యాప్తు, విశ్లేషణ, కోర్టు సమన్లు, కోర్టు మానిటరింగ్, ప్రోయాక్టివ్ పోలీసింగ్, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, పెట్రోలింగ్ నిర్వహణ, పచ్చదనం పరిశుభ్రత నిర్వహణలో ఈ పోలీస్‌స్టేషన్ మెరుగైన సేవలు అందించినట్లు కేంద్ర హోంశాఖ గుర్తించిందని అన్నారు. అందులో భాగంగానే 2022కు గానూ హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైందని తెలిపారు. కేంద్ర హోంశాఖ అందించిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీను జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్, హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణపావనికి పంపామని చెప్పారు. ఈ మేరకు ఎస్‌పికి రూ.25 వేలు, ఎస్‌ఐకు రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని డిజిపి అందజేశారు. హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించారు.

సిఎంను కలిసిన రామ్‌గోపాల్ వర్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో రామ్‌గోపాల్ వర్మ కలిశారు. రానున్న ఎన్నికల నాటికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయోపిక్‌తో వర్థమాన రాజకీయ పరిస్థితులపై వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న వ్యూహం సినిమా నిర్మాణంపై చర్చించేందుకే వీరి భేటీ జరిగినట్లు తెలిసింది.

సిఎంను కుటుంబ సభ్యులతో పాటు కలిసిన విశాఖ ఎంపి

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖ ఎంపి కుటుంబ సభ్యులు, ఆడిటర్ కిడ్నాప్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించేందుకు విశాఖ ఎంపి సత్యనారాయణ తాడేపల్లికి వచ్చారు. సోమవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో ఎంపి సత్యనారాయణ ఆయన సతీమణి జ్యోతి, కుమారుడు శరత్‌తోపాటు ఆడిటర్ వెంకటేశ్వరరావు సిఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కిడ్నాప్ జరిగిన తీరును ముఖ్యమంత్రికి వారు వివరించినట్లు తెలిసింది.

'కండలేరు' బాధితులను ఆదుకుంటాం

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి -రాపూరు (నెల్లూరు జిల్లా)

టిడిపి అధికారంలోకి రాగానే కండలేరు జలశయానికి భూములిచ్చిన రైతులను ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం రాపూరు మండలం పెనుబర్తి విడిది కేంద్రం నుంచి ప్రారంభమైంది. ఓబుళాయపల్లె, అకిలవలస, మీదుగా రాపూరు వరకూ కొనసాగింది. అకిలవలసలో రచ్చబండ, ఏపూరు, ఓబుళాయపల్లి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కండలేరు జలాశయం కింద సుమారు 19 గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. ముంపులో ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వాలని జిఒ ఉందని, అయితే 10 కుటుంబాలకు కూడా ఉద్యోగాలు కల్పించలేదని వాపోయారు. లోకేష్ స్పందిస్తూ.. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే సమయంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కండలేరు జలాశయానికి భూములిచ్చిన రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు. వారికి స్వయం ఉపాధి రుణాలు అందజేస్తామన్నారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు, గత ఉత్తర్వులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్‌టిఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం ఆయన ఆకిలవలస గ్రామంలో మాతమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పాదయాత్రలో టిడిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు, అచ్చెన్న తదితరులు

175 స్థానాల్లో వైసిపిని అన్నింటా ఓడించాలి

మొదటి పేజీ తరువాయి

దీనికి కారణమని విమర్శించారు. నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. మార్కెట్‌లో యూనిట్ రూ.10 పెట్టి కొంటున్నారని ఆరోపించారు. గుడివాడలో టిడ్కో ఇళ్లు తానే నిర్మించానని జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. మహానాడులో ప్రకటించిన తొలిదశ టిడిపి మేనిఫెస్టోతో వైసిపికి ఏం చేయాలో అర్థం కావడం లేదన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తనతో సహా నాయకులు అనుకున్నంత స్థాయిలో ప్రజల్లో తిరగడం లేదన్నారు. ఇక నుంచి ప్రజల మధ్య ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. టిడిపి తొలిదశ మేనిఫెస్టోలో ప్రకటించిన 'భవిష్యత్‌కు గ్యారంటీ చైతన్య రథం' ప్రచార బస్సులను ఈ సందర్భంగా చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు యనమల రామకృష్ణుడు, టిడి జనార్ధన్, నిమ్మకాయల చినరాజప్ప, కిమిడి కళావెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కాల్వ శ్రీనివాసులు, బోండా ఉమామహేశ్వరరావు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు భద్రత లేదు

- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -చెరుకుపల్లి, బాపట్ల జిల్లా

అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు

రాష్టంలో ప్రజలకు భద్రత లేకుండా పోయిందని టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విమర్శించారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పాల వారిపాలెంలో హత్యకు గురైన పదవ తరగతి విద్యార్థి అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను చంద్రబాబు నాయుడు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఘటన తర్వాత నిందితులు నేరుగా పోలీస్ స్టేషన్ కి వెళ్లి కౌంటర్ కేసు పెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. తనపై పెట్రోల్ పోసి హత్యచేసేందుకు ప్రయత్నించిన వారి పేర్లను చనిపోయే ముందు అమర్‌నాథ్ స్పష్టంగా చెప్పినా పోలీసులు స్పందించక పోవడం శోచనీయమన్నారు. అక్కను కాపాడుకోబోయి తమ్ముడు సజీవ దహనమయ్యాడని తెలిపారు. మృతుడి సోదరునికి అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయా ఉద్యోగం ఇస్తామని చెబుతారా? వైసిపి ఎంపీ, మంత్రుల ఇంట్లో వాళ్లకు ఇలా జరిగితే ఊరుకుంటారా? అనిప్రశ్నించారు. విశాఖలో ఎంపి భార్య, కుమారుడిని కిడ్నాప్ చేశారు. అధికార పార్టీ ఎంపి కుటుంబానికే రక్షణ లేదంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌పేరుతో మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన బూర్లి దామోదర్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. ఆన్‌లైనులో ట్రేడింగు పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనకు వాట్సాప్ మెసేజ్ పంపడం, వాటికి దామోదర్ స్పందించడం వల్ల మోసపోయాడు. ఏప్రిల్ 15 నుంచి 27 మధ్య గుర్తుతెలియని వ్యక్తులకు రూ.9.25 లక్షలను పది దఫాలుగా పంపాడు. ఆన్‌లైనులో ట్రేడింగు చేయుట ద్వారా తాను పెట్టిన పెట్టుబడికి 30 శాతం లాభాలు ఇస్తామని నమ్మబలకడంతో వారు పంపిన లింకులకు డబ్బులను జమ చేశాడు. మొదట్లో తాను పెట్టిన చిన్న మొత్తాలకు నమ్మకం కలిగించేందుకు లాభాలను పంపారు. ఎక్కువ మొత్తంలో నగదు పంపినప్పుడు, ఇంకా డబ్బులు పంపాలని పదే పదే మెసేజులు చేసేవారు. ఆయనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం, తన డబ్బులు ఇచ్చేందుకు మరో రూ.5 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో తాను మోసపోయినట్లుగా గుర్తించాడు. వెంటనే, బుదరాయవలస పోలీసుస్టేషనులో తన వద్ద ఉన్న ఆధారాలతో ఫిర్యాదు చేశారు. చీపురుపల్లి సిఐ జి.సంజీవరావు ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆన్‌లైను మోసగాళ్ల వివరాలు సేకరించి, ఆయన పోగొట్టుకున్న రూ. 9.25 లక్షల్లో రూ. 8.24 లక్షలు రికవరీ చేసింది. అత్యాశతో అప్పులు చేసి, ఆన్‌లైను ట్రేడింగులో పెట్టుబడి పెట్టానని దామోదర్ తెలిపాడు. ఆన్‌లైను మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్‌పి కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, మెస్సేజులు, ఇ-మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబరు మోసాలకు గురైతే, వెంటనే 1930కు ఫిర్యాదు చేయ్యాలని కోరారు.

అద్భుతాలు చేస్తానని చెప్పను

- కాకినాడ పర్యటనలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

మత్స్యకారుల సమస్యలను తెలుసుకునేందుకు పడవలో వెళ్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పుతున్నట్లు తాను అద్భుతాలు చేస్తానని చెప్పబోనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వారాహి విజయ యాత్రలో భాగంగా సోమవారం కాకినాడలోని ఏటిమొగ్గ ప్రాంతంలో మత్స్యకారులతో భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేపల వేట విరామం వేళ ప్రభుత్వ జీవన భృతి అందడం లేదని, చమురు పరిశ్రమల వల్ల నష్టపోతున్నామని జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ మాట్లాడుతూ.."నేను ఎంతో నిబద్ధతతో జనసేన పార్టీని ప్రారంభించా. అధికారమే అంతిమ లక్ష్యం అనుకుంటే ఇంత కష్టపడాల్సిన పనిలేదు. నాకు ఉన్న సామర్థ్యానికి ఏదో పదవి పొందొచ్చు. ఈ సీఎంలాగా అద్భుతాలు చేస్తానని చెప్పడం లేదు. బటన్ నొక్కితే డబ్బులు పడతాయని కూడా చెప్పను"అని అన్నారు.

బాధ్యత లేని పాలకులు

అంతకు ముందు ఒక ప్రైవేటు హోటల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు, మేధావులు, డాక్టర్లు, లాయర్లు, విద్యావేత్తలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పవన్ సమావేశమయ్యారు. వారి రంగాల్లో ఎదురౌతున్న సమస్యలు, అనుభవాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. బాధ్యత లేని పాలకుల వల్ల వ్యవస్థ గాడి తప్పుతోందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'పాలకులు బాధ్యతగా వ్యవహరించనప్పుడు యంత్రాంగం సక్రమంగా పని చేయదు. ఒక చిన్నపాటి పరిశ్రమ స్థాపించాలని ఎవరైనా అనుకుంటే ఏళ్ల తరబడి అనుమతులు రావు. ఇలాంటి పరిస్థితుల మధ్య ఎందరో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల అతి పెద్ద ఆదాయ వనరుగా ఉన్న ఆక్వా పరిశ్రమ దెబ్బతిందని, ఒక విధానం లేని ఆర్గనైజేషన్ వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం అధ్యక్షులు వై.డి.రామారావు మాట్లాడుతూ.. అన్నవరం నుంచి గ్రీన్ ఫీల్డ్ పోర్టు, కాకినాడ పోర్టు, కోటిపల్లి, నరసాపురం మీదుగా రేపల్లె వరకూ రైల్వే లైన్ అవసరాన్ని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. కోస్తా రైలు మార్గం అంశాన్ని కూడా ప్రధాన మంత్రి మోడీ దృష్టికి తీసుకువెళ్తానని పవన్ తెలిపారు. జయలక్ష్మి బ్యాంక్ అక్రమాల గురించి, గత యాజమాన్యం చేసిన ఆర్థికపరమైన అవతవకలు, వేలాది మంది బాధితుల ఆవేదన గురించి ఆ బ్యాంక్ ఛైర్మన్ త్రినాథ్ తెలిపారు. ఈ భేటీలో పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, సభ్యుడు పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవాణి ట్రస్ట్'తో 2450 ఆలయాల నిర్మాణం

- రాజకీయ లబ్ధి కోసం ట్రస్ట్‌పై ఆరోపణలు : వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల:

సనాతన హిందు ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ ఏర్పాటు చేశామనిటిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సోమవారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పాలకమండలి నిర్ణయాలను వైవి సుబ్బారెడ్డి మీడియాకు తెలిపారు. ఒంటిమిట్టలో అన్నప్రసాద సముదాయ నిర్మాణం కోసం రూ.నాలుగు కోట్లు కేటాయించామని చెప్పారు. త్వరలో గుజరాత్ రాష్ట్రంలో గాంధీనగర్, చత్తీస్‌గడ్ రాయపూర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. టిటిడిపై కొంత మంది రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వైసిపి పాలకమండలి దోపిడి చేస్తున్నారనే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. ట్రస్ట్‌కు వచ్చిన విరాళాలతో దేశవ్యాప్తంగా 2450 ఆలయాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 275 పురాతన ఆలయాలను పున్జరుద్ధరణ చేస్తున్నామన్నారు. ట్రస్ట్‌కి వచ్చిన విరాళాల వ్యయానికి సంబంధించిన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. రాజకీయ లబ్ధి కోసం ట్రస్ట్‌పై ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తిరుమలపై తరుచు విమానాలు వెళ్లడంపై విచారణ జరుపుతామన్నారు. స్విమ్స్ హస్పిటల్స్ ఆధునీకరణ కోసం రూ.95 కోట్లు, కర్నూలు జిల్లా యాగంటిలో కల్యాణ మండప నిర్మాణం కోసం రూ.2.4 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తిరుమలలో రూ. 4.15 కోట్లతో అదనపు లడ్డు కౌంటర్లు నిర్మాణం, రూ. 2.35 కోట్లతో హెచ్‌విసి ప్రాంతంలో ఉన్న 144 గదులు ఆధునీకరణ చేస్తామన్నారు. రూ.1.88 కోట్లతో జిఎంసి, ఎస్ఎంసి ఉపవిచారణ కార్యాలయాలు ఆధునీకరణ చేయనున్నట్లు తెలిపారు.

ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న కేరళ మంత్రి చెంచురాణి

పశుసంవర్ధక శాఖ సేవలు భేష్ !

- కేరళ మంత్రి చెంచురాణి అభినందనలు

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు

రైతులకు పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జె చెంచురాణి తెలిపారు. కేరళ మంత్రులు, అధికారుల బృందంతో కలిసి ఆమె నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం, కోడూరు బీచ్ రోడ్డులో ఉన్న ప్రముఖ ఫర్జైల్ గ్రీన్ టిఎంఆర్ ఫ్యాక్టరీ (పశు దాణామృత తయారీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా కేరళ మంత్రి చెంచురాణి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు టిఎంఆర్ ద్వారా సమీకృత పశు దాణామతం అందించడం అభినందనీయమన్నారు. రైతులకు పశు సంవర్ధక శాఖ అందిస్తున్న మెరుగైన సేవలను ప్రశంసించారు. తమ రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులకు అనుగుణంగా పశుసంపదను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు ఇక్కడి పరిస్థితులపై అధ్యయనం చేసి తమ ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని చెప్పారు. తొలుత పశు దాణా ఫ్యాక్టరీ పనితీరు, యంత్రాల వినియోగం, నాణ్యత, సబ్సిడీ అందిస్తున్న వైనం తదితర విషయాలను ఫ్యాక్టరీ యజమాని శివ అభిరామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి సురేష్ బాబు, ఏడి డాక్టర్ బి. మురళీకృష్ణ, కోడూరు పశు వైద్యులు నరేష్, దువ్వూరు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున రిజర్వాయర్‌కు భూములివ్వం

- కలెక్టరేట్ ఎదుట మిడుతూరు మండల రైతుల నిరసన
- సంఘీభావం తెలిపిన ఎంపి పోచా, శాప్ ఛైర్మన్ బైరెడ్డి

నంద్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న మిడుతూరు మండలాల రైతులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా మిడుతూరు-ఓర్వకల్లు మండలాల మధ్య చేపడుతున్న మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణానికి తమ భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు కలెక్టర్‌కు తేల్చి చెప్పారు. గ్రామ సభలు, సర్వే పేరుతో సారవంతమైన భూముల జోలికి వస్తే సహించేది లేదన్నారు. 'మల్లికార్జున రిజర్వాయర్ వద్దు.. మా పొలాలు మాకు ముద్దు' అంటూ మిడుతూరు మండలంలోని చింతలపల్లి, ఖాజీపేట, దేవనూరు, పీరుసాహెబ్ పేట, సున్నంపల్లి, చౌట్కూరు, గుడిపాడు. గ్రామాల రైతులు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌కు భారీగా తరలి వచ్చి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఈ రిజర్వాయర్ నిర్మించడం వల్ల చింతలపల్లిలో 530 కుటుంబాలు, చౌట్కూరులో 890, గుడిపాడులో 145, దేవనూరులో 570, సున్నంపల్లిలో 160, ఖాజీపేటలో 198 కుటుంబాలకు చెందిన దాదాపు 12 వేల ఎకరాల విలువైన భూములను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోల్పోయి నిర్వాసితులు అవుతారని చెప్పారు. రైతులకు మద్దతుగా నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, శాప్ ఛైర్మన్, వైసిపి నాయకులు బైరెడ్డి సిద్దార్థ రెడ్డి... జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ అంశంపై కలెక్టర్ స్పందించారు. ఓర్వకల్లు-మిడుతూరు మండలాలలో దాదాపు 16 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణ పనులకు సంబంధించి సర్వే పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయని వెల్లడించారు. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. సర్వే పనులు జరుగుతున్నాయని, ఎక్కడ నిర్మించాలన్నది ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణ పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి సమర్పిస్తామని వివరించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకట రమణయ్య, ఎస్ఆర్‌బిసి ఈఈ శుభకుమార్, రైతులు వై.శేషిరెడ్డి, సురవలి బాషా, నాగేంద్ర, కాటమయ్య, వై.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో రిజర్వు టీచర్లు

- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సర్దుబాటు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతి మండల కేంద్రంలో రిజర్వు టీచర్లను ఉంచుతామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ప్రతి కేంద్రంలో సుమారు ఐదుగురు వరకు వీరు ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో సమగ్రశిక్షా కార్యాలయంలో సోమవారం ఆయన చర్చలు జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వు టీచర్లను ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామన్నారు. ఏదైనా పాఠశాలలో టీచర్ సెలవులో ఉంటే వీరిని ఆ సమయంలో అక్కడికి పంపుతామన్నారు. మొత్తం 9 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు రాష్ట్రంలో ఉన్నాయని వెల్లడించారు. ఉపాధ్యాయులకు బోధన తప్ప బోధనేతర పనులు చెప్పబోమని అన్నారు.

ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించామన్నారు. మొత్తం 1.75 లక్షల మంది ఉపాధ్యాయుల్లో 82 వేల మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. 56 వేల మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని చెప్పారు. బదిలీల్లో పొరపాటు జరిగినట్లు కొన్నిచోట్ల ఫిర్యాదులు అందాయని, వీటిని పరిశీలించి న్యాయం చేస్తామని అన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులను రెండో ఎంఇఒలుగా నియమించామని తెలిపారు. కొత్తగా 679 ఎంఇఒ పోస్టులను భర్తీ చేశామన్నారు. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తున్నామన్నారు. ఏదైనా పాఠశాలలో సబ్జెక్టు టీచర్ లేకపోతే దగ్గరలోని ఎస్‌సి, బిసి, ఎస్‌టి రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో వాచ్‌మెన్ పోస్టులకు ప్రభుత్వం అనుమతిచ్చిందని చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను కూడా త్వరలో భర్తీ చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాకానుక (జెవికె) కిట్ల పంపిణీ 78 శాతం పూర్తిచేశామని, మిగిలిన వాటిని వారంలో అందిస్తామన్నారు. సుమారు 60 వేల తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టివిలను ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు పార్వతి, జాయింట్ డైరెక్టర్లు మువ్వా రామలింగం, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

మహాధర్నాలో అభివాదం తెలుపుతున్న సహకారసంఘాల నాయకులు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విడనాడకపోతే ఉద్యోగులంతా సంఘటితంగా ప్రతిఘటిస్తామని రాష్ట్ర అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తోట వెంకట్రామయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సొసైటీ ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఉద్యోగులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన వెంకటరామయ్య మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా జగన్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. సహకార సంఘాల్లో 50శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సహకార సంఘాలను పటిష్ఠం చేస్తామని వాగ్దానం చేసిన సిఎం జగన్ ప్రస్తుతం సహకార సంఘాలనే ప్రయివేటుపరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, చట్ట సవరణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదే చట్టసవరణలో రైతు భరోసా కేంద్రాలను సహకార సంఘాల్లో విలీనంపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిఒ 36, 90 ప్రకారం వెంటనే వేతనాలు అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీని చట్ట ప్రకారం అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీలో లోటుపాట్లు సరిచేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ ఉద్యోగుల వేతన సవరణను డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతీ ఐదేళ్లకు ఒకసారి చేపట్టాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పి.విజయభాస్కర్, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు మాట్లాడారు. 2019 నుండి కొత్త వేతన సవరణ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. డిసిసిబి వెనక్కి కట్టించుకున్న ఆరుశాతం వడ్డీ రాయితీ వెంటనే సర్దుబాటు చేయాలని, 2010-11 నుండి నేటి వరకూ సహకార సంఘాల ధనంపై రావాల్సిన ఆరు శాతం డివిడెంట్ లేదా వడ్డీ వెంటనే చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డిజిఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు పికె.కృష్ణశాస్త్రి, ఎం.పెద్దిరాజు, పివి.నరసింహరాజు, పి.శ్రీనివాసరావు, సోని, పి.సుబ్బారావు, జి.వీరయ్య, వై.సర్వేశ్వరరావు, భీమేశ్వరరావు, నాయకత్వం వహించారు.

గుంటూరు ధర్నాలో పాల్గొన్న కార్మికులు, వివిధ సంఘాల నాయకులు

చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం

- ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా, నరసరావుపేట (పల్నాడు జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల చేనేత రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందని, దీంతో చేనేత కార్మికుల ఆత్మహత్యలు అధికమవుతున్నాయని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ వై కోటేశ్వరరావు, ఆర్ పరమేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ రూ.45 లక్షల కోట్లలో రూ.200 కోట్లు, రాష్ట్ర బడ్జెట్ రూ.2.70 లక్షల కోట్లలో రూ.200 కోట్లు మాత్రమే కేటాయించటం దీనికి ఉదాహరణ అని చెప్పారు. నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, చిలప నూలు, చేనేత వస్త్రాలపై విధించిన జిఎస్‌టిని తక్షణమే రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని షెడ్డు మగ్గాల నేతన్నలకూ, ఉప వృత్తుల కార్మికులకూ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం స్పందనలో అధికారులకు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ పూర్ణచంద్రరావు, డి రామారావు, కె కోటేశ్వరరావు, కె ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శివదుర్గారావు, జిల్లా కార్యదర్శి ఎ వీరబ్రహ్మం మాట్లాడారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ సొసైటీ సభ్యులు ఎస్ పోలయ్య, పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె వెంకటేశ్వర్లు, ఎ నాగప్రసాద్ పాల్గొన్నారు.

చేతబడికి విరుగుడు పేరిట రూ.9 లక్షలు స్వాహా

- నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - చాగలమర్రి

'నీ భర్తకు చేతబడి చేశారం'టూ ఓ మహిళతో నగ్న పూజలు చేయించి, రూ.9 లక్షలు కాజేసిన ఉదంతం నంద్యాల జిల్లా చాగలమర్రిలో వెలుగు చూసింది. బాధితురాలి ఫిర్యాదుతో నిందితులను సోమవారం అరెస్టు చేశారు. చాగలమర్రి ఎస్ఐ రమణయ్య కథనం మేరకు... ఇదే మండలానికి చెందిన ఓ మహిళ మూడేళ్లుగా తన భర్తకు ఆరోగ్యం సరిగా లేదని ఆందోళన పడుతుండడంతో దానిని గమనించిన రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన బత్తలూరి లక్ష్మి నాగమ్మ అలియాస్ బోయ సాయమ్మ 'నీ భర్తకు చేతబడి చేశార'ని బాధిత మహిళకు మాయమాటలు చెప్పింది. దీనికి విరుగుడు పూజలు చేయాలంటూ రూ.3 లక్షలు వసూలు చేసింది. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో చేతబడి బలంగా చేశారని, పెద్దస్వామి దగ్గర పూజలు చేయించాలని నంద్యాల మండలం చాబోలుకు చెందిన పోలూరు మహ్మద్ హుసేన్‌ను పిలిచి పరిచయం చేసింది. ఇద్దరు కలిసి బాధితుల నుంచి మరో రూ.6 లక్షలు వసూలు చేశారు. బాధితురాలితో సహా ఆమె కుటుంబంలోని మరో ముగ్గురికి ఒకరికి తెలియకుండా మరొకరికి చేతబడి పేరిట భయపెట్టి నగ్న పూజలు చేయించారు. బాధిత మహిళను బలవంతం చేసేందుకు ప్రయత్నించగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామంలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

వినిమయం పెరగొచ్చు..

- రూ.2వేల నోట్ల వెనక్కితో ఎస్‌బిఐ రీసెర్చ్

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఇటీవల రూ.2,000 నోట్ల ఉపసంహరించుకోవాలని ప్రకటించడంతో దేశంలో వినిమయం పెరగనుందని ఎస్‌బిఐ రీసెర్చ్ ఓ నివేదికలో పేర్కొంది. బ్యాంకు డిపాజిట్లు, రుణాల చెల్లింపు, వినియోగం, రిటైల్ డిజిటల్ కరెన్సీ వినియోగం సహా ఆర్థిక వృద్ధిని పెంచనుందని విశ్లేషించింది. రూ.2వేల నోటును ఉపసంహరించుకోవడం వల్ల వినియోగ డిమాండ్‌లో తక్షణ పెరుగుదల ఉండొచ్చని ఎస్‌బిఐ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు. " రూ.2వేల నోటును ఉపసంహరించుకునే క్రమంలోనూ చట్టబద్ధమైన టెండర్‌గా అవకాశం కల్పించడంతో వినియోగం ఊపందుకుంది. ముఖ్యంగా బంగారం, ఆభరణాలు, మొబైల్ ఫోన్‌లు, అత్యాధునిక వినియోగ వస్తువులు, రియల్ ఎస్టేట్ తదితర వాటి కొనుగోళ్లు పెరగొచ్చు" అని సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఇంధన కేంద్రాల్లో నగదు విలువ లావాదేవీలు, కొనుగోళ్లకు క్యాష్ ఆన్ డెలివరీ, దేవాలయాల్లో విరాళాలు, వివిధ రకాల కొనుగోళ్లు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. రూ.2000 నోట్ల ఉపసంహరణ వల్ల బ్యాంక్‌ల్లో రూ.1.5 లక్షల కోట్ల డిపాజిట్లు పెరగొచ్చని ఎస్‌బిఐ నివేదిక అంచనా వేసింది. 2023 మార్చి ముగింపు నాటికి దేశంలో రూ.3.62 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. వచ్చే సెప్టెంబర్ ముగింపు వరకు ఈ నోట్లను మార్చుకోవడానికి ఆర్‌బిఐ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.

నాలుగు నెలల్లో ట్రూజెట్ సేవల పునరుద్ధరణ

- ఎన్ఎస్ ఎయిర్‌లైన్స్‌కు 85 శాతం వాటా

హైదరాబాద్ : వచ్చే మూడు, నాలుగు నెలల్లో ట్రూజెట్ విమాన సేవలను పునరుద్ధరించనున్నట్లు ఎన్ఎస్ ఏవియేషన్ ఛైర్మన్ మహమ్మద్ అలీ, వైస్ ఛైర్మన్ ఇషా అలీ తెలిపారు. ట్రూజెట్‌లో తాము 85 శాతం వాటాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ట్రూజెట్ విలువను రూ.450 కోట్లుగా లెక్కించారన్నారు. వచ్చే ఆరు నెలల్లోనే 10 విమానాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. వచ్చే రెండేళ్లలో 30 ఎయిర్‌క్రాఫ్టలను తీసుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. ఇందుకోసం రూ.200-300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలంలో మొత్తంగా 100 ఎయిర్‌క్రాఫ్టలకు విస్తరించాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ట్రూజెట్ సేవలు ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాయన్నారు. తాము మానవ వనరులు, ఎయిర్‌క్రాఫ్టలను సమకూర్చుకున్న తర్వాత పునరుద్ధరణకు డిజిసిఎకు దరఖాస్తు చేసుకోనున్నామని పేర్కొన్నారు. 100 ఎయిర్‌క్రాఫ్టలను అందుబాటులోకి తీసుకురావడంతో 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ట్రూజెట్ సేవలను తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి ఉమేష్ పేర్కొన్నారు.

కేన్సర్ చికిత్సలో వినూత్న పరిష్కారాలు

ఎలెక్టా ఇండియా ఎమ్‌డి వెల్లడి

హైదరాబాద్ : కేన్సర్ చికిత్సలో వినూత్న పరిష్కారాలు అందించడమే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తుందని ఎలెక్టా ఇండియా ఎండి మణికందన్ బాలా పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలెక్టా అత్యాధునిక క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స యంత్రాలను తయారు చేస్తుందన్నారు. దేశంలోని 700 పైగా జిల్లాలుంటే.. అందులో వంద జిల్లాల్లో మాత్రమే క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం ద్వారా ఈ సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 2020లో 13.25 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని అన్నారు. ప్రతీ ఏడాది 12.48 శాతం పెరుగుదల చోటు చేసుకోవచ్చని నివేదికలు చెబుతున్నాయన్నారు.

ఎస్‌బిఐ లైఫ్ జనరల్ ఇన్సూరెన్స్ నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ బీమా కంపెనీ ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ హైదరాబాద్‌లో తన నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇది తెలంగాణ, కర్ణాటక, అమరావతిలలో తన ఉనికిని బలోపేతం చేసుకోవడానికి వీలు కల్పించనుందని ఆ సంస్థ పేర్కొంది. సోమవారం నూతన కార్యాలయాన్ని ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండి, సిఇఒ కిషోర్ కుమార్ పోలుదాసు, ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రాన్, అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝూ లాంచనంగా ప్రారంభించారు. దీని ద్వారా ఈ ప్రాంతాల్లో బీమా అవగాహనను మరింతగా పెంచడంతో పాటు, ఆర్థిక వ్యవస్థకు మద్దతును అందించనున్నామన్నారు.

మారుతీ ఇన్విక్టో బుకింగ్స్ ప్రారంభం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ప్రీమియం ఎస్‌యువి ఇన్విక్టోను జులై 5న ఇది మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. దీనికి ముందే నెక్సా షోరూంలలో, ఆన్‌లైన్‌లో బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. రూ.25,000 చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చని మారుతి సుజుకి వెల్లడించింది. 2.0-లీటర్ల పెట్రోల్ ఇంజిన్ విత్ స్ట్రాంగ్ హైబ్రిడ్ టెక్నలాజీ, ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, ఎమర్జెన్సీ బ్రేకింగ్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ తదితర ఫీచర్లతో ఆవిష్కరించింది. ఈ కారు ధర రూ.20 లక్షలకు దిగువన ఉండొచ్చని తెలుస్తోంది.

సంపాదకీయం

కరెన్సీ నోట్ల గాయబ్

పెద్ద నోట్ల రద్దు రాజ్యం చేసిన అతి పెద్ద కుంభకోణమని రూ.500 నోట్ల లెక్కల తకరారుతో మరోసారి రుజువైంది. డీ-మోనిటైజేషన్ పేరిట 2016 నవంబర్ 8న అప్పటికి చెలామణిలో ఉన్న 500, వెయ్యి నోట్లను మోడీ ప్రభుత్వం రద్దు చేసి పడేసింది. పాత ఐదొందల నోట్ల స్థానే కొత్త ఐదొందల నోట్లను ఆర్థిక వ్యవస్థలో ప్రవేశపెట్టగా అప్పుడు ముద్రించిన కొత్త ఐదొందల నోట్లు భారీగా గల్లంతయ్యాయన్న వార్తలతో యావత్ దేశం భయంకరమైన ఆశ్చర్యానికి గురైంది. ఆర్‌టిఐ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారంలో ఐదొందల నోట్ల మాయం గుట్టు రట్టయింది. ముద్రించిన 1,760 మిలియన్ (176 కోట్ల) రూ.500 నోట్లు ఆర్‌బిఐకి చేరలేదు. ఆ నోట్ల విలువ రూ.88 వేల కోట్లు. 2016-17 సంవత్సరంలో బెంగళూరులోని రిజర్వ్‌బ్యాంక్ నోట్ ముద్రాస్ (పి) లిమిటెడ్, నాసిక్ లోని కరెన్సీ నోట్ ప్రెస్, మధ్యప్రదేశ్‌లోని దేవస్ నోట్ ప్రెస్‌లలో కరెన్సీ నోట్లు ముద్రించారు. అప్పుడు ఆ మూడు ప్రెస్‌లలో కలిపి 8,810 మిలియన్ నోట్లు ముద్రించగా వాటిలో 7,260 మిలియన్ నోట్లు మాత్రమే ఆర్‌బిఐకి చేరాయి. 1,760 మిలియన్ నోట్ల జాడ లేదు. ఇంతటి కఠోర వాస్తవం ఆర్‌టిఐ ద్వారా బయల్పడ్డాక కూడా కేంద్ర రిజర్వు బ్యాంకు కానీ, ఆర్థిక మంత్రిత్వశాఖకాని నోరు మెదపట్లేదు.

కొన్ని రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌కు సమానమైన ద్రవ్యం గాయబ్ కావడం మామూలు విషయం కాదు. మన ఆర్థిక వ్యవస్థ సమగ్రతనే ఇది సవాల్ చేస్తున్నది. చిన్న చిన్న ఆర్థిక నేరాల విషయాల్లో, ప్రతిపక్షాలను సతాయించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి), ఐ.టి వంటి సంస్థలను రంగంలోకి దింపేందుకు తెగ ఉబలాటపడుతున్న మోడీ ప్రభుత్వంలో రూ.88 వేల కోట్ల విలువైన ఐదొందల నోట్లు కనబడకుండా పోయినా లవలేశ మాత్రం కదలిక లేదంటే ఏమనుకోవాలి? ప్రభుత్వానికి విషయం ఎరుకగానే భావించాలి. ప్రభుత్వ వ్యవస్థల అకౌంట్స్ విషయంలో ఏ చిన్న పొరపాటు దొర్లినా చర్యలు తీవ్రంగా ఉంటాయి. అలాంటిది దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఆర్‌బిఐలో, ముద్రించిన, తనకు తిరిగి చేరిన కరెన్సీ నోట్ల మధ్య భారీ వ్యత్యాసంపై నెలకొన్న ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తున్నది. నిజంగా నిర్లక్ష్యమే అయితే అంతకు మించిన బాధ్యతారాహిత్యం, నేరం మరొకటి ఉండదు. వెల్లువెత్తుతున్న సందేహాల నివృత్తికే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడకు సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇ.డి.లతో దర్యాప్తు చేయిస్తే అసలు రహస్యం బహిర్గతమవుతుంది. దోషులపై కఠిన శిక్షలు చేపడితే భవిష్యత్తులో ఇటువంటి ఘోరాలు పునరావృతం కాకుండా ఉంటాయి. ప్రజలు కోరుకుంటున్నదిదే.

డీ-మోనిటైజేషన్ అవాంఛిత వ్యవహారంగా ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇటీవల రూ.2 వేల నోట్ల ఉపసంహరణ వేళ పరోక్షంగా చెప్పారు. పెద్ద నోట్ల రద్దు లక్ష్యం అవినీతి, నల్లధనం, ఉగ్రవాదులకు నిధుల నియంత్రణ కోసమని ప్రధాని మోడీ కొండంత రాగం తీయగా ఆచరణలో అవేమీ అదుపులోకి రాలేదు. నాలుగైదు లక్షల కోట్ల నల్లధనం బయటపడుతుందనగా చెలామణిలో ఉన్న పెద్ద నోట్ల కంటే ఎక్కువ డబ్బు బ్యాంకులకు చేరి వైట్ అయింది. సంపన్నులు, కార్పొరేట్లు ఎంచక్కా తమ వద్ద ఉన్న బ్లాక్ మనీని వైట్ చేసుకున్నారు. తాజాగా ముద్రించిన ఐదొందల నోట్లలో కోట్లాది నోట్లు ఆర్‌బిఐకి చేరకపోవడం అటువంటిదే. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే, నిరసించే వారిపై మోడీ ప్రభుత్వం రాజద్రోహం, ఉపా ఇత్యాది కేసులను అక్రమంగా బనాయిస్తోంది. ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే, విచ్ఛిన్నం కావించే నోట్ల రద్దు, దాని వినాశకర పరిణామాలకు బాధ్యులైన వారిపై ఏ తరహా కేసులు పెట్టాలో మోడీ ప్రభుత్వమే చెప్పాలి. నోట్ల రద్దు వలన సామాన్యులు, పేదలు, కార్మికులు నానా అవస్థలూ పడ్డారు. ఇప్పటికీ వారి జీవనోపాధులు మెరుగుపడలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పట్టాలెక్కలేదు. నోట్ల రద్దును కొందరు స్కాంలకు ఉపయోగపెట్టుకుంటున్నారని రూ.500 నోట్ల గల్లంతుతో మరోసారి తేటతెల్లమైంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్ల విలువైన స్టాంపులు ఆచూకీ తెలియకుండా పోయాయి. ఇప్పటికీ చర్యల్లేవు. ఇప్పటి రూ.500 నోట్ల గల్లంతుపై సైతం అలానే వ్యవహరిస్తే ఆర్థిక వ్యవస్థకు వాటిల్లే పెనుముప్పునకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వుంటుంది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి దోషులను బోనులో నిలబెట్టాలి.

మహనీయుల మాట

కూలి పని వల్ల కార్మికుడికి ఆస్తి ఏమైనా పోగుపడుతోందా? వీసమంత కూడా లేదు. కూలి పని పెట్టుబడిని సృష్టిస్తుంది. అంటే కూలి పనిని దోచుకునే ఆస్తిని పుట్టిస్తుంది. మళ్లీ తాజాగా దోచుకోడానికి కూలీలను పుట్టిస్తే తప్ప పెరగలేని ఆస్తిని సృష్టిస్తుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,
కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

ఆర్థిక వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడితే...

ప్రభాత్ పట్నాయక్

ముందు శ్రీలంక, తర్వాత పాకిస్తాన్, తర్వాత తాజాగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న మరో పొరుగు దేశం బంగ్లాదేశ్. తాజాగా ఐఎంఎఫ్ నుండి బంగ్లాదేశ్ 450 కోట్ల డాలర్ల రుణాన్ని అర్థించింది. ఇదిగాక, ఇప్పటికే ప్రపంచ బ్యాంక్ నుండి 100 కోట్ల డాలర్లను, రుణదాతలుగా ఉండే దేశాల నుండి, ఏజన్సీల నుండి 250-300 కోట్ల డాలర్లను రుణంగా కోరుతోంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ వాణిజ్య లోటు రోజురోజుకూ పెరిగిపోతోంది. విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయి. కరెన్సీ విలువ పడిపోతోంది. ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో ఉంది. ఇంధన రంగంలో ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో విద్యుత్ కోతలు అమలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం బింకంగా, పెద్ద ఇబ్బందులేమీ లేనట్టు పైకి వ్యవహరిస్తోంది.

కొద్ది నెలల క్రితం వరకూ అందరూ బంగ్లాదేశ్ ఆర్థిక విజయగాథల గురించి గొప్పగా చెప్తూ వచ్చారు. ఆ ప్రచారాన్ని ప్రస్తుత పరిణామాలు పరిహసిస్తున్నాయి. స్త్రీలలో అక్షరాస్యత 73 శాతానికి చేరిందని, 1971లో పాకిస్తాన్ నుండి విడిపోయినప్పుడు ఎంత శాతం శిశు మరణాలు ఉండేవో, వాటిలో సగానికి ఇప్పుడు తగ్గిపోయాయని, మానవాభివృద్ధి సూచికలో ఇండియా కన్నా, పాకిస్తాన్, మరికొన్ని దేశాల కన్నా బంగ్లాదేశ్ ముందుందని నివేదికలు వెల్లడించాయి. ఈ అభివృద్ధి వాస్తవంగా చెప్పుకోదగ్గదే. చాలా మంది దీనిని ఒక ఆర్థిక అద్భుతంగా అభివర్ణించారు. బంగ్లాదేశ్ స్వతంత్రం సాధించిననాటికి అది చాలా బలహీనమైన ఆర్థిక వ్యవస్థగా ఉండేది. అటువంటిది తన పొరుగుదేశాల కన్నా వేగంగా అభివృద్ధి సాధించగలగడం నిజంగానే గొప్ప విషయం. అటువంటిది ఇప్పుడు ఆ దేశం ఉన్నట్టుండి ఇలా ఆర్థిక చిక్కుల్లో కూరుకుపోవడం చాలామందిని ఆశ్చర్యపరుస్తోంది.

శ్రీలంక విషయంలో చెప్పినట్టుగానే, ఇక్కడ కూడా ఈ పరిస్థితికి అవినీతి పెరిగిపోవడమే కారణం అని వ్యాఖ్యానించడం జరుగుతోంది. అవినీతి ఎక్కడైనా ఖండించవలసినదే, బంగ్లాదేశ్ ప్రస్తుత పరిస్థితికి అవినీతే కారణం అని చెప్పడం తేలికే. కాని అది అసలు కారణం కాదు. మరికొందరు చెప్తున్నది ఇలా ఉంది: ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో చాలా సరుకుల అంతర్జాతీయ ధరలు పెరిగిపోయాయని, అందువలన బంగ్లాదేశ్ దిగుమతి చేసుకునే సరుకులకు చెల్లించవలసిన మొత్తం పెరిగిపోయి, అందుకవసరమైన విదేశీ మారకపు నిల్వలు కాస్తా కరిగిపోయాయని వారంటున్నారు. మరోవైపు బంగ్లాదేశ్ ఎక్కువగా తన దేశ అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడుతుందని, ఇప్పుడు ఆ దిగుమతులు చేసుకునే శక్తి సన్నగిల్లడంతో దేశంలో సరుకుల ధరలు పెరిగిపోయి ద్రవ్యోల్బణానికి దారి తీసిందని, విదేశీ కరెన్సీ నిల్వలు తరిగిపోయినందువలన బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు విలువ తగ్గిపోయిందని, ఆ విధంగా పడిపోకుండా ఉండడానికి చేసిన ప్రయత్నాలు ఫలితాన్నివ్వలేదని వారు వివరిస్తున్నారు. ఈ వివరణలో ఒక లోపం ఉంది. ఇది కేవలం దిగుమతులపైనే తన ఫోకస్ అంతటినీ పెట్టింది. బంగ్లాదేశ్ నుండి జరిగే ఎగుమతుల్లో 83 శాతం రడీమేడ్ దుస్తులదే. ఇప్పుడు దాని ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఈ విషయాన్ని పై వివరణ పరిగణనలోకి తీసుకోలేదు.

కొందరు బంగ్లాదేశీ ఆర్థికవేత్తలు తమ ప్రభుత్వం అనుసరించిన ద్రవ్య విధానమే ఈ దుస్థితికి కారణం అని నిందిస్తున్నారు. వారి వాదన ఇలా ఉంది: బంగ్లాదేశ్ ప్రభుత్వం తన వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు పెంచకుండా స్థిరంగా చాలాకాలం కొనసాగించింది. ఒకవేళ వడ్డీరేట్లను వెంటవెంటనే పెంచివుంటే విదేశాలనుండి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడులు ఎక్కువగా దేశంలోకి వచ్చివుండేవి. వాటి తోడ్పాటుతో విదేశీ చెల్లింపుల లోటు ఏర్పడకుండా చూసుకోవడం సాధ్యం అయివుండేది. అప్పుడు బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు రేటు కూడా పడిపోకుండా నిలదొక్కుకోగలిగేది. కరెన్సీ మారకపు రేటు పడిపోయినందువలన ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రాకుండా నిలిచిపోయిన పరిస్థితి అప్పుడు ఏర్పడేది కాదు.

ఐతే ఈ వాదన కూడా పైపై పరిశీలనతో చేసినదే. బంగ్లాదేశ్ వృద్ధి సాధించడం కోసం అనుసరించిన వ్యూహంలోనే అసలు లోపం ఉంది. నయా ఉదారవాద కాలంలో చాలా ఇతర దేశాల మాదిరిగానే బంగ్లాదేశ్ కూడా ఎగుమతులను బాగా పెంచడం ద్వారా వృద్ధి సాధించాలనే వ్యూహాన్ని చేపట్టింది.

దాదాపు ఒక అర్ధ శతాబ్దం కాలంగా ఆర్థికవేత్తల మధ్య చర్చల్లో ఎగుమతులపై ఆధారపడి అభివృద్ధి సాధించాలనే వ్యూహం వెనుక విజ్ఞత ఏమిటన్న చర్చ ఒక భాగంగా ఉంది. తూర్పు ఆసియా దేశాలు సాధించిన "అద్భుతం"తో పోల్చితే భారతదేశంలో వృద్ధి చాలా మందకొడిగా ఉందంటూ పోలిక తెచ్చి ఆ విధంగా వృద్ధిరేటులో భారత్ వెనకబడిపోడానికి కారణం అది "లోలోపలికి ముడుచుకుపోయే దృష్టి"తో వ్యవహరించడమే అని ప్రపంచ బ్యాంక్ విమర్శిస్తూ వచ్చింది. ఐతే వాస్తవ జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించే ఒకానొక అంశాన్ని ఈ చర్చ పూర్తిగా విస్మరించింది.

ఒక దేశపు ఆర్థిక వ్యవస్థలో ఉండే మొత్తం డిమాండ్‌లో రకరకాల ఖర్చులు అంతర్భాగంగా ఉంటాయి. వీటిలో కొన్ని స్వయంప్రతిపత్తితో ఉంటాయి. అంటే ఇతర అంశాలమీద ఆధారపడకుండా ఉంటాయి. మరికొన్ని ఆ మొత్తం డిమాండ్ ఏ వేగంతో పెరుగుతోంది అన్న అంశంమీద ఆధారపడి వుంటాయి. ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం-ఈ రెండూ స్వయంప్రతిపత్తి కలిగిన ప్రధాన ఖర్చులు. ప్రజల వినిమయ ఖర్చు వారి వారి ఆదాయాల స్థాయిని బట్టి ఉంటుంది (ఒక్కోసారి అందుకు భిన్నంగా ప్రజల వినిమయం కూడా స్వయంప్రతిపత్తి తో వ్యవహరించే సందర్భాలు ఉంటాయి. ఉదాహరణకు: చాలాకాలంగా మార్కెట్‌లో లభించని సరుకు ఉన్నట్టుండి దొరకడం మొదలైతే ప్రజలు ఆ సరుకును తమ తమ ఆదాయాలతో నిమిత్తం లేకుండా కూడా కొంటారు.).

ఒక ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరిగినప్పుడే ఆ మేరకు ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అప్పుడే ఆ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తుంది. అందుచేత డిమాండ్‌ను పెంచాలంటే స్వయంప్రతిపత్తి కలిగిన అంశాలమీద దృష్టి పెంచాలి (అంటే ఎగుమతులను పెంచడం, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం). ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థలో దేశాల హద్దుల్ని స్వేచ్ఛగా దాటి ద్రవ్య పెట్టుబడులు ప్రవహించే పరిస్థితి ఉంది. ఆ పెట్టుబడుల ప్రవాహం ఆగిపోకుండా ఉండాలంటే ఏ దేశమైనా ఒకానొక స్థాయిని మించి తన బడ్జెట్‌లో ద్రవ్యలోటును పెరగనివ్వకూడదు. అదే సమయంలో ఆ విధానాల ఒత్తిడి కారణంగా తన దేశంలో సంపన్నులపై పన్నులను పెంచేందుకు ఏ ప్రభుత్వమూ సిద్ధం కాదు. అందువలన ప్రభుత్వ వ్యయాన్ని పెంచే అవకాశాలు పరిమితం అయిపోయాయి. ఇక వృద్ధి సాధించాలంటే ఎగుమతులను పెంచడం ఒక్కటే మార్గం. నయా ఉదారవాద వ్యవస్థ లో ఆర్థిక వృద్ధి ప్రధానంగా ఎగుమతులపైన ఆధారపడి జరుగుతుంది. ఇలా ఎగుమతులపై ఎక్కువగా దృష్టి పెట్టి ఏదైనా దేశం వృద్ధిసాధించవచ్చు. కాని ఏ దేశానికైనా వృద్ధిని కొనసాగించే విషయంలో ప్రభుత్వం పోషించే పాత్ర ఇరుసులాగా పని చేస్తుంది. తూర్పు ఆసియా దేశాల ప్రభుత్వాలు అటువంటి పాత్రనే పోషించాయని కొందరు వాదిస్తూంటారు కూడా.

ఎగుమతులను బాగా పెంచడం ద్వారా వృద్ధి సాధించాలనే దేశాలలో రెండు తరహాలవి ఉన్నాయి. వాటి మధ్య తేడాను మనం చూడగలగాలి. మొదటి తరహా దేశాలు ఒక క్రమ పద్ధతిలో తమ ఎగుమతులను పెంచుకుంటూ ఆ క్రమంలో వాణిజ్య చెల్లింపు ఖాతాలో మిగులు సాధించి తమ విదేశీ మారకపు నిల్వలను భారీగా పెంచుకుంటాయి. ఈ తరహా దేశాలకు ప్రధాన ఉదాహరణ చైనా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి ప్రతికూల పరిణామాలు వచ్చినా, ఆ ప్రభావం వలన ఆ దేశపు విదేశీ వాణిజ్య ఖాతాలో ఉన్న మిగులు కొంతమేరకు తగ్గుతుందే తప్ప అంతకు మించి ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ ఎటువంటి ఆర్థిక సంక్షోభంలోనూ చిక్కుపడిపోదు.

ఐతే, చాలా దేశాలు రెండో తరహాకు చెందుతాయి. ఈ దేశాల విదేశీ వాణిజ్య చెల్లింపుల ఖాతాలో ఎప్పుడూ లోటు కొనసాగుతూనే వుంటుంది తప్ప మిగులు ఉండదు. ఆ లోటును ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ప్రవాహాల సహాయంతో పూడ్చుకుంటూ వుంటాయి. వాటి వద్ద విదేశీ మారకపు నిల్వలు ఉంటాయి. ఐతే అవి ప్రధానంగా రుణాల ద్వారా సమకూర్చుకున్నవే. భారతదేశం ఈ కోవకే చెందుతుంది. దక్షిణాసియా దేశాలలో చాలా భాగం, మూడో ప్రపంచ దేశాలలో చాలా భాగం ఈ కోవకే చెందుతాయి.

ఈ తరహా దేశాలలో విదేశీ వాణిజ్య చెల్లింపుల ఖాతాలో లోటు ఒక్కోసారి వేరే వేరే కారణాల వలన పెరిగిపోవచ్చు. అది కరోనా కాలంలో టూరిస్టులు తగ్గిపోయినందువలన విదేశీ మారకపు ఆదాయం పడిపోవడం వంటిది కావచ్చు (శ్రీలంకలో జరిగినట్టు). లేదా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దిగుమతుల ధరలు పెరిగిపోయి లోటు పెరిగిపోవచ్చు. లేదా, ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం కారణంగా ఎగుమతులు తగ్గిపోయి దాని ఫలితంగా లోటు పెరిగిపోవచ్చు (బంగ్లాదేశ్‌లో ఈ రెండు కారణాలూ ప్రభావాన్ని చూపాయి). ఇటువంటి సమయాల్లో ఆ లోటును పూడ్చడానికి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ప్రవాహాలు బాగా అవసరం అవుతాయి. కాని సరిగ్గా అటువంటి సమయాల్లోనే ఆ ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి లోటును పూడ్చేబదులు దేశాన్ని వదిలిపెట్టి బైటకు పోతుంది. దానివలన ఆ లోటు మరింత పెరుగుతుంది. దేశం సంక్షోభంలో పడుతుంది.

ప్రైవేటు ద్రవ్య పెట్టుబడికి తన స్వంత లాభాలే ముఖ్యం. ఏ దేశం ఏమౌతుందోనన్న ఆందోళన దానికేమీ ఉండదు. ఒక దేశంలో స్థానిక కరెన్సీ విలువ పడిపోతే అక్కడ తమకు వచ్చే లాభాల విలువ కూడా తగ్గుతుంది గనుక ఆ ప్రైవేటు పెట్టుబడి అక్కడి నుండి బైటకు పోడానికే సిద్ధపడుతుంది. అప్పుడు విదేశీ మారకపు లోటు మరింత తీవ్ర సమస్యగా ఆ దేశానికి మారుతుంది. అటువంటి పరిస్థితుల్లో కూడా నయా ఉదారవాదులు, స్వేచ్ఛా మార్కెట్ వాదులు చెప్పినట్టు పరిస్థితులను మార్కెట్ శక్తులకే విడిచిపెడితే ఇక ఆ దేశంలో పరిస్థితి ఎన్నటికీ మామూలు స్థితికి రాదు. అప్పుడే ఆ దేశాల ప్రభుత్వాలు ఐఎంఎఫ్ వంటి సంస్థలను ఆశ్రయిస్తాయి. అక్కడినుండి లభించే రుణంతో విదేశీ చెల్లింపుల లోటు సమస్యను అధిగమించవచ్చునన్న అంచనాలు ఏర్పడగానే ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి అక్కడినుండి బైటకు పోవాలన్న ప్రయత్నాన్ని విరమించుకుంటుంది. ఎందుకంటే ఆ రుణం తోడ్పాటుతో ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోకుండా నిలబడుతుంది అన్న అంచనాకి వస్తుంది. ఐతే ఆ రుణానికి బదులుగా ఐఎంఎఫ్ చాలా భారీ మూల్యాన్నే కోరుతుంది. సంక్షేమ కార్యక్రమాలకి చేసే ఖర్చు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, ప్రభుత్వ రంగ ఆస్తులను విదేశీయులకు అప్పగించాలని - ఇలా ఉంటాయి ఐఎంఎఫ్ షరతులు.

నిజానికి విదేశీ చెల్లింపులలో లోటు పెరగడం అనేది మొదట చాలా స్వల్ప మోతాదులోనే ఉంటుంది. అది ఉన్నట్టుండి ఒక్కసారి అమాంతం భారీ లోటుగా పెరిగిపోవడం అనేది ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి పుణ్యమే. ఉన్నట్టుండి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ఆ దేశం నుండి ఉడాయించగానే విదేశీ చెల్లింపుల లోటు అమాంతం విపరీతంగా పెరిగిపోయి దాని నుండి బైటపడడానికి ఆ దేశ ప్రభుత్వం ఐఎంఎఫ్ ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుపోతుంది. ఆర్థిక వృద్ధిలో అద్భుతాలు సాధించిన దేశాలు ఉన్నట్టుండి బిచ్చమెత్తుకునే స్థితికి దిగజారిపోవడం ఇందువలనే జరుగుతుంది. ఎగుమతుల మీద ఆధారపడి సాధించే ఆర్థిక వృద్ధి పైకి ఒక విజయంలా కనిపించినా, ఒక్క దెబ్బకి అదంతా మటుమాయం అయిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, ఆ వృద్ధి అంతా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయ మీద ఆధారపడి వుంటుంది. ఆ ద్రవ్య పెట్టుబడి దురాశకే ఆ వృద్ధి కాస్తా బలైపోతుంది కూడా.

మన పొరుగు దేశాలలో ఇదే విధంగా జరిగింది. శ్రీలంక గాని, బంగ్లాదేశ్ కాని మొదట్లో మానవాభివృద్ధి విషయంలో చాలా మంచి విజయాలను సాధించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకోవడం, దాని వలన చాలా మూడో ప్రపంచ దేశాల ఎగుమతులు దెబ్బ తినడం ఫలితంగా ఇప్పుడు బిచ్చమెత్తుకునే దేశాల లిస్టు పెరుగుతోంది. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుంది. చాలా ఎక్కువ స్థాయిలో తమ వద్ద విదేశీ మారకపు నిల్వలు ఉన్నాయన్న ధీమా వలన ఉపయోగం లేదు. ఆ నిల్వల్లో ఎక్కువ భాగం వాణిజ్యంలో సాధించిన మిగులు వలన ఏర్పడిందేమీ కాదు. విదేశీ ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి అందులో అత్యధిక భాగంగా ఉంది. భారత దేశానికి ఉన్న ఒకే ఒక్క భరోసా ఏమిటంటే ఆహారధాన్యాల నిల్వలు మన దగ్గర బాగా ఉండడం (అది కూడా మన ప్రజలు అందరూ కడుపునిండా తినలేని పరిస్థితి వలన ఏర్పడిన నిల్వలే). ఇంకొక సానుకూల అంశం అమెరికా ఆంక్షలకు గురైన రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకునే వీలు ఉన్న అంతర్జాతీయ పరిస్థితులు. ఒకవేళ మోడీ చేసిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలు లోకి వచ్చివుంటే ఈ పాటికి మన ఆహార నిల్వలు కాస్తా కరిగిపోయి వుండేవి. అంటే ఇప్పుడు దేశాన్ని కాపాడినది ఆ రోజు రైతులు సాగించిన పోరాటమే.

రెండు ప్రపంచ యుద్ధాల నడుమ కాలంలో వచ్చిన అనుభవాలతో ఎగుమతులపై ఆధారపడి ఆర్థిక వృద్ధి సాధించాలన్న వ్యూహాన్ని చాలా దేశాలు విడిచిపెట్టాయి. నయా ఉదారవాద విధానాలు ముందుకొచ్చాక ఆ నాడు విడిచిపెట్టిన వ్యూహమే మళ్ళీ ముందుకొచ్చింది. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరొకసారి సంక్షోభంలో చిక్కుకుంది. అందుచేత ఈ వ్యూహానికి కాలం చెల్లే సమయం దగ్గరపడింది.

(స్వేచ్ఛానుసరణ)

> **రెండు ప్రపంచ యుద్ధాల నడుమ కాలంలో వచ్చిన అనుభవాలతో ఎగుమతులపై ఆధారపడి ఆర్థిక వృద్ధి సాధించాలన్న వ్యూహాన్ని చాలా దేశాలు విడిచిపెట్టాయి. నయా ఉదారవాద విధానాలు ముందుకొచ్చాక ఆ నాడు విడిచిపెట్టిన వ్యూహమే మళ్ళీ ముందుకొచ్చింది. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరొకసారి సంక్షోభంలో చిక్కుకుంది. అందుచేత ఈ వ్యూహానికి కాలం చెల్లే సమయం దగ్గరపడింది.**

> **ఎగుమతుల మీద ఆధారపడి సాధించే ఆర్థిక వృద్ధి పైకి ఒక విజయంలా కనిపించినా, ఒక్క దెబ్బకి అదంతా మటుమాయం అయిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, ఆ వృద్ధి అంతా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయ మీద ఆధారపడి వుంటుంది. ఆ ద్రవ్య పెట్టుబడి దురాశకే ఆ వృద్ధి కాస్తా బలైపోతుంది కూడా.**

కత్తిరింపులు

గాడ్సేను శ్లాఘించే పార్టీ!

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ముస్లిం మైనారిటీలపై అడ్డూ అదుపు లేని దాడులు, దానికి తోడు విద్వేష ప్రసంగాలు, మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేను శ్లాఘించడం... వంటి వాటితో 'అమృత కాలం' అసలు అర్థం బయటపడుతోంది.

మహారాష్ట్రలో, షిండే-బిజెపి ప్రభుత్వం ముస్లిం పేర్లు వున్న నగరాలన్నింటికీ ఆ పేర్లను రద్దు చేసి కొత్త పేర్లు పెడుతున్న ప్రక్రియను కొనసాగిస్తోంది. ఔరంగాబాద్ ఛత్రపతి శంభాజి నగర్‌గా మారింది. ఉస్మానాబాద్ ఇప్పుడు దారాశివ్ అయింది. అహ్మద్‌నగర్ జిల్లాను అహల్యాబాయి హోల్కర్ నగర్‌గా మార్చారు. ఈ మార్పులకు తోడు మెజారిటీవాదుల విజయం, ముస్లిం పాలకులు, చారిత్రిక వ్యక్తులను రాక్షసుల్లాగా చిత్రీకరించడం జరుగుతోంది. దీనికి ముందు, మహారాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నెలల పాటు 'హిందూ జన ఆక్రోశ్ మోర్చా' ర్యాలీలు 50 నిర్వహించారు. ఈ ర్యాలీలు ముస్లింల పట్ల విద్వేషాన్ని, హిందూ మతోన్మాదాన్ని బహిరంగంగానే ప్రదర్శించాయి.

అహ్మద్‌నగర్ జిల్లా లోని షిర్‌గావ్ గ్రామంలో మత హింస చోటు చేసుకుంది. ఆ వెంటనే కొల్హాపూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఈ పరిస్థితికి కారణం "ఔరంగజేబ్ వారసుల"ని మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్థాయిలో హోం మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ బిజెపి నేత ఇటువంటి ప్రకటన చేయడం చూస్తుంటే ఉన్నత స్థాయి పదవుల్లో వున్న వారు అనుసరించే విద్వేష రాజకీయాలు ఎలాంటివో తెలుస్తున్నాయి.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో, ముస్లింలను వారి స్థానాల్లో వుంచి ఆర్థికంగా వారిని దెబ్బ తీయడమనేది ఉద్దేశ్యపూర్వకంగా అనుసరిస్తున్న విధానంగా కనిపిస్తోంది. ఉత్తరాఖండ్‌లో, ముస్లింలు జనాభాలో చాలా తక్కువ సంఖ్యలో వున్నారు. ఉత్తర కాశీ లోని పురోలాలో ముస్లిం దుకాణదారులను వారి దుకాణాలను ఖాళీ చేయాల్సిందిగా కోరారు. ముస్లిం దుకాణాలకు నల్లటి క్రాస్ గుర్తు పెట్టి జూన్ 15 తేదీకల్లా వాటిని ఖాళీ చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మైనర్ బాలికను అపహరించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తుల ప్రమేయం వుందని వెల్లడి కావడం అందులో ఒకరు ముస్లిం యువకుడు కావడం ఇందుకు కారణంగా వుంది. ఇప్పటికే మార్కెట్‌లో కొంతమంది ముస్లింలు తమ దుకాణాలను మూసివేసి వెళ్లిపోయారు. ఇతర ప్రాంతాల్లో కూడా బజార్లను వీడి వెళ్లాల్సిందిగా ముస్లిం వ్యాపారస్తులను డిమాండ్ చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఇటువంటి ముస్లిం విద్వేషమే విద్వేష రాజకీయాలు, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి మతోన్మాదంలో భాగంగా వుంది. ఇటీవల, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, నాథూరామ్ గాడ్సేను భారత 'పుత్రుడి'గా అభివర్ణించారు. "ఆయన మహాత్మా గాంధీ హంతకుడైనా...భారతమాత పుత్రుడు కూడా." అని పేర్కొన్నారు. గాడ్సేను ఇలా కీర్తించడమనేది బిజెపి నాయకత్వానికి నిత్యకృత్యమై పోయింది. గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు వెలువడడానికి కొద్ది రోజులు ముందు, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ మాట్లాడుతూ, "గాంధీజీ హత్యకు గురయ్యారు. అది వేరే విషయం. కానీ గాడ్సే కూడా దేశభక్తుడే." అని పేర్కొన్నారు. అంతకు ముందు, 2019లో, భోపాల్ బిజెపి ఎం.పి, తీవ్రవాద కేసులో నిందితురాలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ, గాడ్సేను దేశభక్తుడిగా కీర్తించారు. కర్ణాటకకు చెందిన బిజెపి ఎం.పి నళిన్‌కుమార్ కటీల్ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. "గాడ్సే ఒకరినే చంపారు కానీ రాజీవ్ గాంధీ 17 వేల మందిని చంపారు." అన్నారు. ఇలా అన్ని స్థాయిల్లో బిజెపికి గాడ్సే పట్ల ప్రేమ చూపించడమన్నది సర్వసాధారణంగా మారింది. గాంధీ విద్వేషకుడు సావర్కర్ పట్ల ఆరాధన కూడా దీనితో పాటూ కోరస్‌గా వినిపిస్తూ వుంటుంది.

గాడ్సేను శ్లాఘిస్తూ హిందూత్వ దేశాన్ని స్థాపించాలనుకుంటున్న పార్టీ 'నూతన భారత దేశం' గురించి చెప్తున్నదిదే.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో మనం వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వున్నాం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నాము. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేశాం. కానీ మొత్తం మీద ఆరోగ్య రంగం అసమానతలతో ఉంది.



ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతి పది మందిలో ఒకరికి బి.పి, 30 ఏళ్లు నిండిన ప్రతి 8 మందిలో ఒకరికి మధుమేహం ఉంటున్న పరిస్థితి. దీనినిబట్టే ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో 26 శాతం, పట్టణాల్లో 30 శాతం మంది బి.పి బాధితులున్నారని అంచనా. అదే డయాబెటిస్ విషయానికొస్తే పల్లెల్లో 20 శాతం, పట్టణాల్లో 25 శాతం షుగర్ బాధితులున్నారు. చాలామంది అవగాహన లేక, నిర్లక్ష్యంతో మాత్రమే ఈ రెండు ప్రమాదకర జబ్బులు నియంత్రించుకోలేకపోతున్నారని తెలుస్తోంది. కేవలం ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవాటు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండటమని నిర్వచించారు. శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు.

స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్ళు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి.

శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లు వ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.

-డా. యం. అఖిలమిత్ర,
ప్రకృతి వైద్యులు

ఢిల్లీ శాంతి భద్రతల రక్షణకు తక్షణ చర్యలు అవసరం : స్వాతి

న్యూఢిల్లీ : ఢిల్లీ శాంతి భద్రతల రక్షణకు తక్షణ చర్యలు అవసరమని ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు) చీఫ్ స్వాతి మాలివల్ పేర్కొన్నారు. 'నేరస్థులకు ఈ రోజు చట్టం అంటే భయం లేదు. దేనినుంచైనా తప్పించుకోవచ్చునని నేరస్థులు భావిస్తున్నారు. దేశరాజధానిలో శాంతి భద్రతల రక్షణకు తక్షణ చర్యలు అవసరం' అని స్వాతి మాలివాల్ సోమవారం ట్వీట్ చేశారు. ఢిల్లీలో ఒక ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థి, మరో ఇద్దరు అక్కాచెల్లెళ్లను దారుణంగా హత్య చేసిన నేపథ్యంలో స్వాతి ఈ ట్వీట్ చేశారు.

పొగాకు నమిలేస్తున్నారు!

- ప్రతి ఆరింటిలో ఒక కుటుంబానిది ఇదే స్థితి
- పొగ రహిత పొగాకును వినియోగించే జనాభా 21.4 శాతం
- ఇది ధూమపాన పొగాకు ఉత్పత్తుల వాడకం కంటే అధికం
- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి

భారత్‌లో పొగాకు వినియోగం ఆందోళనకరంగా మారింది. ఇది ఇప్పటికే లక్షలాది మంది ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నది. వారిని అనారోగ్యాలకు గురి చేస్తున్నది. దేశంలో నిషేధం ఉన్నప్పటికీ.. రూపాలు మార్చుకొని మరీ విక్రయాలు జరుగుతున్నాయి. గుట్కా, పొగాకు ఉత్పత్తి కంపెనీలు తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయి. ధూమపాన పొగాకు ఉత్పత్తుల కంటే పొగ రహిత పొగాకు వినియోగం భారత్‌లో అధికంగా ఉన్నది. భారత్‌లోని ప్రతి ఆరు కుటుంబాల్లో ఒక కుటుంబం పొగాకు నములుతున్నవారి జాబితాలో ఉన్నది. లోకల్‌సర్కిల్స్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది.

న్యూఢిల్లీ : పొగాకు ఉత్పత్తులు దేశంలోని ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పొగాకు వినియోగంపై ఎన్ని అవగాహనా కార్యక్రమాలు, ప్రచారాలు చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఫలితం కనబడటం లేదు. ముఖ్యంగా, ధూమపాన పొగాకు కంటే నమిలే పొగాకు వినియోగం భారత్‌లో అధికంగా ఉన్నది. దేశంలోని ప్రతి ఆరు కుటుంబాల్లో ఒక కుటుంబం నమిలే పొగాకును వినియోగిస్తున్నది.

లోకల్‌సర్కిల్స్ సర్వే సమాచారం ప్రకారం.. భారత్‌లో 2012 నుంచి గుట్కాతో సహా అన్ని రకాల పొగలేని పొగాకు నిషేధించబడింది. గుట్కాలను ఉత్పత్తి చేసే కంపెనీలు మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తూ నిషేధాన్ని అధిగమించటానికి మార్గాలను అన్వేషిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో గుట్కాపై నిషేధం, పొగాకు నియంత్రణ అవసరమని ది లాన్సెట్ నివేదిక హెచ్చరించింది.

క్యాన్సర్‌లో 55 శాతం టొబాకో వినియోగంతోనే

వారణాసిలో జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రకారం.. భారత్‌లో ప్రమాదకర క్యాన్సర్ వ్యాధిలో 55 శాతం టొబాకో వినియోగానికి సంబంధించినవే. ప్రపంచంలోనే భారత్ పొగాకు ఉత్పత్తి, ఎగుమతిలో మూడో స్థానంలో ఉన్నది. భారత్‌లో పొగ రహిత పొగాకును ఉపయోగిస్తున్న జనాభా (పెద్దలు) 21.4 శాతంగా ఉన్నది. ఈ సంఖ్య.. ధూమపాన పొగాకును వినియోగిస్తున్న జనాభా (పెద్దలు) 10.7 శాతం కంటే అధికంగా ఉండటం గమనార్హం.

కఠిన చర్యలను కోరుతున్నవారు 81 శాతం మంది

ఇక సర్వేలో పాల్గొన్నవారిలో 83 శాతం మంది గుట్కా లేదా ఇతర నమలగల పొగాకు ఉత్పత్తులను వినియోగించటం లేదని తెలిపారు. పది శాతం మంది మాత్రం కుటుంబంలోని ఒక వ్యక్తి దానిని వినియోగిస్తున్నట్టు చెప్పారు. మొత్తమ్మీద ఈ సర్వేలో పాల్గొన్న కుటుంబాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం ప్రతి ఆరు భారతీయ కుటుంబాలలో ఒక కుటుంబం (ఇందులో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది).. గుట్కా లేదా ఇతర నమలగల పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్న జాబితాలో ఉన్నది. నమిలే పొగాకు ఉత్పత్తులు, అమ్మకాలపై నిషేధం తప్పనిసరిగా విధించాలని 81 శాతం మంది కోరారు. 19 శాతం మంది వద్దన్నారు. అంటే ప్రతి పది మంది భారతీయులలో 8 మంది ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

భారత్‌లో జోరుగా పాన్ మసాలా వ్యాపారం

ఇటు భారత్‌లో పాన్ మసాలా వ్యాపారం జోరందుకున్నది. ఎంట్రప్రెన్యూర్ ఇండియా సమాచారం ప్రకారం.. భారత్‌లో ఈ వ్యాపారం 2020లో రూ.42,200 కోట్లకు చేరుకున్నది. 2021-26 మధ్య ఈ వ్యాపారంలో వృద్ధి పది శాతం ఉంటుందనీ, రూ.74,760 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. లోకల్‌సర్కిల్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ సర్వేను భారత్‌లోని 318 జిల్లాల్లో గల 34 వేల మందిని సంప్రదించి సమాచారాన్ని సేకరించారు. 66 శాతం మంది పురుషులు కాగా, 34 శాతం మంది మహిళలు ఉన్నారు.

వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడులు

- మైనర్‌సహా అయిదుగురు పాలస్తీనియన్ల కాల్చివేత
- 29 మందికి తీవ్రగాయాలు

జెరూసలేం : అక్రమిత వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ నగరంలో సోమవారం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక మైనర్‌తో సహా అయిదుగురు పాలస్తీనియులు మృతి చెందారు. మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. మృతులను 15 ఏళ్ల అహ్మద్ సాకర్, ఖలేద్ అససా (21), ఖస్సమ్ అబు సారియా (29)గా గుర్తించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒక వీడియోలో ఇజ్రాయిల్ సైన్యం హెలికాప్టర్‌తో జెనిన్ నగరంపై రాకెట్లతో దాడి చేస్తున్న దృశ్యం కనిపిస్తోంది. వెస్ట్‌బ్యాంక్‌పై ఏడాదికిపైగా కాలం నుంచి ఇజ్రాయిల్ సైన్యం దాడులకు పాల్పడుతోంది. ఈ ఏడాదిలోనే ఇప్పటి వరకూ 120 మంది పాలస్తీనీయుల్ని ఇజ్రాయిల్ సైన్యం దారుణంగా హత్య చేసింది.

ఉత్తరాదిలో వడగాడ్పులు

- మూడు రోజుల్లో 98 మంది మృతి

లక్నో : వడగాలులతో ఉత్తరాది రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలోనే గత 3 రోజుల్లో 98 మంది దాకా మరణించారు. మరో 400 మంది అస్వస్థతతో ఆసుపత్రుల్లో చేరారు. యుపిలో పలు జిల్లాల్లో కొన్ని రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒక్క బలియా జిల్లాలోనే 3 రోజుల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. గడిచిన 24 గంటల వ్యవధిలో ఇక్కడ 34 మంది చనిపోవడం కలవరపెడుతోంది. యుపిలో అనేక ప్రాంతాల్లో కొన్ని రోజులుగా 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బలియా జిల్లాలో వడగాల్పుల కారణంగా 400 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ నెల 15న 23 మంది, తరువాత రోజు 20 మంది, తాజాగా 11 మంది ప్రాణాలు కోల్పోయారని బలియా జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారి మరణానికి అనేక అంశాలు కారణమని, అందులో వడదెబ్బ ఒకటని చెప్పారు. జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితోపాటు ఇతర కారణాలతో బాధితులు ఆసుపత్రిలో చేరుతున్నారని, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, డయేరియాలతో చనిపోతున్నారని తెలిపారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్లకు పైబడిన వారేనని బలియా ఆసుపత్రి సూపరింటెండెంట్ దివాకర్ సింగ్ తెలిపారు.

బిహార్‌లోనూ మూడు రోజుల్లో 44 మంది చనిపోగా కేవలం రాజధాని పాట్నాలోనే 35 మంది ప్రాణాలు కోల్పోయారు. నలందా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో 19 మంది, పిఎంసిహెచ్‌లో 16 మంది మృతి చెందారు. మరో 9 మరణాలు ఇతర జిల్లాల్లో నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బిహార రాష్ట్ర వ్యాప్తంగా వడగాల్పుల తీవ్రత కొనసాగుతున్న దృష్ట్యా అక్కడి విద్యా సంస్థలకు ఈ నెల 24 వరకు సెలవులను పొడిగించారు.

సలార్ టీజర్‌కు టైం ఫిక్స్

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ జోనర్ ప్రాజెక్ట్ 'సలార్'. ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మాలీవుడ్ స్టార్ హీరో పృథ్విరాజ్ సుకుమారన్ కీ రోల్ పోషిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. చిత్రం టీజర్ లాంచ్‌కు టైం ఫిక్సయినట్టు తెలిపారు.సలార్ టీజర్/ఫస్ట్ గ్లింప్స్ ను ఈ నెల చివరలో లేదా జులై మొదటివారంలో విడుదల చేసేందుకు రెడీ అవుతుందని సమాచారం. సెప్టెంబర్ 28న సలార్ విడుదల కానుంది. సలార్ రెండు పార్టులుగా రాబోతుంది. హోంబ్యానర్ హోంబలే ఫిలిమ్స్‌పై విజయ్ కిరగందూర్ తెరకెక్కిస్తున్నారు.

'భగవంత్ కేసరి' కాజల్ ఫస్ట్ లుక్

అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న 'భగవంత్ కేసరి' చిత్ర షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుండి కాజల్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. సోమవారం కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలచేసిన ఈ పోస్టర్‌లో ఆమె సైకాలజీ పుస్తకం చదువుతూ ఫోన్‌లో మాట్లాడుతూ కనిపిస్తోంది. భగవంత్ కేసరి మూవీని దసరా కానుకగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు.

'గాండీవధారి అర్జున' కొత్త పోస్టర్

వరుణ్ తేజ్ హీరోగా, ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గాండీవధారి అర్జున' చిత్రం నుండి తాజాగా పోస్టర్ విడుదలైంది. ఈ చిత్రంలో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోమవారం సాక్షి వైద్య పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ పతాకం పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఆగస్ట్ 25, 2023న వరల్డ్ వైడ్‌గా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.

జులైలో 'బవాల్'



చిన్న, పెద్ద సినిమాలు తేడాలు లేకుండా కొన్ని సినిమాలు ఓటీటీలోకి నేరుగా వస్తున్నాయి. ఈ క్రమంలో ఓ ఆసక్తికర చిత్రం నేరుగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటించిన మూవీ 'బవాల్'. షాజిద్ నదియాడ్‌వాల్ నిర్మాత. థియేటర్‌లో విడుదల కావాల్సిన ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదికగా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది. జులై నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అమెజాన్ ప్రైమ్ వీడియో తెలిపింది. 200 దేశాల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. 'ప్రతి ప్రేమ కథ ఒక యుద్ధమే' అని క్యాప్షన్‌లో పేర్కొన్నారు. ప్రేమ, యుద్ధం నేపథ్యంలో 'బవాల్' కథ సాగనున్నట్లు అర్థమవుతోంది.

'కీడా కోలా'.. ఏంటో ప్రపంచం రోజు రోజుకు వింతగా..



తరుణ్ భాస్కర్ ప్రాజెక్టు 'కీడా కోలా' నుండి తాజాగా తాతా అంటూ బ్రహ్మానందం క్యారెక్టర్‌ను వర్ణిస్తూ మేకర్స్ మరో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. క్రైమ్ కామెడీగా వస్తున్న ఈ చిత్రం నుండి గతంలోనే బ్రహ్మానందం పోస్టర్ విడుదలైంది. ఒకప్పుడు వరద రాజులు పేరు చెప్తేనే జిల్లాలు జిల్లాలు భయపడేవి. ఇప్పుడు తన వేలు పట్టుకుని పెరిగిన మనవడు కూడా దేకట్లేడు. ఏంటో ప్రపంచం రోజు రోజుకు వింతగా మారిపోతుందంటూ ఆయన క్యారెక్టర్ స్వభావం గురించి చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమా టీజర్ మరో పది రోజుల్లో విడుదల కాబోతుంది. వీజి సైన్మా, క్విక్ ఫాక్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. టీజర్ డేట్ వరకు ప్రతీ రోజు ఓ క్యారెక్టర్‌ను రివీల్ చేస్తున్నట్లు మేకర్స్ రెండు రోజుల క్రితమే వెల్లడించారు.

సంక్రాంతి బరిలో 'ఇండియన్-2'

హీరో కమల్‌హాసన్ నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ 'ఇండియన్ 2'. శంకర్ దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఈ నెల చివరికల్లా పూర్తి కానుందని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా పోస్టర్ ఒకటి విడుదల చేశారు. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ కథాంశంతో వస్తున్న ఈ చిత్రంలో బాబీ సింహా, సిద్దార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్‌జే సూర్య విలన్‌గా నటిస్తున్నాడు. లైకా ప్రొడక్షన్స్ -రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్-సుభాస్కరన్ ఇండియన్ 2 చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

నితీష్ ప్రభుత్వానికి హెచ్‌ఎం(ఎస్) మద్దతు ఉపసంహరణ

పాట్నా : బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) (హెచ్ఎఎం(ఎస్)) మద్దతు ఉపసంహరించుకున్నట్లు సోమవారం ప్రకటించింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లెఖర్‌కు ఉపసంహరణ పత్రాన్ని కూడా సమర్పించింది. మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ నివాసంలో సోమవారం జరిగిన పార్టీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నితీష్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంది. అయితే హెచ్ఎఎం మద్దతు ఉపసంహరణతో నితీష్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు 122 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా.. నితీష్ ప్రభుత్వానికి సుమారు 160 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది.

కాగా, గతవారంలో మంత్రి పదవికి మాంఝీ కుమారుడు, హెచ్ఎఎం(ఎస్) జాతీయ అధ్యక్షులు సంతోష్ సుమన్ రాజీనామా చేశారు. జనతాదళ్ (యు)లోకి తమ పార్టీని విలీనం చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

తమిళనాడులో రెండు బస్సులు ఢీ..

- నలుగురు మృతి

కడలూరు: తమిళనాడులోని కడలూరు జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 70 మంది గాయపడ్డారు. కడలూరు-పన్రుటి మధ్య రెండు ప్రైవేట్ బస్సులు వెళ్తున్నాయి. ఒక బస్సు ముందు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే నలుగురు మరణించారు. 70 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు కడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, చికిత్స పొందుతున్న వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

నిరుద్యోగుల ఓట్లకు గాలం !

రోజ్‌గార్ మేళాలు నేతి బీరకాయలో నెయ్యి చందమే

న్యూఢిల్లీ : నేతి బీరకాయలో నెయ్యి ఉండడం ఎంత వాస్తవమో మోడీ ప్రభుత్వం ప్రారంభించిన రోజ్‌గార్ మేళాలలో ఉద్యోగాల కల్పన కూడా అంతే వాస్తవం. ఈ సంవత్సరం లోగా పది లక్షల పోస్టులను భర్తీ చేయడమే లక్ష్యంగా చేపట్టిన 'మిషన్ రిక్రూట్‌మెంట్' ప్రక్రియ నిరుద్యోగ యువత ఓట్లకు గాలం వేయడం కోసమేనన్నది జగమెరిగిన సత్యం. ఓ వైపు ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ మరోవైపు ఇలాంటి మేళాలు జరపడం ద్వారా లక్ష్యం ఏ విధంగా నెరవేరుతుందో ప్రభుత్వానికే తెలియాలి. పైగా వివిధ శాఖలలో శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకుంటూ కాలక్షేపం చేస్తోంది. ఇక కాంట్రాక్ట్ ఉద్యోగాల సంగతి సరేసరి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. పేరుకు రోజ్‌గార్ మేళాలు అని చెబుతున్నప్పటికీ ఇవన్నీ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆర్ఆర్‌బీ వంటి నియామక సంస్థలు చేపట్టినవే. అంటే సాధారణంగా జరిగే నియామక ప్రక్రియలకే ప్రభుత్వం ఓ కొత్త పేరు పెట్టి తానేదో నిరుద్యోగులను ఉద్ధరిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. దేశ రక్షణలో ఎంతో కీలకమైన త్రివిధ దళాలలో శాశ్వత నియామకాలకు మంగళం పాడిన కేంద్రం, అగ్నివీర్ పేరిట నిర్దిష్ట కాలపరిమితికి లోబడిన నియామకాలకు తెరతీసి నిరుద్యోగులతో ఆటలాడుతున్న విషయం తెలిసిందే. నిజానికి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ఆ తర్వాత నిరుద్యోగుల ఊసే మరిచిపోయారు. తొమ్మిది సంవత్సరాల పాటు పోస్టుల భర్తీకి ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వని మోడీకి ఇప్పుడు హఠాత్తుగా నిరుద్యోగులు గుర్తుకొచ్చారు. 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాకుండా చూసుకునేందుకే ఇప్పుడు నిరుద్యోగులకు వల విసిరారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆరు రోజ్‌గార్ మేళాలు నిర్వహించింది. 4,30,546 మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని చెబుతోంది. అయితే 2022 మార్చి నాటికి ఖాళీగా ఉన్న పది లక్షల పోస్టులను 18 నెలలలో భర్తీ చేయాలని ప్రధాని మోడీ గత సంవత్సరం జూన్‌లో అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం అక్టోబర్ 14న తొలి రోజ్‌గార్ మేళా జరిగింది. భర్తీ చేసినట్లు ప్రభుత్వం చెప్పుకుంటున్న పోస్టులలో 1.38,986 పోస్టులు రైల్వేలకు చెందినవి. అయినప్పటికీ ఇంకా లక్షలాది పోస్టులు ఆ శాఖలో ఖాళీగానే ఉన్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, ఉన్న వారిపై ఒత్తిడి పెరగడం వల్లనే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తపాలా శాఖలో 68,225 పోస్టులు, హోం శాఖలో 43,592 పోస్టులు భర్తీ చేశామని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫైనాన్స్ సర్వీసులలో 33.743 పోస్టులు, రక్షణ రంగంలో 18,635, రెవెన్యూ శాఖలో 14,952, ఉన్నత విద్యలో 11,536 పోస్టులు భర్తీ అయ్యాయి. ఈ నియామకాలలో ఎక్కువగా గ్రూప్ బీ, గ్రూప్ సీ పోస్టులకు సంబంధించినవే.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ప్రకటన నం.17-డిప్యూటీ సిఇ-జిఎస్-జిఎన్‌టి తేది: 17.06.2023
PUB/0661

క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న పనుల కొరకు **10.07.2023న 15:30గం.ల వరకు** ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

1. **టెండరు ఐడి:** 43, **సెక్షన్:** డిప్యూటీ సిఇ/జిఎస్/జిఎన్‌టి. **పని వివరణ:** గుంటూరు యార్డు వద్ద 8.20కి.మీ.-ట్రాక్ పోర్షన్ మల్టిట్రాకింగ్& కనెక్టివిటీ. **సుమారు విలువ రూ.లలో:** 65375034.51, **ధరావత్తు:** రూ. 476900.00.
2. **టెండరు ఐడి:** 44, **సెక్షన్:** డిప్యూటీ సిఇ/జిఎస్/జిఎన్‌టి. **పని వివరణ:** గుంటూరు యార్డు వద్ద 8.20కి.మీ.-బ్రిడ్జెస్ పోర్షన్ మల్టిట్రాకింగ్& కనెక్టివిటీ. **సుమారు విలువ రూ.లలో:** 90564641.70, **ధరావత్తు:** రూ. 602800.00.
3. **టెండరు ఐడి:** 45, **సెక్షన్:** డిప్యూటీ సిఇ/జిఎస్/జిఎన్‌టి. **పని వివరణ:** గుంటూరు యార్డు వద్ద 8.20కి.మీ.-బిల్డింగ్ పోర్షన్ మల్టిట్రాకింగ్& కనెక్టివిటీ. **సుమారు విలువ రూ.లలో:** 294686093.50, **ధరావత్తు:** రూ. 1623400.00.

1. ఇ-బిడ్స్‌ను ఆన్‌లైన్‌లో దాఖలుచేయుట కొరకు చివరి తేది 10.07.2023న 15.30గం.ల వరకు. వివరణాత్మక సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లాగిన్ చేయండి.
2. ఏవేని తదుపరి సమాచారం/సవరణను ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడుతుంది.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, గాటి శక్తి, గుంటూరు

ఇ-టెండరు ప్రకటన నం. 01/డిప్యూటీ సిఎస్‌టిఇ/సి-2/ఎస్‌సి/2023-24, తేది: 16.06.2023.
PUB/0662

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ (నిర్మాణము-2), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పని కొరకు **1ఎ0.07.2023**న 15.00గం.ల వరకు సంబంధిత అధికారి ఆమోదంతో ఇ-టెండరు (బహిరంగ)ను కోరుచున్నారు.

1. **టెండరు నం.:** సి-ఎస్‌జి-సి-36-5-191-2023. **పని పేరు:** ద.మ.రైల్వే యొక్క సికింద్రాబాద్ డివిజన్ యొక్క చర్లపల్లి స్టేషన్ వద్ద సాటిలైట్ టెర్మినల్ సదుపాయాల అభివృద్ధితో సంబంధించి చెర్లపల్లి స్టేషన్& స్టేషన్ బిల్డింగ్ వద్ద ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్& నెట్‌వర్కింగ్& సర్వేలియన్స్ డిజిటల్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటుచేయుట. **సుమారు విలువ:** రూ.15,30,35,593/- **బిడ్ సెక్యూరిటీ:** రూ.9,15,200/-, **పూర్తి కాలవ్యవధి:** 06 నెలలు.

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ www.ireps.gov.in ను లాగిన్ చేయండి.
2) బిడ్ సెక్యూరిటీ చెల్లింపు ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా డిపాజిట్‌చేయాలి లేదా ఇండియా యొక్క ఒక షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంక్ నుండి బ్యాంకు హామీ బాండ్‌గా దాఖలుచేయవలెను.
3) టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండరు ముగింపుకు ముందు పదిహేను రోజుల కాలవ్యవధిలోగా ఏదైతే టెండరు దాఖలుచేయు కాలవ్యవధిలో దాఖలుచేయవలెను.
4) టెండరుదారులు ఏవేని సవరణలను (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడును) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి ప్రారంభ తేదీ వరకు వీక్షించవచ్చును.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్, (నిర్మాణము-2), సికంద్రాబాద్.

ఇ-టెండరు ప్రకటన నం.02/డిప్యూటీ సిఎస్‌టిఇ/సి-1/ఎస్‌సి/2023-24, తేది: 17.06.2023
PUB/0663

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ (నిర్మాణము-1), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పని కొరకు సంబంధిత అధికారి ఆమోదంతో **10.07.2023న** 15.00గం.ల వరకు ఇ-టెండరు (బహిరంగ)ను ఆహ్వానిస్తున్నారు.

1. **టెండరు నం.:** సి-ఎస్‌జి-సి-36-5-194-2023. **పని పేరు:** (1) కెజడ్‌జె-బిపిక్యూ సెక్షన్‌లో మూడవ లైన్ పనులతో సంబంధించి మానిక్‌ఘర్ (ఎంఎజిహెచ్)-బల్హార్ష (బిపిక్యూ) మధ్య మూడవ లైన్‌తో సంబంధించిన ఔట్‌డోర్ సిగ్నలింగ్& టెలికమ్యూనికేషన్ పనులు. (2) ద.మ.రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ లో కెజడ్‌జె-బిపిక్యూ సెక్షన్‌లో మూడవ లైన్ పనులతో సంబంధించి మందమర్రి (ఎంఎంజడ్)-బెల్లంపల్లి (బిపిఎ)-రెచ్ని రోడ్ (ఆర్ఇసిహెచ్) మరియు అసిఫాబాద్ రోడ్ (ఎఎస్ఎఎఫ్)-సిర్పూర్ కాగజ్‌నగర్ (ఎస్‌కెజడ్‌ఆర్) మధ్య హెచ్‌డిపిఇ డక్ట్& కేబుల్స్, బ్లోవింగ్ యొక్క ట్రెంచింగ్, లేయింగ్, బ్యాక్ ఫిల్లింగ్, జాయింటింగ్ స్ప్లిసింగ్& 6 క్వాడ్ కేబుల్ టెర్మినేషన్, ఓఎఫ్‌సి& ఇండోర్ టెలికం ఇక్విప్మెంట్స్ ఇన్‌స్టాలేషన్ పనులు. (3) ఆన్‌గోయింగ్ మూడవ లైన్ పనులతో సంబంధించి మందమర్రి (ఎంఎంజడ్)-బల్హార్ష (బిపిక్యూ) సెక్షన్‌లో చిన్నపాటి సిగ్నలింగ్& టెలికమ్యూనికేషన్ పనులు. **సుమారు విలువ రూ.** 9,02,54,954.39 పై.లు, **బిడ్ సెక్యూరిటీ రూ.** 6,01,300/-, **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 నెలలు.

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్.www.ireps.gov.inను లాగిన్ చేయండి.
2) బిడ్ సెక్యూరిటీ చెల్లింపును ఇ పేమెంట్ గేట్‌వే ద్వారా నగదులోగాని డిపాజిట్‌చేయవచ్చును లేదా ఇండియా యొక్క ఒక షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంక్ న ఉండి బ్యాంక్‌హామీ బాండ్‌ద్వారా దాఖలుచేయవచ్చును.
3) టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండరు దాఖలుచేయు కాలవ్యవధి అనగా., టెండరు ముగింపుకు ముందు పదిహేను రోజుల కాలవ్యవధిలోగా దాఖలుచేయవచ్చును.
4) టెండరుదారులు ఏవేని సవరణ (ఆన్‌లైన్ మాత్రమే జారీఅవుతాయి)ను టెండరు దాఖలుచేయు కాలవ్యవధి ప్రారంభ తేది వరకు వీక్షించవచ్చును.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్& టెలికమ్యూనికేషన్ ఇంజినీర్, (నిర్మాణము-1), సికింద్రాబాద్.

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. డిప్యూటీ సిఇ/సిపిఓహెచ్/ఆర్‌వైపి/2023/06 ఆఫ్ తేది: 17.06.2023
PUB/0664

భారత రాష్ట్రపతి తరపున, క్రింది సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతి దానికి ఎదురుగా పేర్కొన్న తేదీన మరియు 10.07.2023న 15:00గం.ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

1. **టెండరు నం.:** ఇ-06-జోన్-సిపిఓహెచ్-ఆర్‌వైపి-2023. **పని పేరు:** రాయనపాడు: 01.07.2023 నుండి 30.06.2024 వరకు గల కాలవ్యవధి కొరకు డిప్యూటీ సిఇ/సిపిఓహెచ్/ఆర్‌వైపి లో సర్వీస్ భవనాలు, నీటి ట్యాంకులు మరియు రోడ్డు మొ॥నవి అన్ని పనులు. **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 (పన్నెండు) నెలలు (30.06.2024 వరకు), **టెండరు విలువ:** రూ.18,00,000/-, **ధరావత్తు:** రూ.36,000/- **ముగింపు తేది:** 10.07.2023.

1. ఆసక్తిగల టెండరుదారులు ఏవేని టెండరు కొరకు ఏవేని మార్పుచేర్పులను గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.inను దర్శించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/టిఎం/సిపిఓహెచ్/రాయనపాడు

ఇ-టెండరు నం. బి/ఎస్‌జి/సిఎన్/ఎస్& టి/జిఎన్‌టి/5/2023-24, తేది: 19.06.2023 ఆహ్వానపు టెండరు ప్రకటన (www.ireps.gov.in ద్వారా)
PUB/0665

భారత రాష్ట్రపతి తరపున సిగ్నల్ & టెలికం (నిర్మాణము), దక్షిణ మధ్య రైల్వే, జిఎన్‌టి, విజయవాడ వద్ద వారు దిగువ పని కొరకు, బహిరంగ టెండరు/సింగిల్ ప్యాకెట్ సిస్టమ్ టెండరింగ్ క్రింద ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

1. **టెండరు ప్రకటన నం.** బి/ఎస్‌జి/సిఎన్/ఎస్& టి/జిఎన్‌టి/5/2023-24, తేది: 19.06.2023. **పని పేరు:** ఎస్‌సిఆర్ యొక్క ఎస్‌సి డివిజన్ యొక్క కెఐ-కెజడ్‌జె సెక్షన్ మధ్య ట్రాక్ యొక్క ట్రిప్లింగ్‌తో సంబంధించి యెర్రుపాలెం (వైపి)-పందిలపల్లి (పిఎన్‌డిపి) సెక్షన్ మధ్య హెచ్‌డిపిఇ డక్ట్& కేబుల్స్, బ్లోవింగ్, బ్యాక్ ఫిల్లింగ్, జాయింటింగ్, స్ప్లిసింగ్& 6 క్వాడ్ కేబుల్ యొక్క టెర్మినేషన్, ఓఎఫ్‌సి& ఇండోర్ టెలికం ఇక్విప్మెంట్స్ ఆన్నాలేషన్ పనులు యొక్క ట్రెంచింగ్, లేయింగ్. **టెండరు విలువ:** రూ. 6,81,21,233.60పై.లు **పూర్తిచేయు కాలవ్యవధి:** 09 నెలలు. **ముగింపు తేది& సమయం:** 11.07.2023న 15:00గం.లు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ www.ireps.gov.inను లాగిన్ చేయండి.
2. టెండరుదారులు వారి ఆఫర్లను టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి కాలంలో ఆన్‌లైన్‌లో ఏదైతే టెండరు ముగింపుకు ముందు పదిహేను రోజుల కాలవ్యవధిలో దాఖలుచేయవలెను.
3. టెండరుదారులు ఏవేని సవరణను (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడును)ను టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలవ్యవధి ప్రారంభ తేది వరకు వీక్షించవలెను.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్, (నిర్మాణము), జిఎన్‌టి, విజయవాడ వద్ద.
A0929

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ

నెం.51DDRPL/2023-24 | ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు | తేది: 17.06.2023

నిజాంపట్నం మండలం- పాలరేవు గ్రామ సమీపంలోని రేపల్లె ప్రధాన మురుగుకాలువ సముద్ర ముఖద్వారం వద్ద గల అవుట్ ఫాల్ స్లూయిస్ యొక్క ఆటో ఫ్లాప్ షట్టర్స్‌లకు మరమ్మత్తులు. **పని విలువ: రూ. 26.95 లక్షలు.** టెండరు షెడ్యూల్ లభ్యమగు తేది : 19.06.2023, ఉ.11గం. నుండి. తదుపరి వివరాలను https://tender.apeprocurement.gov.in లో పొందగలరు. ఫోన్ నెం. 7901093266.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, మురుగు నీటి పారుదల విభాగం, రేపల్లె
DIPRNo.9865/CL/ADVT/1/1/2021-22

బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 యొక్క సెక్షన్ 102 యొక్క సబ్-సెక్షన్ (1) క్రింద)
శ్రీ కొంగర నవీన్ యొక్క రుణదాతలు శ్రద్ధవహించుట కొరకు

సంబంధిత వివరాలు		
1.	వ్యక్తిగత/వ్యక్తిగత హామీదారు పేరు	శ్రీ కొంగార నవీన్
2.	వ్యక్తిగత/వ్యక్తిగత హామీదారు చిరునామా	తండ్రి కొంగార సుబ్బా రావు, ఫ్లాట్ నం.502, కెవి మాన్షన్, జీరో లైన్, చంద్రమౌళి నగర్, గుంటూరు-522007, ఆం.ప్ర. రాష్ట్రం, **మరియు:** 3075, దెనాలి డ్రైవ్, ఐఆర్‌విఐఎన్‌జి, టిఇయక్స్‌ఎఎస్-75063 యుఎస్‌ఎ.
3.	ఐబిసి యొక్క సెక్షన్ 95 క్రింద చేసిన ఇన్‌సాల్వెన్సీ రీసొల్యూషన్ దరఖాస్తు తేది (ఏదైతే ఇంటెరిం మోరటోరియం ప్రారంభ తేది)	21-06-2022
4.	డెటర్ పై ఇన్‌సాల్వెన్సీ రీసొల్యూషన్ ప్రారంభ ఆర్డర్ వివరాలు	CP (IB) No. 197/95/HDB/2022, Dated: 14-06-2023 (ఆర్‌పికి 19.06.2023న ఆర్డర్ లభించింది)
5.	క్లెయిలు దాఖలుచేయుట కొరకు చివరి తేది	11-07-2023
6.	రీసొల్యూషన్ ప్రొఫెషనల్ గా వ్యవహరిస్తూ ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు& రిజిస్ట్రేషన్ నంబరు	గోవడ వెంకట సుబ్బా రావు Reg. No.:IBBI/IPA-003/IP-N00358/2021-2022/13753
7.	బోర్డుతో రిజిస్టరైనట్లుగా రీసొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా& ఇ-మెయిల్	రాజీవ్ స్వగృహ అపార్టుమెంట్స్, బ్లాక్ ఎ 05, ఫ్లాట్ 106, క్లాసిక్ డైమండ్ టవర్స్, ఆనంద్ నగర్, జిఎస్ఐ బండ్లగూడ, డి-మార్ట్ ప్రక్కన, హైదరాబాద్, తెలంగాణ-500068. ఇమెయిల్: govada.subbarao1@gmail.com
8.	రీసొల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదించుట కొరకు వినియోగించు ఇ-మెయిల్ & చిరునామా	రాజీవ్ స్వగృహ అపార్టుమెంట్స్, బ్లాక్ ఎ 05, ఫ్లాట్ 106, క్లాసిక్ డైమండ్ టవర్స్, ఆనంద్ నగర్, జిఎస్ఐ బండ్లగూడ, డి-మార్ట్ ప్రక్కన, హైదరాబాద్, తెలంగాణ -500068. ఇమెయిల్: govada.subbarao1@gmail.com
9.	సంబంధిత ఫారాలు ఇచ్చట అందుబాటులోగలవు	వెబ్ లింక్: https://www.ibbi.gov.in/home/downloads

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, **మెసర్స్ పావన కీర్తి హోటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్** యొక్క వ్యక్తిగత హామీదారు కొరకు **మెసర్స్ పృథ్వి అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్** ద్వారా ఐబిసి యొక్క సెక్షన్ 95 క్రింద 14.06.2023న **శ్రీ కొంగర నవీన్** యొక్క ఇన్‌సాల్వెన్సీ రీసొల్యూషన్ ప్రాసెస్ ప్రారంభం చేయవలసిందిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్, బెంచ్-1 వారు ఆదేశించారు.

శ్రీ కొంగర నవీన్ యొక్క రుణదాతలు, ఇందుమూలంగా ప్రవేశం నం.8 పై పేర్కొన్న చిరునామా వద్ద రీసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు **11.07.2023**న లేదా ముందుగా రుజువుతో ఎలక్ట్రానిక్ సమాచారం లేదా కొరియర్/స్పీడ్ పోస్టు లేదా రిజిస్టర్డు పోస్టు రూపేనా వారి క్లెయింలను దాఖలుచేయవలసిందిగా కోరబడినది.

గమనిక: అబద్ధపు లేదా తప్పు త్రోవ పట్టించు క్లెయింలు దాఖలుచేసినచో, ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 యొక్క నియమాలు మరియు ఏవేని ఇతర వర్తించు చట్టాతో అనుసరించి జరిమానా లేదా జైలు శిక్షకు బాధ్యులగుదురు.

తేది: 20.06.2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- గోవడ వెంకట సుబ్బారావు
రీసొల్యూషన్ ప్రొఫెషనల్
IBBI/IPA-003/IP-N00358/2021-2022/13753

అదంతా వాపే!

2014, 2019 ఎన్నికల ఫలితాలపై ప్రతిపక్షాలు
మోడీ మ్యాజిక్ ఇప్పుడు పనిచేయదని వ్యాఖ్య

న్యూఢిల్లీ : 2014, 2019 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి సాధించిన విజయాలను లోతుగా పరిశీలిస్తే అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2019 ఎన్నికలలో బిజెపి 105 స్థానాలలో మూడు లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. 2014 ఎన్నికలలో సాధించిన స్థానాల కంటే 2019లో ఆ పార్టీకి 63 సీట్లు అధికంగా వచ్చాయి. ఇదంతా బిజెపి ప్రభంజనమే అని చెప్పడానికి ఏ మాత్రం వీలు లేదు. ప్రతిపక్షాల మధ్య ఐక్యత లేకపోవడం వల్లనే బిజెపి ఆ విజయాలను సొంతం చేసుకోగలిగంది. 2024 ఎన్నికలలో ప్రతిపక్షాలు ఏకం కావాల్సిన ఆవశ్యకతను ఈ గణాంకాలు చాటిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 23న 18 ప్రతిపక్ష పార్టీలు పాట్నాలో సమావేశమవుతున్నాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని మట్టి కరిపించేందుకు ఓ సంఘటిత వ్యూహాన్ని రూపొందించే ప్రయత్నం చేయబోతున్నాయి.

2019 లోక్‌సభ ఎన్నికలలో 236 మంది అభ్యర్థులు రెండు లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. వీరిలో 164 మంది బిజెపికి చెందిన వారు. మూడు లక్షలకు పైగా మెజారిటీతో గెలుపొందిన 131 మందిలో నూట ఐదుగురు బిజెపి వారే. మిగిలిన 26 మందిలో 10 మంది డిఎంకెకు, ఐదుగురు కాంగ్రెస్‌కు చెందిన వారు ఉన్నారు. బిజెపికి ప్రధాన ప్రత్యర్థిగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ ఓట్ల శాతం 2014, 2019 ఎన్నికలలో సమానంగానే ఉంది. అయితే బిజెపి ఓట్ల శాతం పెరిగింది. 2014 ఎన్నికలలో బిజెపికి 31 శాతం ఓట్లు, 282 సీట్లు వస్తే 2019లో 37 శాతం ఓట్లు, 303 సీట్లు లభించాయి. ఈ రెండు ఎన్నికలలోనూ రాజస్థాన్, ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో బిజెపి ఘన విజయాలు సాధించింది. మూడు లక్షలకు పైగా బిజెపి మెజారిటీ వచ్చిన స్థానాలు కూడా ఈ రాష్ట్రాలలో ఎక్కువగానే ఉన్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే బిజెపి ఓట్ల శాతం పెరిగినా ఆ దామాషాలో సీట్లు పెరగలేదు.

బిజెపి సాధించిన ఈ భారీ ఆధిక్యతలు చూసి ప్రతిపక్షాలు పెద్దగా కలవరపడాల్సిన అవసరం లేదని ప్రొఫెసర్, లోక్‌నీతి సంస్థ సమన్వయకర్త సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. 2014, 2019 ఎన్నికలలో బిజెపి పనితీరు 2024 ఎన్నికల ఫలితాలపై ఎలాంటి సంకేతాన్ని ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. ఎందుకంటే ప్రతి ఎన్నిక భిన్నంగా ఉంటుందని, ప్రస్తావనకు వచ్చే అంశాలు కూడా వేర్వేరుగానే ఉంటాయని తెలిపారు. భాగస్వామ్య పక్షాలు మారుతుంటాయని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాయి. బిజెపి అభ్యర్థులు సాధించిన భారీ ఆధిక్యతలు 2024 ఎన్నికలపై ప్రభావం చూపబోవని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. అదంతా బలుపేనని వ్యాఖ్యానించాయి. మోడీ మ్యాజిక్ ఇప్పుడు పనిచేయదని తెలిపాయి. గత ఎన్నికల ఫలితాల గణాంకాలు విశ్లేషిస్తూ కూర్చోవడం నిష్ప్రయోజనమని కాంగ్రెస్ డాటా ఎనలిటిక్స్ విభాగం ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి చెప్పారు. అది భారీ మెజారిటీ ఎలా అవుతుందని చక్రవర్తి ప్రశ్నించారు. 'నలభై శాతం కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకోవడం ముఖ్యం. 2014తో పోలిస్తే 2019లో బిజెపికి అధిక స్థానాలు వచ్చాయన్నది వాస్తవం. అయితే గతమెంతో ఘనకీర్తి అని చెప్పుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ద్రవ్య మార్కెట్లు సైతం ఇదే సూత్రాన్ని పాటిస్తాయి' అని తెలిపారు.

2014, 2019 ఎన్నికలలో ప్రజల ఆలోచన ఒకేలా ఉందని, అందుకే ఆ అజెండాకు ఓటేశారని సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి ఘనశ్యామ్ తివారీ చెప్పారు. ఆ ఎన్నికలలో అభ్యర్థులు నిమిత్తమాత్రులని, అంతా మోడీ మాయాజాలం నడిచిందని తెలిపారు. ఆనాడు బిజెపి అభ్యర్థులు సాధించిన భారీ మెజారిటీలు వారి సొంత బలంపై తెచ్చుకున్నవి కావని గుర్తు చేశారు. అభ్యర్థులు తమ సొంత బలంపై ఓట్లు సాధిస్తే దానిని పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. 2014, 2019 ఎన్నికల ఆధారంగా 2024 ఎన్నికలు జరగబోవని తివారీ స్పష్టం చేశారు. 2024 ఎన్నికలకు సొంత అజెండా ఉందని చెప్పారు. బిజెపికి ప్రస్తుతం అజెండా అంటూ ఏదీ లేదని, అది ప్రజల మనసుల్లో లేని అజెండాను చొప్పించి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఏ పార్టీకి ఓటేయాలో ప్రజలు మానసికంగా ఇప్పటికే నిర్ణయించుకున్నారని, సమయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు.

2019లో పరిస్థితులు వేరుగా ఉన్నాయని, అప్పుడు పుల్వామా దాడి జరిగిందని మాజీ ఎంపీ, తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి కీర్తి ఆజాద్ అన్నారు. ఇప్పుడు ప్రజలకు తెలిసి వచ్చిందని, బిజెపి ప్రచారం శుష్క వాగ్దానాలు, మతోన్మాద చర్యలపై ఆధారపడి ఉందన్న విషయం వారికి అర్థమైందని ఆయన చెప్పారు.

మయన్మార్‌లో 5.1 తీవ్రతతో భూకంపం

మయన్మార్ : మయన్మార్‌లో సోమవారం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.1 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం 7.10 గంటల సమయంలో మయన్మార్ దక్షిణ తీరానికి సమీపంలో వెడల్పు : 15.41, పొడవు 96.37, 10 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు సంభవించినట్లు ఎన్‌సిఎస్ ట్వీట్‌లో పేర్కొంది. ఈ భూకంపం వల్ల ప్రాణ, ఆర్థిక నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎన్‌సిఎస్ పేర్కొంది.

దేశభక్తి ముసుగులో కార్పొరేట్లకు దోచిపెడుతున్న బిజెపి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

సిపిఎం కడప జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- కడప అర్బన్

దేశ భక్తి ముసుగులో వనరులను, సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ సర్కార్ దోచిపెడుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. దేశ సంపదనంతా ఒకవైపు దోచిపెడుతూ మరోవైపు ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న బిజెపిని రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం కడప జిల్లా కార్యాలయంలో సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం అమ్మేస్తుందని విమర్శించారు. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మబలికి ఇప్పుడు ప్రతి యేటా కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా మోసం చేస్తోందని తప్పుబట్టారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిత్యం పెంచుకుంటూపోవడం వల్ల ద్రవ్యోల్బణం రంకెలేస్తోందని పేర్కొన్నారు. ప్రజలపై భారాలు వేయడంలోనే మోడీ సర్కార్ నంబర్ వన్ అని ఎద్దేవా చేశారు. రాజదండంతో రాచరిక పాలనను మళ్లీ తెచ్చేందుకు బిజెపి యత్నిస్తోందన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి కూడా కేంద్ర విధానాలను తుచ తప్పకుండా పాటిస్తున్నారన్నారు. సంస్కరణల పేరుతో ప్రజలపై విపరీతంగా భారాలు వేయడాన్ని సిపిఎం ఖండిస్తుందని తెలిపారు. కడప ఉక్కు, పోలవరానికి నిధులు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్యాకేజీ ఏ ఒక్కటి కేంద్రం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ కన్నుమూత

న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక వేత్త, రచయిత, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) మాజీ ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ (83) సోమవారం కన్నుమూశారు. అనారోగ్యంతో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఇస్లాం మతంలో కులంపై ఆయన రచనలు ప్రాచుర్యం పొందాయి. మనదేశంతోపాటు విదేశాల్లోని వివిధ విశ్వ విద్యాలయాల్లో సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్ బోధించారు. మతతత్వం, సామాజిక ఉద్యమాలు, ఇస్లామిక్ పరివర్తనలు, శరణార్థులు, వలసదారులు, బాలల హక్కులు, బాల కార్మికులు, పేదరిక నిర్మూలన, అభివృద్ధి, సమాజం తదితర అంశాలపై ఎంతో ఆసక్తి కలిగిన ఆయన అనేక రచనలు చేశారు.

తెలంగాణలో సిఎంఆర్ అక్రమాలు

- ఎఫ్‌సిఐకి చేరని కస్టమ్ మిల్లింగ్ రైస్
- అడ్డదారుల్లో రైస్ మిల్లర్ల అక్రమార్జన
- నోటీసులు ఇచ్చినా.. బ్లాక్‌లిస్టులో పెడతామన్నా వెరవని వైనం
- 2022-23ఖరీఫ్‌లో 20 శాతం కూడా దాటని సిఎంఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యానికి మించి ఆర్నెల్లకోమారు ఖరీఫ్, యాసంగి సీజన్లలో వచ్చే లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం మిల్లర్ల అక్రమ వ్యాపారానికి అవకాశంగా మారింది. ప్రతి సీజన్‌లోనూ గడువులోపు ఎఫ్‌సీఐకి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) ఇవ్వకుండా ప్రభుత్వం ధాన్యంతోనే కొందరు మిల్లర్లు వ్యాపారం సాగిస్తున్నారు. ప్రభుత్వ బియ్యాన్నే బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్న మిల్లర్లు.. ఇప్పుడు బియ్యాన్ని నూకలుగా మార్చి అధికారులను ఏమార్చుతూ మరీ సొమ్ము చేసుకుంటున్నారు. నోటీసులు ఇచ్చినా.. బ్లాక్‌లిస్టులో పెట్టినా.. ఏటా సీజన్ల వారీగా వచ్చే పెద్దఎత్తున ధాన్యం దిగుబడులు మిల్లింగ్ సామర్థ్యం లేక మళ్లీ అవే మిల్లులకు అప్పగించాల్సిన పరిస్థితులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మిల్లర్లకు కలిసొస్తోంది. ప్రస్తుతం 2022-23 వానాకాలం సీజన్ సిఎంఆర్ ఇప్పటికీ 20 శాతమైనా ఎఫ్‌సిఐకి ఇవ్వలేదు. పైగా మొన్నటి యాసంగి కొనుగోళ్లు పూర్తయి పెద్దఎత్తున మళ్లీ మిల్లులకు ధాన్యం చేరడం గమనార్హం.

తెలంగాణలో పదేళ్ల నుంచి ఊహించని రీతిలో 90 శాతం మేర విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ప్రతి జిల్లా నుంచి సుమారు నాలుగు లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఆ దిగుబడులను ప్రభుత్వమే కొని మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకి కస్టమ్ మిల్లింగ్ చేసి ఇస్తోంది. సర్కారు ఇచ్చే ధాన్యం సహా మిల్లర్లూ నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొంటున్నారు. ఆ ధాన్యం నుంచి తీసిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి సకాలంలో కస్టమ్ మిల్లింగ్ బియ్యం అప్పగించకుండా కొంత బయట మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. అందులోనూ రెండేళ్ల కిందటి సీజన్ల లెక్కల్లోనూ ప్రతి జిల్లా నుంచి కనీసంగా ఐదు నుంచి పది శాతం మేర సిఎంఆర్ లెక్కలు తేలడం లేదు. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ మిల్లుల నుంచి 20 శాతంలోపే ఎఫ్‌సీఐకి చేరింది. ఈ సీజన్ సిఎంఆర్ ఇచ్చేందుకు ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు ఉన్నా.. మళ్లీ మొన్నటి యాసంగికి సంబంధించిన లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరడం గమనార్హం.

సొమ్ము ఒకరిది.. సోకొకరిది..

ప్రతి ఖరీఫ్, యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్‌తోనే మిల్లర్లు వ్యాపారం సాగిస్తున్నారని స్పష్టం అవుతోంది. సాధారంగా ఒక సీజన్‌లో అప్పగించిన ధాన్యాన్ని సిఎంఆర్ రూపంలో ఆర్నెళ్లలో అందించాలి.

కానీ రెండు సీజన్లు దాటినా పూర్తిస్థాయిలో పాత సీజన్ సిఎంఆర్ ఇవ్వడం లేదు. బహింగ మార్కెట్‌లోనే మిల్లర్లు నేరుగా అమ్ముకునే బియ్యంతోపాటే ప్రభుత్వానికి ఇచ్చే సిఎంఆర్‌ను కలిపి అమ్ముకుంటున్నారు. ఏటా ఎంతో కొంత బియ్యాన్ని ఇవ్వకుండా దాటవేస్తున్న మిల్లర్లకు గడువు ముగిసేలోపు మళ్లీ కొత్త సీజన్ పంట మిల్లుకు రావడం కలిసి వస్తోంది. ఇలా ప్రతియేటా సీజన్ చివరి వరకూ సాగదీస్తూనే నిర్దేశించిన గడువులోపు మిల్లర్లు బియ్యాన్ని అప్పగించకుండా సిఎంఆర్‌తో వ్యాపారం సాగిస్తున్నారనేది బహిరంగ విమర్శగా మారింది. ప్రభుత్వం కండ్లుగప్పి సిఎంఆర్ దొరక్కుండా బియ్యాన్ని నూకలుగా మార్చి అమ్ముకుంటున్నట్టూ చర్చ సాగుతోంది.

నోటీసులు ఇచ్చినా.. బ్లాక్‌లిస్టులో పెట్టినా...

ప్రతిసారీ సిఎంఆర్ విషయంలో సివిల్ సప్లయి శాఖ నుంచి సదరు మిల్లర్లకు నోటీసులు ఇవ్వడం, బ్లాక్ లిస్టులో పెడుతామని హెచ్చరికలు జారీ చేయడం పరిపాటిగా మారింది. అసలు లెక్కకు రాని బియ్యంపై తేల్చాల్సిన సదరు శాఖ ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందనేది అంతుచిక్కని వ్యవహారంగా మారింది. మిల్లింగ్ సామర్థ్యానికి మించి ప్రతి సీజన్‌లోనూ వస్తున్న ధాన్యం దిగుబడులతో తప్పని పరిస్థితుల్లో చర్యలు తీసుకున్నా.. మిల్లులకు మినహాయింపులు ఇస్తూ మళ్లీ కేటాయింపులు చేస్తున్నారని చర్చ సదరు వర్గాల్లోనే సాగుతోంది. ఈ క్రమంలోనే గడువులోపు ఎఫ్‌సీఐకి బియ్యం అందించకుండా ఏటా నష్టాలు చవిచూస్తున్న ప్రభుత్వం కొన్ని చర్యలకు పూనుకుంటోంది. ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని తగ్గించుకుంటోంది. కోత సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా కొంత పంట ప్రయివేటు పరమయ్యాక రంగంలోకి దిగుతోంది.

అధికారికంగానే క్వింటాపై రూ.200 ఆర్జన

ప్రతి సీజన్‌లో ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న మిల్లర్లు ఆరు నెలల్లోపు క్వింటాల్ ధాన్యానికి 68కిలోల బియ్యం చొప్పున వాపస్ ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం ఒక్కో క్వింటా మిల్లింగ్ చేసినందుకు రూ.33 ఇస్తోంది. తవుడు, నూకలు, ఊక వంటిని మిల్లర్లకే అప్పగించడంతో అది అదనపు లాభంగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో తవుడుకు రూ.50, కిలో నూకలకు రూ.15, ఊకకు కిలో రూ.5 చొప్పున ధర పలుకుతోంది. క్వింటా ధాన్యం మిల్లింగ్ చేస్తే కనీసం మూడు కిలోలపైనే తవుడు వస్తుంది. ఈ లెక్కన తవుడు, ఊక, నూక రూపంలోనే క్వింటాల్ ధాన్యంపై రూ. 180వరకు అదనంగా మిగులుతోంది. ఇక ప్రభుత్వం ఇచ్చే రూ.33 కలిపి రూ.200పైనే ఆదాయం వస్తోంది.

రాజగోపాల్‌రెడ్డి చూపు.. హస్తం వైపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిజెపి విసిరిన వలలో చిక్కుకున్న మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని ప్రచారం జరుగుతున్నది. హస్తం గూటికి చేరేందుకు పావులు కదుపుతోంది. ఢిల్లీ నుంచి దిగ్విజయ్ సింగ్ రంగంలోకి దిగి ఆయనతో చర్చలు జరిపినట్టు, తిరిగి పార్టీలో చేరేందుకు రాజగోపాల్‌రెడ్డి సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

దానికి తగ్గట్టుగానే తన క్యాడర్‌కు రాజగోపాల్‌రెడ్డి సంకేతాలు పంపుతున్నారు. తన వెంటే నడిచి వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జిల్లాలో రాజగోపాల్‌రెడ్డి భువనగిరి పార్లమెంటరీ స్థానం పరిధిలో రాజకీయ చక్రం తిప్పేవారు. అందుకు తగ్గట్టుగానే ఆయా నియోజకవర్గాల్లో తనకంటూ సొంత క్యాడర్‌ను తయారుచేసుకున్నారు. కాంట్రాక్టులు, పెండింగ్ బిల్లులను అడ్డంపెట్టుకుని బిజెపి ఆడిన నాటకం... ఇదే క్రమంలో రేవంత్‌రెడ్డి పార్టీ అధ్యక్షుడు కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆయన చివరకు కాంగ్రెస్‌ను వీడారు. ఆ సందర్భంలో సోదరులైన రాజగోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి మధ్య అంతర్గతంగా చిన్నపాటి యుద్ధమే సాగిందనే ప్రచారముంది. అన్న చెప్పినా ఆయన వినలేదు. హస్తం గుర్తుపై గెలిచిన ఆయన ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఓడిపోయారు. ఉప ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డ తర్వాత, ఇప్పుడు బిజెపిలో నేతలు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటుండటంతో ఆ పోరు భరించలేనన్న నిర్ణయానికి వచ్చి రాజగోపాల్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తెలంగాణలో బిజెపికి అవకాశం లేదని తన అనుచరుల వద్ద తేల్చిచెపుతున్నారు. ఈ విషయం ఇప్పుడే కాదు...మునుగోడు ఉప ఎన్నికల్లోనూ తేలిపోయిందని చెబుతున్నారు.

ICICI Home Finance
కార్పోరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: 2అంతస్తు, 40-10129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మమతా గాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ద వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్థి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	వెంకట రాఘవేంద్ర లంకోజి (రుణగ్రహీత) శాంతి లంకోజి (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. LHVJW00001384989	కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం విజయవాడ 520007, కానూరు గ్రామం వద్ద ఉన్న సాయి టవర్ 1వ అంతస్తు ఎఫ్ ఎఫ్ -2, ఆర్.ఎస్.నం.172/2, 172/3.	Rs. 27,17,924/- 13th June, 2023	Rs. 20,59,830/- / Rs. 2,05,983.0/-	July 03, 2023 11:00 AM- 03:00 PM	July 07, 2023 02:00 PM- 03:00 PM
2.	పెరుమల్లపల్లి సురేష్ (రుణగ్రహీత) పెరుమల్లపల్లి సోనీ (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. LHVJW00001378764	ఫ్లాట్ నం.402, బ్లాక్-ఎ, 4వ అంతస్తు, ట్రెండెస్ట్ టవర్స్ నందిగామ పిన్ 51175834/3 నందిగామ ఆంధ్రప్రదేశ్ 521185	Rs. 27,39,386/- 13th June, 2023	Rs. 17,13,150/- / Rs. 1,71,315.0/-	July 03, 2023 11:00 AM- 03:00 PM	July 07, 2023 02:00 PM- 03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్ వెబ్‌సైట్ **(URL Link-https://BestAuctionDeal.com)** మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 06 జులై, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మమత గాంధీ రోడ్డు, చంద్రమౌళిపురం, విజయవాడ-520010 లేదా 06 జులై, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మమత గాంధీ రోడ్డు, చంద్రమౌళిపురం, విజయవాడ-520010 లేదా 06 జులై, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి కృష్ణ, నందిగామ వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, **https://www.icicihfc.com/** దయచేసి చూడండి..

తేది: 20 జూన్, 2023
ప్రదేశం: కృష్ణ, నందిగామ
అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
ఏలూరు బ్రాంచ్, పాత బస్ స్టేషన్ దగ్గర, యెగిరెడ్డి కాంప్లెక్స్, ఏలూరు,
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ నెం: 08812-227140. ఇ-మెయిల్ ఐడి: iob0122@iob.in

e-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు నందలి రూలు 8(6) / రూలు 9(1) నిబంధనల ప్రకారం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి ఋణగ్రహీత(లు): **(1). శ్రీ. గోపి చంద్ అమిరిశెట్టి, తండ్రి: అరుణ్ కుమార్ అమిరిశెట్టి,** ఫ్లాట్ నెం. 401, 3వ అంతస్తు, రాజాస్ ప్రైడ్, డోర్ నెం. 24బి-6-16, టి.ఎస్.నెం. 446, పాత మున్సిపల్ వార్డు, ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు నెం. 30, పతేబాద్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-534002 ...(మరణించిన ఋణగ్రహీత / తనఖాదారు). **(2). శ్రీమతి. తోట శ్రీదేవి (అమిరిశెట్టి శ్రీదేవి), భర్త: గోపి చంద్ అమిరిశెట్టి,** ఫ్లాట్ నెం. 401, 3వ అంతస్తు, రాజాస్ ప్రైడ్, డోర్ నెం. 24బి-6-16, టి.ఎస్.నెం. 446, పాత మున్సిపల్ వార్డు, ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు నెం. 30, పతేబాద్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-534002 ... సహ-ఋణగ్రహీత/చట్టబద్ధమైన వారసురాలు (మరణించిన ఋణగ్రహీత / తనఖాదారు యొక్క భార్య). **(3). శ్రీమతి అమిరిశెట్టి విజయలక్ష్మి, భర్త: అరుణ్ కుమార్ అమిరిశెట్టి,** ఫ్లాట్ నెం.401, 3వ అంతస్తు, రాజాస్ ప్రైడ్, డోర్ నెం. 24బి-6-16, టి.ఎస్.నెం. 446, పాత మున్సిపల్ వార్డు, ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు నెం. 30, పతేబాద్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-534002 ... చట్టబద్ధమైన వారసురాలు (మరణించిన ఋణగ్రహీత / తనఖాదారు యొక్క తల్లి). **(4). శ్రీ. అరుణ్ కుమార్ అమిరిశెట్టి, తండ్రి: గోపాల కోటేశ్వరరావు,** ఫ్లాట్ నెం.401, 3వ అంతస్తు, రాజాస్ ప్రైడ్, డోర్ నెం. 24బి-6-16, టి.ఎస్.నెం. 446, పాత మున్సిపల్ వార్డు, ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు నెం. 30, పతేబాద్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-534002 ...హామీదారు (మరణించిన ఋణగ్రహీత / తనఖాదారు యొక్క తండ్రి) వారు తేది. 02.02.2023 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 38,49,708/-** (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల నలభై తొమ్మిది వేల ఏడు వందల ఎనిమిది రూపాయలు) + తదుపరి వడ్డీ మరియు ఖర్చులు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** అధీకృత అధికారిచే లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తిని **తేది 26.07.2023**న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన **విక్రయించబడునని** యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది : 26.07.2023, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 12.00 గం॥ల వరకు
(వేలం పూర్తి అయ్యేవరకు ప్రతి 10 ని॥లకు ఒకసారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్సెన్ ఉండును)
ఇ-వేలం ప్లాట్‌ఫాం: https://www.mstcecommerce.com/auctionhome/ ibapi
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఏలూరు బ్రాంచ్ కరెంట్ అకౌంట్ నెం. 012202000003333, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: IOBA0000122కు తేది: 25.07.2023 లోపుగా చెల్లించవలెను.

స్థిరాస్తి వివరములు:
(నూజివీడు ఎస్.ఆర్.ఒ, డాక్యుమెంట్ నెం.4891/2020, తేది: 19.10.2020 గల ఆస్తి) (శ్రీ అమిరిశెట్టి గోపి చంద్, తండ్రి: అమిరిశెట్టి అరుణ్ కుమార్ పేరున గలదు). ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, ముసునూరు మండలం, నూజివీడు సబ్-రిజిస్ట్రార్, రమణక్కపేట గ్రామం మరియు గ్రామపంచాయతీ, ఆర్. ఎస్. నెం. 162/15, పంచాయతీ అసెస్‌మెంట్ నెం.639, డోర్ నెం. 4-73 కలిగిన **821 చ॥గ॥ లేదా 686.46 చ॥మీ॥ రెసిడెన్షియల్ స్థలంతో అందులోని ఆర్‌సిసి బిల్డింగ్ (గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్) యావత్తు. హద్దులు:** తూర్పు: కొంతమేర పంచాయతీ రోడ్డు, కొంతమేర శ్రీ. బత్తిన రత్నబాబు యొక్క షెడ్ మరియు స్థలం, దక్షిణం: శ్రీ అమిరిశెట్టి నమ్మయ్య యొక్క స్థలం మరియు ఆ స్థలానికి పోవు దారి, పడమర: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: బత్తిన వెంకట రమణ, ఎన్ నారాయణ మరియు బి నారాయణ యొక్క ఇళ్లు మరియు స్థలాలు.

రిజర్వు ధర: రూ. 84,63,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 8,46,300/-	బిడ్ పెంపుదల: రూ. 50,000/-

*స్థానిక ప్రభుత్వ బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లులు మొ॥) : బ్యాంకు వారికి తెలియదు.
*చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేసిన (1) https://www.ibapi.in (2) https://eprocure.gov.in/epublish/app లేదా బ్యాంక్ వెబ్‌సైట్ www.iob.in లింక్‌ను రిఫర్ చేయండి. మరిన్ని వివరములకు సంప్రదించండి: ఫోన్: 08812-227140, 08812-253182.
తేది:17.06.2023 ప్రదేశం: ఏలూరు సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: 2401, జెన్.తిమ్మయ్య రోడ్డు (కన్టోన్మెంట్) పూనె-411 001.
కస్టమర్ ఫైనాన్స్ డివిజన్ : న్యూ నం.34, జి.ఎన్.చెట్టి రోడ్డు, టి.నగర్, చెన్నై-600 017
స్టేట్ ఆఫీస్ : నం.25, సాయి ఎంపైర్, 3వ అంతస్తు, యూనిటెడ్ ఇండియా కాలనీ, కోడంబక్కం, చెన్నై-600 024

డిమాండ్ నోటీసు యొక్క బహిరంగ ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన నోటీసు
దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలకు నోటసు ఇవ్వడమేమనగా, వారు ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్(ఐబిఎల్) నుండి పొందిన క్రెడిట్ సదుపాయాన్ని తిరిగి చెల్లించడంలో డీఫాల్టీ అయినందున, బ్యాంక్ ద్వారా వారి రుణ క్రెడిట్ సదుపాయం నాన్-పెర్ఫార్మిన్ ఆస్తులుగా వర్గీకరించబడింది. అయితే **SARFAESI** యాక్ట్ 2002 సెక్షన్ 13 (2) ప్రకారం పేర్కొన్న సంబంధిత రుణగ్రహీతకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి చివరిగా తెలిసిన చిరునామాపై డిమాండు నోటీసులు జారీ చేయబడ్డాయి అవి వారికి అందించబడనందున తిరిగి వచ్చాయి మరియు దీని గురించి వారికి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయబడుతుంది. నోటీసుకు ప్రత్యామ్నాయంగా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పై రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు లేదా/వారి హామీదారు (వర్తించే చోట) దీనిని ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు బకాయిల చెల్లింపులు చేయాలని సూచించారు.
నోటీస్ విఫలమైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క చట్టంలోని 13వ సబ్ సెక్షన్ (13)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానిస్తున్నారు, రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు పద్ధతిలో లేదా బ్యాంకు యొక్క సమ్మతి ముందుగా వ్రాయకుండా బదిలీ చేయడానికి అర్హులు కాదు.

క్ర. సం	లోన్ ఎకౌంట్ నం., లోన్ మొత్తం రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేర్లు/డిమాండ్ నోటీసు తేదీ/బకాయి మొత్తం	ఆస్తి/సెక్యూర్డ్ అసెట్స్ యొక్క వివరణ
1	1. లోన్ అగ్రిమెంట్ నం.:**AKK05120M** లోను మొత్తం: రూ.6,00,000/- డిమాండ్ నోటీసు తేది : 02.02.2023 బకాయి మొత్తం : రూ.5,74,428.04/- 02.02.2023 నాటికి దానిపై తదుపరి వడ్డీతో. రుణగ్రహీత: శ్రీ. సురేష్ బాబు ఎస్, తండ్రి. వెంకటస్వామి, నివాసం : హౌ.నం.94-20-1492, ఎటి అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్ : 522004. సహ రుణగ్రహత(లు) : శ్రీ/శ్రీమతి. సగినెల నాగమ్మ, భర్త. వెంకటస్వామి, నివాసం: హౌ.నం.80-11-129-సి4, రవీంద్ర స్కూల్ వద్ద, అబ్బాస్ నగర్, కర్నూలు, ఆంధ్రప్రదేశ్, పిన్ : 518002. సహ రుణగ్రహీత(లు) : శ్రీమతి. టి. ప్రమీల, భర్త. సురేష్‌బాబు ఎస్., నివాసం: హౌ.నం.94-20-1492, వార్డు నం.26, ఎటి అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్-522004. హామీదారులు : శ్రీ.నాగమ్మశెట్టి కె. భర్త. నాగస్వామి, నివాసం: ప్లాట్ నం.59, గ్రౌండ్ ఫ్లోర్, సప్తగిరి కాలనీ, కర్నూలు, ఆంధ్రప్రదేశ్, పిన్ : 518002.	కర్నూలు జిల్లా, కల్లూరు ఎస్‌డి, కల్లూరు మండలం, పందిపాడు గ్రామ పంచాయతీ, పందిపాడు గ్రామ పొలం వద్ద ఉన్న స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఎస్‌వై.నం.11, ప్లాట్ నం.59, స్థలం లో ఎల్.డిఐఎస్.నం.5/71 కొలిచే 75 చ.గ.లు. సప్తగిరి కాలనీ, పందిపాడు (గ్రా మరియు పం), హద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.27, దక్షిణం: 30 అ.లు వెడల్పు రోడ్డు, తూర్పు: అదే ప్లాట్ నం.59 మిగిలిన సైట్, పడమర: ప్లాట్ నం.58. కొలతలు: తూర్పు-పడమర : 15 అ.లు. లేదా 4.572 మీ.లు., ఉత్తరం-దక్షిణం: 45 అ.లు. లేదా 13.716 మీ.లు., తో కలిసి భవన నిర్మాణం ఓవర్ పేర్కొన్న ఆస్తితో పాటు ఫిక్చర్లు, ఫిట్టింగులు మరియు దానిపై ఉపకరణాలు.
2	2. లోన్ అగ్రిమెంట్ నం.:**AVV05080M** లోను మొత్తం: రూ.18,07,000/- డిమాండ్ నోటీసు తేది : 02.03.2023 బకాయి మొత్తం : రూ.16,91,922.34/- 02.02.2023 నాటికి దానిపై తదుపరి వడ్డీతో. రుణగ్రహీత: శ్రీ/శ్రీమతి/శ్రీ. దబ్బూరి శ్రీనివాసరావు, కేరాఫ్. శేషయ్య, నివాసం : డో.నం.9-962, వసంత కాలనీ, కంచికచర్ల, విజయవాడ, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్ : 521180. సహ రుణగ్రహీత : శ్రీ/శ్రీమతి/శ్రీ. దబ్బూరి సుమిత్ర, కేరాఫ్. బి. సత్యనారాయణ, నివాసం : డో.నం.9-116, వసంత కాలనీ, కంచికచర్ల, విజయవాడ, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్ : 521180.	కృష్ణాజిల్లా, డిడిఓ.సబ్ రిజిస్ట్రీ, కంచికచర్ల, ఎస్.నం.372/1 వద్ద ఉన్న స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ యొక్క విస్తీర్ణం 145 చ.గ.లు. తో ప్లాట్ నం.19 అందులో రెసిడెన్షియల్ భవనం హద్దులు: తూర్పు: ప్లాట్ నం.36; 39.6 అ.లు., పడమర: 16.6' వెడల్పు రోడ్డు; 39.6 అ.లు., ఉత్తరం: ప్లాట్ నం.20; 33.0 అ.లు., దక్షిణం: బజార్ 33.0 అ.లు. తో కలిసి భవన నిర్మాణం ఓవర్ పేర్కొన్న సైట్‌తో పాటు ఫర్నీచర్, ఫిక్చర్లు మరియు దానిపై ఉపకరణాలు.

తేది: 18.06.2023
ప్రదేశం: విజయవాడ/గుంటూరు
సం/- అధీకృత అధికారి
ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ కొరకు

ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ హత్య

ఒట్టావా : ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజార్‌ను కెనడాలో గురుద్వారా వెలుపల కాల్చి చంపారని అధికారులు సోమవారం తెలిపారు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ తీవ్రవాదుల్లో ఒకడైన హర్‌దీప్ సింగ్‌ను పట్టుకుంటే రూ.10 లక్షల నగదు అవార్డును కూడా భారత ప్రభుత్వం ప్రకటించింది. పంజాబ్‌లోని జలంధర్‌కి సమీపంలో భర్‌సింగ్‌పూర్ గ్రామానికి చెందిన హర్‌దీప్ సింగ్ గురుద్వారా వెలుపల పార్క్ చేసి వుంచిన కారుల్లో బుల్లెట్ గాయాలతో చనిపోయి వుండగా కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ గురుద్వారాకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రాథమిక సమాచారాన్ని బట్టి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నిజార్‌పై కాల్పులు జరిపారని, ఆయన అక్కడికక్కడే మరణించారని అధికారులు తెలిపారు.

ప్రేమికుల దారుణ హత్య

- మొసళ్లు తిరిగే నదిలోకి మృతదేహాల విసిరివేత
- మధ్యప్రదేశ్‌లో ఓ తండ్రి ఘాతుకం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఓ ప్రేమజంట దారుణ హత్యకు గురైంది. యువతి తండ్రి, బంధువులే వారిద్దరినీ కాల్చివేసి, మొసళ్ల ఎక్కువగా ఉండే నదిలో మృతదేహాలకు రాళ్లు కట్టి పడేశారు. మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో ఈ నెల 3న చోటుచేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగుచూసింది. అంబా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ యాదవ్ కథనం ప్రకారం రతన్‌బసాయ్ గ్రామానికి చెందిన శివానీ (18), అక్కడికి సమీపంలోని బలుపుర ప్రాంతానికి చెందిన రాధేశ్యామ్ తోమర్ (21) ప్రేమించుకుంటున్నారు. విషయం తెలియడంతో శివానిని ఆమె కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ నెల 3 నుంచి వారిద్దరూ కనిపించకుండా పోవడంతో రాధేశ్యామ్ తండ్రి లఖన్ తోమర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శివానీ తండ్రి రాజ్‌పాల్‌సింగ్ తోమర్, మరో ఇద్దరు బంధువులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. గ్రామ శివార్లలో ప్రేమికులిద్దరినీ కాల్చివేశామని, వారి మృతదేహాలకు రాళ్లుకట్టి మొసళ్లు ఎక్కువగా ఉండే చంబల్ నదిలో ఈ నెల 3న పడేశామని రాజ్‌పాల్‌సింగ్ అంగీకరించాడని ఇన్‌స్పెక్టర్ వినయ్ యాదవ్ తెలిపారు. మృతదేహాల కోసం రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో చంబల్ నదిలో రెండు రోజులుగా గాలిస్తున్నట్లు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిపురుష్ సహా భారత్ చిత్రాలపై నేపాల్ నిషేధం

ఖాట్మండ్ : ఆదిపురుష్ సహా భారత చిత్రాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించింది. నేపాల్ రాజధాని ఖాట్మండు సహా పర్యాటక నగరమైన పోఖ్రాలలో సోమవారం నుంచి భారత చిత్రాలపై నిషేధం విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీత.. ఆగ్నేయ నేపాల్‌లోని జనక్‌పూర్‌లో జన్మిస్తే.. 'ఆదిపురుష్' సినిమాలో భారత్‌లోనే జన్మించినట్లు చూపించారంటూ అక్కడి అధికారులు మండిపడుతున్నారు. ఖాట్మండులోని 17 థియేటర్‌లలో ఎలాంటి హిందీ సినిమా ప్రదర్శించకుండా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఖాట్మాండు మేయర్ బలెంద్ర షా పేర్కొన్నారు.

కువైట్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

కువైట్ సిటీ : కువైట్‌లో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. షేక్ అహ్మద్ నవాఫ్ అల్-అహ్మద్ అల్-సబాహ్ నేతృత్వంలో ఆదివారం కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. గతేడాది జులై 24న అల్ అహ్మద్ అల్ సబాహ్ ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పటి నుండి ఆయన ఏర్పాటు చేసిన ఐదో ప్రభుత్వం ఇది. కొత్త ప్రభుత్వంలో 15మంది మంత్రులు ఉన్నారు. ఇందులో ఐదుగురు తొలిసారిగా మంత్రులుగా నియమితులయ్యారు. ఈ నెల 7న గత ప్రభుత్వం రాజీనామా చేసింది. రాజీనామాను ఆ దేశ అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్ సబాకు సమర్పించింది. దీంతో ప్రధానమంత్రిగా షేక్ అహ్మద్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబాహ్‌ను మళ్లీ నియమించేందుకు ఈ నెల 13న రాజ శాసనం జారీ అయింది.

తమిళనాడు మంత్రిపై సుప్రీంకోర్టుకు ఇడి

న్యూఢిల్లీ : తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి వి. సెంథిల్‌ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించవచ్చంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఇడి సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వి.సెంథిల్ బాలాజీ ప్రభావవంతమైన మంత్రి అని ఇడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకి వాదనలు వినిపించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం.సుందరేష్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ కేసును జూన్ 21 విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. వి.సెంథిల్‌ను ఈ నెల 14న ఇడి అరెస్ట్ చేసిన అనంతరం ఛాతీ నొప్పితో చెన్నైలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుండె శస్త్రచికిత్స నిమిత్తం వి.సెంథిల్‌ను కావేరీ ఆస్పత్రికి తరలించేందుకు మద్రాస్ హైకోర్టు గురువారం అనుమతించిన సంగతి తెలిసిందే.

మణిపూర్ హింసపై ప్రధాని మౌనం వీడాలి

- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- మణిపూర్ ప్రతిపక్షాల బృందం భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యూఢిల్లీలోని ఎకెజి భవన్‌లో సిపిఎం నేతలు ఏచూరి, ప్రకాశ్‌కరత్, నిలోత్పల్ బసు లతో సమావేశామైన మణిపూర్ ప్రతిపక్ష నేతలు

మణిపూర్ పరిణామాలపై ప్రధాని మోడీ మౌనం వీడాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హితవు పలికారు. ఈ అంశంపై స్పందించేందుకు మోడీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మణిపూర్‌కు చెందిన పది ప్రతిపక్ష పార్టీల ప్రతినిధి బృందం ప్రధాని మోడీతో పాటు వివిధ పార్టీల నేతలను కలిసేందుకు ఢిల్లీకి చేరుకుంది. పది రోజులకుపైగా ఎదురు చూస్తున్నా, ప్రధాని మోడీ ఇంకా సమయం (అపాయింట్ మెంట్) కేటాయించలేదు. అమెరికా పర్యటనకు వెళ్లే ముందు ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ బృందం కోరింది. యాభై రోజులుగా అల్లర్లు జరుగుతున్నందున ముఖ్యమంత్రి ఎన్ బిరేన్‌సింగ్‌కు అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ఆయా పార్టీల నేతలు విమర్శించారు. బిరేన్‌సింగ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, నిలోత్పల్ బసులతో మణిపూర్ ప్రతిపక్ష పార్టీ నేతల బృందం సమావేశమైంది. అనంతరం సీతారాం ఏచూరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మణిపూర్‌లో పరిస్థితి అత్యంత క్లిష్టంగా కొనసాగుతోందని, అక్కడ శాంతి పునరుద్ధరణే ప్రధాన ప్రాధాన్యతని అన్నారు. సాధారణ పరిస్థితులను నెలకొల్పాలని పేర్కొన్నారు. ఇది మణిపూర్ సమస్య కాదని, దేశ సమస్య అని, అందుకే దీన్ని వెంటనే పరిష్కరించాలని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడాలని సూచించారు. మే 3న ప్రారంభమై, నేటికీ కొనసాగుతున్న ఈ హింసాత్మక ఘటనలపై ప్రధాని మోడీ స్పందించలేదని విమర్శించారు. దాదాపు 60,000 మంది శరణార్థి శిబిరాల్లో ఉన్నారన్నారు. మణిపూర్‌లో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వ్యతిరేక దిశలో పయనిస్తోందని విమర్శించారు. సిఎంను తొలగిస్తేనే శాంతి చర్చలు అర్థవంతంగా ప్రారంభమవుతాయని ఏచూరి అన్నారు. పది రోజులుగా ప్రధాని మోడీ మణిపూర్ రాజకీయ నేతలకు సమయం కేటాయించలేదని, ఘటనలు ప్రారంభమైన 20 రోజుల తరువాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించినా ఫలితం శూన్యమని అన్నారు. మణిపూర్ ప్రతినిధి బృందాన్ని ప్రధాని మోడీ కలవకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. వారి అభిప్రాయాలను వినకపోవడం, పరిస్థితి చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సిపిఎం నేతలను కలిసిన వారిలో మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఇబోబీ సింగ్, పిసిసి అధ్యక్షుడు కైషామ్ మేఘచంద్ర, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి క్షేత్రమయుమ్ శాంత, సిపిఐ కార్యదర్శి ఎల్ తోయిరన్ సింగ్, జెడియు అధ్యక్షుడు కెఎస్‌హెచ్ బిరేన్ సింగ్, ఎన్‌సిపి అధ్యక్షుడు సోరం ఇకోయామా సింగ్, టిఎంసి, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఆప్, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌ఎస్‌పి తదితర పార్టీల నేతలు ఉన్నారు. ప్రధానమంత్రి సమావేశానికి సమయం ఇవ్వకపోతే, తన కార్యాలయానికి వినతిపత్రాన్ని పంపుతానని, ఆపై మీడియాను కలుస్తానని మాజీ సిఎం ఇబోబీ సింగ్ చెప్పారు.

ముస్లిములను తెరమరుగు చేయడమే

- పాఠ్య పుస్తకాలలో మార్పులపై చరిత్రకారిణి తనికా సర్కార్

న్యూఢిల్లీ : అక్బర్, ఔరంగజేబులపై రూపొందించిన చాప్టర్లను ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల నుండి తొలగించడం ముస్లిములను సమాజం నుండి తెరమరుగుచేసే ప్రయత్నమేనని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, చరిత్రకారిణి తనికా సర్కార్ అభిప్రాయపడ్డారు. ముస్లిం పేరు ఎక్కడ ఉన్నా దానిని తొలగిస్తున్నారని, ఆ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని హత్యాకాండకు పాల్పడుతున్నారని విమర్శించారు. భారతీయ రాజకీయ, సాంస్కృతిక జీవనం నుంచి ముస్లింల భాగస్వామ్యాన్ని పాఠ్య పుస్తకాల నుండి తొలగించడం ఆశ్చర్యమేమీ కాదని టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

మధ్యయుగం నాటి ఇస్లామిక్ చరిత్ర పాఠ్య పుస్తకాల నుండి అదృశ్యమైపోయిందని సర్కార్ వ్యాఖ్యానించారు. అక్బర్, జహంగీర్‌లు ఇతర మతాల విశ్వాసాలను గౌరవించారని గుర్తు చేశారు. భారతీయ చరిత్రలో హిందూ విజయాలు మాత్రమే కన్పించాలని హిందూత్వవాదులు కోరుకుంటున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు 38 అనుబంధ సంస్థలు ఉన్నాయని, అందులో బిజెపి ఒకటని తెలిపారు. ఆ సంస్థలు చరిత్రల్ని సృష్టించి, వాటిని తమ అనుబంధ విభాగాల ద్వారా ప్రచారం చేస్తుంటాయని అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలలో మార్పులు ఇప్పుడే ప్రారంభమయ్యాయని, మున్ముందు మరెన్నో చరిత్రలను తిరగరాస్తారని చెప్పారు. ఇదంతా వారి అజెండాలో భాగమేనని అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలలోని భారతీయేతర చారిత్రక సమాచారాన్ని కూడా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హక్కులు, న్యాయం కోసం జరిగిన విప్లవాలు, ఆందోళనల చరిత్రను కూడా తొలగిస్తున్నారని సర్కార్ చెప్పారు. సానుకూల చారిత్రక విలువలను ధ్వంసం చేయడం, ఆధునిక రాజకీయాలలో కీలక భాగాలుగా ఉన్న కొన్ని విలువలను సైతం కనుమరుగు చేయడం ఈ చర్యల ఉద్దేశమని వివరించారు. గాంధీని హత్య చేసిన వ్యక్తి కులం, సిద్ధాంతం గురించి బయటపెట్టడం వారికి ఇష్టం లేదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. అదే ముస్లింలను అయితే వేలెత్తి చూపుతారని అన్నారు. గుజరాత్ హింసాకాండ గురించి మాట్లాడుతూ బిబిసి డాక్యుమెంటరీలో చూపిన వాస్తవాలను, వాటిని ప్రదర్శించిన విద్యార్థులకు విధించిన శిక్షను ప్రస్తావించారు. పాఠ్యాంశాలలో మార్పులపై రచయితలను, సంపాదకులను సంప్రదించామన్న ఎన్‌సిఇఆర్‌టి వాదనపై అడిగిన ప్రశ్నకు సర్కార్ జవాబిస్తూ సహజంగా ఇలాంటి పనులు రహస్యంగా జరుగుతాయని, ఒకవేళ సంప్రదింపులే జరిగి ఉంటే ఈ మార్పులు ఎందుకు అవసరమో చెప్పాల్సి ఉందని అన్నారు.

బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో కేంద్ర బలగాల మోహరింపుపై నేడు సుప్రీం అత్యవసర విచారణ

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో పంచాయితీ ఎన్నికలకు 48 గంటల ముందు నుంచే కేంద్ర బలగాలను మోహరింపజేయాలని కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈ నెల 20న అత్యవసర విచారణ జరపడానికి సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ నెల 15న హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం,రాష్ట్ర ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ రెండు పిటిషన్లను ఈ నెల 20న అత్యవసరంగా విచారణ చేయడానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్‌లతో కూడిన వేకేషన్ బెంచ్ సోమవారం అంగీకరించింది. బూత్‌ల వారీగా పరిస్థితిని సమీక్షించే బాధ్యత రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ది అయితే, హైకోర్టు తప్పుగా జోక్యం చేసుకుని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేంద్ర బలగాలను మోహరింపచేయాలని ఒక బ్లాంకెట్ ఆదేశాన్ని ఎలక్షన్ కమిషన్‌కు హైకోర్టు జారీ చేసిందని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదులు వాదించారు. తమ ఆదేశాలను అమలు చేయడానికి ఎలక్షన్ కమిషన్‌కు రెండు రోజుల గడువును ఇవ్వడానికి హైకోర్టుకు ఎలాంటి అధికారం లేదని తెలిపారు. బిజెపి నాయకుడు సువేందు అధికారి దాఖలు చేసిన ఒక రాజకీయ ప్రేరేపిత పిటిషన్ ఆధారంగా హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని రాష్ట్రప్రభుత్వం తన పిటిషన్‌లో ఆరోపించింది. సున్నితమైన ప్రాంతాల గుర్తింపును జిల్లా మేజిస్ట్రేట్‌లు, పోలీసు అధికారులు ప్రారంభించారని అయినా... హైకోర్టు ఈ విధంగా ఆదేశాలు ఇచ్చిందని, పంచాయితీ ఎన్నికల కోసం ఇప్పటికే జార్ఖండ్, ఒడిషా, బీహార్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి అదనపు పోలీసు బలగాలను కోరినట్లు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన పిటిషన్‌లో తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో జులై 8న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలు ప్రతిపక్ష పార్టీలపై పెద్దఎత్తున దాడులు చేసి, వామపక్ష కార్యకర్తలుసహా పలువురిని హత్య చేసిన సంగతి తెలిసిందే.

సహకారమా? సంఘర్షణా?

- తేల్చుకోవాలని అమెరికాకు స్పష్టం చేసిన చైనా
- జిన్‌పింగ్‌తో బ్లింకెన్ భేటీ

అమెరికా ప్రతినిధి బృందంతో చర్చల్లో పాల్గొన్న జిన్‌పింగ్, చిత్రంలో కిన్ గాంగ్

బీజింగ్ : చైనా - అమెరికా సంబంధాలు ప్రపంచ దేశాలకు అవసరమని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. జిన్‌పింగ్ గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్స్‌లో సోమవారం బ్లింకెన్‌తో సమావేశమయ్యారు. ఈ రెండు దేశాలు సరైన పంథాను కనుగొనగలిగి, ఆ మార్గంలో పయనించగలిగితే మానవాళి భవిష్యత్ మెరుగ్గా వుంటుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. అమెరికన్ల మాదిరిగానే చైనీయులు కూడా విశ్వసనీయమైన, గౌరవప్రదమైన, స్వావలంబన కలిగిన వ్యక్తులని, ఇరువురికీ మరింత మెరుగైన జీవితం చేపట్టే హక్కు వుందని అన్నారు. ఇరు దేశాలు ఒకరికొకరు ముప్పుగా పరిగణించేకన్నా, ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలను గుర్తించి, వాటికి విలువనిచ్చి, వారి రంగాల్లో విజయం సాధించడమనేది ఒక అవకాశమని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రజల కోసం, ప్రపంచ దేశాల కోసం, ఇరు దేశాల మధ్య సంబంధాలు సక్రమంగా నిర్వహించడం కోసం బాధ్యతతో ఇరు దేశాలు వ్యవహరించాల్సి వుందన్నారు. ఈ రకంగా వ్యవహరించగలిగితేనే, ఈ రెండు దేశాలు ప్రపంచ శాంతికి, అభివృద్ధికి దోహదపడతాయన్నారు. తద్వారా ప్రపంచ దేశాలకు సాయపడతాయన్నారు.

ప్రధాన దేశాల మధ్య పోటీ అనేది అమెరికా సొంత సమస్యలను, ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించవచ్చుని, కానీ అది ప్రస్తుత ధోరణి కాదని అన్నారు. అమెరికా ప్రయోజాలను చైనా గౌరవిస్తుందని, అమెరికాను సవాలు చేయాలని గానీ లేదా పక్కకు నెట్టాలని గానీ చైనా భావించదని స్పష్టం చేశారు. అలాగే అమెరికా కూడా చైనాను గౌరవించాలన్నారు. చైనా చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను దెబ్బతీయరాదన్నారు. ఏ ఒక్క పక్షమూ కూడా ఎదుటి పక్షాన్ని తనకిష్టం వచ్చినట్లు మార్చడానికి ప్రయత్నించరాదన్నారు. అలాగే అభివృద్ధికి గల చట్టబద్ధమైన హక్కును కూడా హరించివేయరాదన్నారు. చైనా, అమెరికా సంబంధాలు సక్రమంగా, స్థిరంగా వుండాలనే చైనా ఎల్లప్పుడూ కోరుకుంటుందని స్పష్టం చేశారు. వివిధ సవాళ్లను, ఇబ్బందులను అధిగమించి, ఒక సరైన పంథాను కనుగొని ఆ మార్గంలో ముందుకు పయనించాలని అన్నారు. పరస్పర గౌరవంతో, శాంతియుత సహజీవనంతో వ్యవహరించాలన్నారు. అమెరికా సహకారాన్ని కోరుకుంటుందా, సంఘర్షణనే కోరుకుంటుందా ఏదో ఒకటి తేల్చుకోవాలని జిన్‌పింగ్ సూటిగానే చెప్పారు. హేతుబద్ధమైన, ఆచరణాత్మక వైఖరి అవలంబించి, చైనాతో కలిసి పనిచేయాల్సిందిగా ఆయన బ్లింకెన్‌ను కోరారు.

సుదీర్ఘంగా విదేశాంగ మంత్రుల చర్చలు

ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సోమవారం చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌తో దాదాపు ఐదు గంటల పాటు చర్చలు జరిపారు. అయితే చర్చల గురించి ఇరు పక్షాలు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. "వాస్తవికతతో కూడిన నిర్మాణాత్మక చర్చలు" గా బ్లింకెన్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అభివర్ణించారు. ఇటీవల చైనా విదేశాంగ మంత్రిగా పనిచేసిన కిన్ గతంలో వాషింగ్టన్‌లో బీజింగ్ రాయబారిగా వున్నారు. "బ్లింకెన్ అనేక అంశాలను ప్రస్తావించారు. అలాగే సహకారానికి గల అవకాశాలను అన్వేషిస్తూ, అంతర్జాతీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలు తెలుసుకుంటూ చైనాతో ఆసక్తి, ప్రయోజనాలు కలిగిన పలు అంశాలను చర్చించారు." అని మిల్లర్ పేర్కొన్నారు. అమెరికన్ల విలువలు, ప్రయోజనాల కోసం తాము ఎప్పుడూ నిలబడతామని బ్లింకెన్, కిన్‌కు తెలియజేశారని చెప్పారు. ప్రపంచం పట్ల తమకు గల దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ మిత్రులతో, భాగస్వాములతో కలిసి పనిచేస్తామని చెప్పారని తెలిపారు. ఈ చర్చల వివరాలను తెలియజేస్తూ చైనా క్లుప్తంగా ఒక ప్రకటనను విడుదల చేసింది. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధానంగా తైవాన్‌పైనే చర్చ జరిగిందని పేర్కొంది. చైనా కీలక ప్రయోజనాలకు తైవాన్ అంశం కీలకమైనదని కిన్ గాంగ్ వ్యాఖ్యానించారు. చైనా-అమెరికా సంబంధాల్లో కూడా ఇదే అత్యంత కీలకాంశం, అత్యంత ముప్పు కలిగిన అంశం కూడా ఇదేనని కిన్, బ్లింకెన్‌కు తెలియజేసినట్లు చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. బ్లింకెన్, కిన్‌ల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాల మధ్య గల తీవ్రమైన విభేదాలను తేటతెల్లం చేశాయని చైనా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు విలేకర్లతో వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య విమానాల సంఖ్యను విస్తరించడానికి ఉభయులూ అంగీకరించారు.

మరోసారి సమ్మెకు టీచర్లు సన్నద్ధం

- వేతన పెంపుపై సర్కారు మీనమేషాలపై ఆగ్రహం

లండన్ : దీర్ఘకాలంగా వేతన పెంపునకు సంబంధించి రిషి సునాక్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిని నిరసిస్తూ ఇంగ్లండ్ వ్యాప్తంగా టీచర్లు మరోసారి సమ్మె చేయనున్నారు. జులై 5, 7 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు సమ్మె ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు పూర్తిగా లేదా పాక్షికంగా మూతపడతాయి. ప్రస్తుతమున్న ద్రవ్యోల్బణానికన్నా చాలా తక్కువ స్థాయిలో అంటే 4.3శాతం వేతన పెంపును ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిని నాలుగు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో తిరిగి చర్చలు చేపట్టాల్సిందిగా సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా పాఠశాలల బడ్జెట్‌ను పెంచాలని, వేతన పెంపు కోసం అదనపు నిధులు అందచేయాలని ఎన్ఇయు, ఎన్ఎఎస్‌యుడబ్ల్యుటి, ఎన్ఎహెచ్‌టి, ఎఎస్‌సిఎల్ డిమాండ్ చేశాయి.. తీసుకోవాల్సిన కార్యాచరణ అంతా విద్యాశాఖ మంత్రి గిలియన్ కీగన్ పరిధిలోనే వుందని ఎన్ఇయు జాయింట్ ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మేరీ బూస్టెడ్, కెవిన్ కోర్ట్నీ చెప్పారు. ఈ వివాదాన్ని త్వరగా పరిష్కరించేందుకు సత్వరమే చర్చలు జరపాల్సిందిగా ప్రతీసారి తాము విద్యా శాఖ మంత్రిని కోరుతున్నామని వారు చెప్పారు. స్కాట్లండ్, వేల్స్‌ల్లో వేతన వివాదాలను పరిష్కరించారు. ఇంగ్లండ్‌లో మాత్రం ఈ వివాదాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకురాకపోవడంపై ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు స్పందిస్తూ, ఎవరూ కావాలని సమ్మె కార్యాచరణకు దిగాలని అనుకోరు, కానీ ఈ వివాదాన్ని పరిష్కరించే ఉద్దేశ్యమే తమకు లేనట్లు విద్యాశాఖ మంత్రి వ్యవహరిస్తున్నప్పుడు ఉపాధ్యాయులకు మరో ప్రత్యామ్నాయం లేకపోయిందని చెప్పారు.

కేలండరు ప్రకారమే సాగు నీరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి 15 రోజులకోసారి సమీక్షించి ఆ మేరకు కార్యాచరణ చేసుకుని, వేగంగా వాటిని పూర్తిచేయాలని అన్నారు. అవుకు రెండో టన్నెల్ నిర్మాణం చివరిదశ లైనింగ్ పనుల్లో వుందని, ఆగస్టులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు పనులపై పురోభివృద్ధిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఇప్పటికే మొదటి టన్నెల్ పూర్తయ్యిందని, రెండో టన్నెల్ పనులు కూడా కొలిక్కివస్తున్నాయని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా గొట్టిపాడు డ్యామ్, కాకర్ల డ్యామ్, తీగలేరు అప్రోచ్ ఛానల్, తీగలేరు హెడ్ రెగ్యులేటర్, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయని సిఎంకు అధికారులు వివరించారు. ఈ ఏడాది వంశధార స్టేజ్-2తోపాటు డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌ను కూడా పూర్తిచేస్తున్నామని తెలిపారు. గొట్టాబ్యారేజీ నుంచి కూడా ఎత్తిపోతల ద్వారా హిరమండలం రిజర్వాయరును నింపే కార్యక్రమం వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చాలని సిఎం ఆదేశించారు. తోటపల్లి బ్యారేజీ కింద మిగిలిపోయిన పనులు, తారకరామ తీర్థసాగర్, మహేంద్ర తనయ రిజర్వాయర్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖకు జాతీయస్థాయిలో నాలుగు వాటర్ అవార్డ్స్ వచ్చాయని అధికారులు తెలపగా మంత్రి, జలవనరులశాఖ అధికారులను ఈ సందర్భంగా సిఎం అభినందించారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, చీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్ రెడ్డి, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇఎన్‌సి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు, అస్సాంలో భారీ వర్షాలు

- ఆరు జిల్లాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- పలు విమానాలు దారిమళ్లింపు..

చెన్నై, గౌహతి : తమిళనాడు, అస్సాంను భారీ వర్షాలు ముంచెత్తాయి. చెన్నై, పొరుగు జిల్లాల్లో రాత్రిపూట భారీ వర్షాలు కురుస్తుండటంతో తమిళనాడు ప్రభుత్వం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వెల్లూరు, రాణిపేట.. ఇలా ఆరు జిల్లాల్లోని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. సోమవారం ఉదయమూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం చెన్నైలో నమోదైంది. ఆదివారం రాత్రి చెన్నై అంతటా విస్తారంగా భారీ వర్షాలు కురిశాయి. మీనంబాక్కం ప్రాంతంలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 5.30 గంటల వరకు 137.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దోహా, దుబాయ్‌తో సహా దాదాపు 10 విమానాలను బెంగళూరుకు మళ్లించారు. దీంతో ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయ విమానాల కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఇక భారీ వర్షాలతో చెన్నై మహానగరానికి నీటినందించే చెంబరంబాక్కమ్ రిజర్వాయర్ ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. 921 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. మంగళవారం వరకు ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. కాంచీపురం, చెంగల్‌పట్టు, కడలూరు, తిరుచ్చి, పెరంబలూరు సహా 13 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

అస్సాంలో 12 జిల్లాల్లో వరద ఉధృతి

అస్సాంలో వరద ఉధృతిరోజురోజుకూ పెరుగుతోంది. ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరద ముప్పు కొత్త ప్రాంతాలకూ విస్తరిస్తోంది. రాష్ట్రంలో 12 జిల్లాలో వరద ప్రభావం ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఒక బులెటిన్‌లో తెలిపింది. చాచర్, డర్రాంగ్, ధేమజి, దిబ్రూగఢ్, గోలఘాట్, హోజై, లఖింపూర్, నాగౌన్, నల్‌బరి, సోనిట్‌పుర్, తున్సుకియా, ఉడల్‌గురి జిల్లాల్లో వరద భీకరంగా ఉందని అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎఎస్‌డిఎంఎ) ఫ్లడ్ రిపోర్టులో తెలిపింది. 33,500 మందికి పైగా ప్రజలు వరద బారినపడ్డారని వెల్లడించింది. ఎఎస్‌డిఎంఎ నివేదిక ప్రకారం శనివారం నాటికి ఎనిమిది జిల్లాలు వరద ప్రభావానికి గురికాగా, తాజాగా 12 జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయి. లఖింపూర్ జిల్లాలో వరద తీవ్రత అత్యంత దారుణంగా ఉంది. ఈ జిల్లాలో సుమారు 25,200 మంది వరద కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిబ్రూగఢ్ జిల్లాలో సుమారు 3,800, తున్సుకియా జిల్లాలో సుమారు 2,700 మంది వరద బారినపడినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇంతకంటే చాలాఎక్కువమంది వరద బారిన పడ్డారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి 142 గ్రామాలు ముంపులో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 1,510.98 హెక్టార్లల్లో పంట నాశనమయిందని ఎఎస్‌డిఎంఎ తెలిపింది. బిశ్వనాథ్, బొంగైగావ్, డిబ్రూగఢ్, కోక్రాజార్, లఖీంపూర్, మజులి, మోరిగావ్, నాగావ్, శివసాగర్, సోనిత్‌పూర్, సౌత్ సల్మారా, ఉదల్‌గురి జిల్లాల్లో భారీ కోతలు సంభవించాయని పేర్కొంది. వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నట్లు వార్తాలు వస్తున్నాయి. వివిధ జిల్లాల్లో కట్టలు, రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. బ్రహ్మపుత్రానది, దాని ఉపనదులు పుతిమారి, కోపిలితోపాటు రాష్ట్రంలో అన్ని నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ రెడ్ ఎలర్ట్ జారీ చేసింది.

నేటి నుండి పోలవరం పోరుయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకునేందుకు చేస్తున్న యాత్రని అన్నారు. దీనిలో వందలాది మంది గిరిజనులు పాల్గొంటున్నారని, పునరావాసం లేకుండా ప్రపంచంలో ఎక్కడా ప్రాజెక్టులు లేవని, ఇక్కడ మాత్రం పునరావాసం లేని ప్రాజెక్టు కడుతున్నారని ఇది గిరిజన ప్రజలను దగా చేయడమేనని పేర్కొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై ప్రజల్లో ఆగ్రహం

విద్యుత్ ఛార్జీలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని శ్రీనివాసరావు తెలిపారు. కేంద్రం ఇచ్చే అప్పుల కోసం షరతులు పెట్టి మరీ భారాలు మోపుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు అవసరం లేకపోయినా బిగిస్తున్నారని, దీనికి వైసిపి, టిడిపి రెండు పార్టీలూ మద్దతు ఇచ్చాయని అన్నారు. రైతు, కార్మిక ఉద్యమాలు ముందుకు రావడంతో వెనక్కు తగ్గారని, అయినా బలవంతంగా బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో ఉనికిలో లేని బిజెపికి మూడు పార్టీల మద్దతు

రాష్ట్రంలో ఉనికిలోలేని బిజెపికి, వైసిపి, టిడిపి, జనసేన మద్దతు ఇస్తున్నాయని విమర్శించారు. ఒక్కశాతం ఓటు కూడా లేని పార్టీ ముందు రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు సాగిలపడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో బిజెపి ఉనికి లేకుండా చేయాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. కర్ణాటకలో అమూల్‌ను తీసుకొస్తే అక్కడి ప్రజలు నందిని కంపెనీ కోసం అమూల్‌ను తిప్పి కొట్టి బిజెపికి సిగ్గొచ్చేలా చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చేస్తున్నారని తెలిపారు.

ఉన్న వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు

కేంద్రంలో బిజెపి దేశానికి చేస్తున్నదేమీ లేదని కొత్త ప్రాజెక్టులు పెట్టకపోగా ఉన్న ప్రాజెక్టులు, కంపెనీలను అదానీకి స్వాధీనం చేస్తోందని తెలిపారు. అటువంటి దానికి రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎందుకు మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. ఒక్కరికి కూడా ఉపాధి లేకపోగా స్టీలు ఫ్యాక్టరీతోపాటు వేల ఎకరాల భూ బ్యాంకును కంపెనీల పేరుతో లాక్కుంటున్నారని తెలిపారు. అదే సమయంలో దళితులను వారి భూముల్లోకి వెళ్లనీయకుండా పోలీసులు బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు.

ప్రమాదంలో శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలు ప్రమాదంలో ఉన్నాయని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శాంతి భద్రతలు అంటే కర్రలతో కొట్టుకోవడం, దొమ్మీలు దోపిడీలే కాదని సామాన్య ప్రజలకు రక్షణ లేకపోవడం కూడా శాంతి భద్రతల సమస్యగానే చూడాల్సి ఉంటుందని అన్నారు. గిరిజనులు, దళితులు, మహిళలు, పిల్లలు, యువతులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. రేపల్లె సమీపంలో పదో తరగతి చదువుతున్న అమర్‌నాథ్ తన అక్కను వేధించొద్దన్నందుకు దుండగులు తగులబెట్టి హత్య చేశారని ఇది దుర్మార్గ చర్య అని అన్నారు. అలాగే చించినాడలాంటి చోట దళితుల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుతూ ప్రశ్నించిన దళితులపైనే కేసులు బనాయించారని, వారి భూముల్లోకి వెళ్లకుండా పోలీసులను కాపలా పెట్టారని తెలిపారు. పోలీసు వ్యవస్థ కూడా రాజకీయ నాయకులకు సేవ చేసేందుకు పనిచేస్తోంది మినహా ప్రజలకు రక్షణ కల్పించేదిశగా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దిశ చట్టం, యాప్‌లు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొన్నారు.

అనిశ్చితిలో రాష్ట్ర రాజకీయాలు

రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు దాదాపు స్వతంత్రను కోల్పోయాయని అన్నారు. రాష్ట్రంలో ఏమి చేయాలన్నా ఢిల్లీ పాత్రే కీలకంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి చుట్టూ తిరుగుతున్నాయని అన్నారు. బిజెపి ఎలా రూట్ మ్యాప్ ఇస్తే అలా నడుస్తున్నాయని తెలిపారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు పూర్తి అనిశ్చితిలో పడిపోయాయని విమర్శించారు. 2014లోనే ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందేదని అన్నారు. 20 ఏళ్ల క్రితం ప్రపంచ బ్యాంకు షరతులు ఉండేవని, ఇప్పుడు కేంద్రం షరతులతో ప్రభుత్వాలు నడుస్తున్నాయని అన్నారు. రాష్ట్రాలపై పడుతున్న భారాలు కనబడకుండా ఉండేందుకు ఎజెండాలనే మార్చేసి చెప్పుల రాజకీయాలు చేస్తున్నారని, ఇంతకంటే ప్రమాదం మరొకటి లేదని అన్నారు. అయినా ప్రజల ఛీత్కారానికి గురైన బిజెపి చుట్టే రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తిరుగుతున్నాయని విమర్శించారు.

జర్నలిస్టుల పోరాటానికి మద్దతు

రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి సిపిఎం తన పూర్తి మద్దతు, సంఘీభావాన్ని ప్రకటిస్తోందన్నారు. జర్నలిస్టుల్లో వేర్వేరు సంఘాలు ఉండొచ్చని, సమస్యలు మాత్రం ఒకటే ఉంటాయని, వాటి పరిష్కారానికి జరిగే పోరాటానికి తమ పార్టీ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం ఎజెండాగా ముందుకు

రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. దీనికోసం వామపక్షాలతో కలిసి పోరాడతామని అన్నారు. ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అంతిమంగా రాష్ట్రంలో బిజెపిని ఒంటరి చేయడమే లక్ష్యంగా ముందుకెళతామన్నారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు కూడా బిజెపితో ఉంటాయో, ఊడతాయో చెబితే అప్పుడు ఏమి చేయాలో ఆలోచిస్తామని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో పాట్నాలో జరిగే సదస్సు కూడా బిజెపికి వ్యతిరేకంగా ఉండే ఓటు చీలకూడదన్న ఆలోచనతోనే జరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం పోలవరం నిర్వాసితుల బతుకుల్లో కల్లోలం పేరుతో సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన పుస్తకాన్ని శ్రీనివాసరావు, జనార్ధన్ తదితరులు ఆవిష్కరించారు.

మీట్ ది ప్రెస్‌లో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, నాయకులు కె.జయరాజు, విజయవాడ అర్బన్ నాయకులు చావా రవి, ఐజెయు నాయకులు ఎ.ఆంజనేయులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, వసంత్, సీనియర్ నాయకులు బాబు, సీనియర్ జర్నలిస్టు వి.సురేష్ పాల్గొన్నారు.

మీ కోసం

రసం పిండిన నిమ్మ చెక్కలతో కత్తులు, కత్తిపీటలు రుద్దితే వాటికి అంటుకున్న ఉల్లిపాయ వాసన పోతుంది.

జీవన సౌరభం

ప్రయత్నాలను,
పోరాటాలను..
పిరికివాళ్లు మొదలుపెట్టరు,
బలహీనులు పూర్తిచేయరు,
విజేతలు విడిచిపెట్టరు..

గంపల తక్కెడ



పూర్వం ధారా నగరంలో ఎర్రోడు అనే దొంగ వుండేవాడు. ఓ రోజు ఓ ఇంటికి కన్నం వేసి లోనికి దూరాడు. ఆ గదిలో మసక వెలుతురులో ఒక మూట కనిపించింది. అది అందుకుని బయటపడ్డాడు. తెల్లారి పట్టుబట్టతో కట్టిన ఆ మూటను విప్పాడు ఎర్రోడు. అందులో ఏవో రాతలున్న తాటాకు కట్టలు ఉన్నాయి. వాటిని చూసి ఆశ్చర్యపోయాడు. అంత కష్టపడి దొంగతనం చేస్తే దొరికినవి ఇవా అని నీరసపడ్డాడు. సరే!... వాటినే ఎవరికైనా అమ్మి సొమ్ము చేసుకోవాలని బజారు బాట పట్టాడు. ఓ షావుకారు వాటిని చూసి... 'నాకు చదువు రాదు... వీటి విలువ తెలిసిన ఏ పండితుడి దగ్గరకెళితే వీటిని తీసుకుని కొంత ధనం నీకు ఇవ్వవచ్చు' అని సలహా ఇచ్చాడు.

పండితుల దగ్గరికి వెళితే తన దొంగతనం గురించి బయటపడుతుందని భయపడ్డాడు. ఆ కవిలెకట్టతో వీధిలోకి వచ్చి నీరసంగా నడుస్తున్నాడు. సాధారణంగా పండితులు, కవులు దగ్గర వుండే ఆ తాళపత్రాలు ఓ సామాన్యుడి దగ్గర వుండేసరికి, అటుగా వెళుతున్న రాజభటులకి అనుమానం వచ్చి, ఎర్రోణ్ణి పట్టుకుని సైనికాధికారి దగ్గరికి తీసుకుపోయారు. ఆ అధికారి కవిలెకట్టను పరిశీలించి, ఇది రాజుగారి దగ్గరికి తీసుకెళ్లవలసిన విషయమని, ఎర్రోణ్ణి రాజు ముందు ప్రవేశపెట్టారు. 'ఆ తాళపత్రాలు నీ దగ్గరికి ఎలా వచ్చాయి?' అని మంత్రి గద్దించాడు. ఎర్రోడు తాను నోరు విప్పితే తన బండారం బయటపడుతుందని... మూగవాడిగా నటించడం మొదలుపెట్టాడు. అంతేకాదు... రాజు గారికి ఇవ్వడానికి వస్తుంటే సైనికులు పట్టుకున్నారని... సైగల ద్వారా చెప్పాడు.

సేవకులు ఆ తాళపత్రాల్ని వెండిపళ్లెంలో వుంచి రాజు ముందుంచారు. స్వయంగా కవి అయిన రాజు వాటిని సావధానంగా పరికించారు. ఆయన కళ్లు ఆనందంతో మెరిశాయి. ఆ తాళపత్రాల్లో వున్నవి... మామూలు పద్యాలు కావు. అప్పటికి మూడు వందల సంవత్సరాల క్రితం ఆ నగరంలో నివశించిన ఒక మహా కవి రచించిన కావ్యం అది. అంత అపురూపమైన కావ్యం అనుకోకుండా తన రాజ్యంలో లభించడం రాజుకెంతో సంతోషం కలిగించింది. అప్పటికప్పుడు పూలను తెప్పించి ఆ తాళపత్ర గ్రంథంపై వుంచి రాజుతో సహా అంతా నమస్కరించారు. కావ్యం దొరికిన ఆనందంలో అవి ఎర్రోడి చేతికి ఎలా వచ్చిందన్న విషయం ఎవరూ పట్టించుకోలేదు. అతనికి వేయి వరహాలు కానుకగా ఇప్పించి పంపించేశాడు రాజు.

బ్రతుకు జీవుడా అని బయటపడ్డ ఎర్రోడు, దొంగతనాలు మాని కొత్త జీవితం గడపాలనుకున్నాడు. మరుసటి రోజే పక్క నగరానికి కుటుంబంతో సహా మఖాం మార్చాడు. ఆరోజు తనకి శిక్ష పడకుండా ఆ తాటాకు పత్రాలలోని అక్షరాలే కాపాడాయని భావించాడు. అక్షరాల విలువ తెలిసి తన ఇద్దరు పిల్లల్ని విద్య నేర్పించడానికి ఒక గురువు దగ్గర చేర్చాడు. బ్రతుకుతెరువు కోసం పూల వ్యాపారం ప్రారంభించాడు. పూల బజారులో చిన్న తక్కెడతో మొదలైన అతని పూల వ్యాపారం, కొద్ది రోజుల్లోనే మూడు పువ్వులు, ఆరు కాయల్లా వృద్ధిలోకి వచ్చింది. ఒక వైపు పిల్లలు చదువులో ఒక్కొక్క మెట్టు ఎక్కుతుంటే, మరో వైపు ఎర్రోడి పూల వ్యాపారం బాగా పెరిగింది. మామూలు తక్కెడ బదులు గంపల తక్కెడ అమర్చాడు. తన జీవితం ఇలా మలుపు తిరగడానికి తాళపత్రాలు, వాటిపై వున్న అక్షరాలే కారణమని మనసులోనే వాటికి మొక్కుతుంటాడు.

- ఎస్. హనుమంతరావు
88978 15656



నేను గీసిన బొమ్మ

- పి. వేద,
6వ తరగతి,
నేతాజి బాల విద్యాలయం,
సుందరయ్యనగర్,
తాడేపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్కూలుకు పంపడం ఇదే మొదటిసారా..!

స్కూళ్లు తెరిచారు. చాలామంది పిల్లలు బడికెళ్లిపోతున్నారు కూడా. కొంచెం పెద్ద పిల్లలైతే పరవాలేదు.. మరి ఈ సంవత్సరమే స్కూలుకెళుతున్న పిల్లలైతే.. వారి తల్లిదండ్రులు కొన్ని విషయాలపై శ్రద్ధ పెట్టాలి.

ఇప్పటి వరకు అమ్మ ఒడిలో ఆడుకున్న పాపాయిలు.. నానమ్మ గోరుముద్దలు తిన్న బుజ్జాయిలు.. తాత, నాన్న గారాలపట్టీలు ఒక్కసారిగా స్కూలు వాతావరణం చూసి బెంబేలు పడిపోవచ్చు. ఆ బెంగ కొంతమందికి ఒకపట్టాన వదలదు. స్కూలుకు వెళ్లనని మారాం చేయవచ్చు.. ఆరోగ్యం పాడై నీరసించి పోవచ్చు. అందుకే పిల్లలను ముందు నుంచే సిద్ధం చేయాలి. అలాగే వారి ఆహార, అలవాట్లలో కూడా మార్పులు చేయాలి.

అలవాటు చేయండి..

- సమయానికి నిద్ర లేవడం ఆలస్యం చేయకుండా నేర్పించండి.
- ఉదయం పనులు చకచకా చేసుకునేలా నచ్చజెప్పండి.
- అలాగే స్కూల్లో తినే ఆహారపదార్థాలు ఆరోగ్యానికి మేలు చేసేలా చూడండి. వాళ్లు ఇష్టపడతారని హానికరమైన చాక్లెట్లు, బిస్కెట్లు, డీప్ ఫ్రై ఐటమ్స్ పెట్టకూడదు.
- సాధ్యమైనంతవరకు ఉదయం వేళే.. ఇంట్లో ఉన్నప్పుడే గుడ్డు పెట్టేయండి. పాలు తాగించేయండి.
- స్నాక్ బాక్స్‌లో తేలికపాటి అల్పాహారం సిద్ధంచేయండి. ఇడ్లీ, దోశ, ఆమ్లేట్ పెట్టొచ్చు. బ్రెడ్, జామ్ వద్దు.

సొంతంగా తినేలా..

- వాళ్లకై వాళ్లు తీసుకుని తినేలా ఇంటి దగ్గరే నేర్పించాలి.
- అందరు పిల్లలకూ స్పూన్‌తో తినడం అలవాటుండదు. స్కూల్లో ఒక్కసారే తినమంటే తినకుండా ఉండిపోతారు. కాబట్టి ఇంటిదగ్గరే వాళ్లంతట వాళ్లే స్పూన్‌తో తినేలా అలవాటుచేయాలి.

ప్లాస్టిక్ వద్దు..

- నీళ్ల బాటిల్స్ పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి స్టీలు, కాపర్ బాటిళ్లను ఉపయోగించాలి. స్నాక్స్, లంచ్ బాక్సులకు కూడా ప్లాస్టిక్ వాడొద్దు.
- స్కూలుకెళ్లడం ఇష్టపడాలని వాళ్లు అడిగిందల్లా కొనివ్వద్దు.

రక్షణగా..

- వేసవి ఎండకు తోడు ఇప్పుడు వడగాలులు వీస్తున్నాయి. హాఫ్ డే స్కూల్సు నడుస్తున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళ పిల్లలను తీసుకురావాల్సి వస్తోంది. ఈ సమయంలో వేసవి ప్రతాపం వారిపై పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- మెత్తటి చున్నీ, టోపీ, గొడుగు వంటివి తలచుట్టూ కప్పి వుంచేలా రక్షణగా పెట్టి ముక్కు, చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్తపడాలి.

తల్లిదండ్రులు కూడా..

పిల్లలను ఇప్పుడే స్కూలుకు పంపిన కొత్త తల్లిదండ్రులకు కూడా స్కూలు బెంగ ఉంటుంది. పిల్లలు ఏం చేస్తున్నారో.. ఏం తింటున్నారో.. అని ఒకటే ఆందోళనపడిపోతారు.

- కొంతమంది అతి జాగ్రత్తకు పోయి పిల్లలను స్కూల్లో దింపిన తరువాత కూడా ఒక్కపూటే కదా అని అక్కడే ఉండిపోతారు.
- ఇలా చేయడం వల్ల పిల్లలు స్కూలుకు త్వరగా అలవాటు పడరు. పైగా మాటిమాటికీ బయటికి వచ్చేస్తుంటారు. ఇది వారి క్రమశిక్షణను పాడుచేస్తుంది.
- స్కూలు వాతావరణం, అక్కడి నియమాలు పిల్లలకు అలవాటవ్వాలంటే వారిని స్కూల్లో దింపేసి వచ్చేయాలి.
- స్కూలు నుండి ఇంటికి తీసుకురాగానే ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌లు ఇలా వాళ్లు అడిగిందల్లా ఇచ్చేస్తుంటారు. ఇది వారి ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పళ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పెరుగుతో కూడిన ఆహారం పెట్టాలి. ఈ సూచనలు పాటిస్తూ.. పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా స్కూళ్లకు సిద్ధంకండి.

మంచి నిద్ర కోసం..

వేసవిలో రాత్రులు నిద్ర పోవడం చాలా కష్టంగా ఉంటుంది. ఒక వైపు వేడి, మరోవైపు ఉక్కపోతకు నిద్రకు పట్టదు. వేసవిలో పగటి సమయం ఎక్కువగా ఉండడం వల్ల మెలటోనిన్ ఉత్పత్తిలో తేడాలు ఏర్పడుతాయని అందువల్ల నిద్ర పోవడం కష్టంగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడతున్నారు.

నిద్రలేమి కారణంగా అనారోగ్యాలు ఎదురయ్యే అవకాశం ఉంది. నిద్రలేమితో బాధపడే వాళ్లలో ఆత్మవిశ్వాసం డిప్రెషన్, ఆందోళన, కోపం, అతిగా తినడం, గందరగోళం, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి సమస్యలు ఎదురౌతాయి. ఈ సమస్యలేవీ రాకుండా వేసవి వేడి రాత్రుల్లో మంచి నిద్రకు కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు స్లీప్ ఎక్స్ పర్ట్స్.

వదులుగా ఉండే దుస్తులు

ఫైబర్, పత్తి, యూకలిప్టస్ లేదా జూట్ వంటి సహజమైన ఫైబర్లు వాడి తయారు చేసిన వదులైన దుస్తులు ధరించాలి.

ఏం తినాలి?

కారం లేదా కొవ్వులు అధికంగా ఉండే పదార్థాలు రాత్రుళ్లు తీసుకోకూడదు. సోయా సాస్, టోఫు వంటి ఫర్మెంటెడ్ పదార్థాలు, సిట్రస్ పండ్లలో కూడా టైరమైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది బ్రెయిన్ యాక్టివిటిని పెంచుతుంది. కాబట్టి ఈ పదార్థాలు కూడా రాత్రి ఆహారంలో తినకూడదు.

ఎలాంటి బెడ్ ?

కాటన్, లెనెన్, సిల్క్ లేదా జూట్ వంటి తేలిక పాటి సహజమైన ఫైబర్లతో తయారు చేసిన పరుపులను ఉపయోగించాలి. లేత రంగుల్లో, తేలికైన బెడ్‌షీట్స్ వాడడం మంచిది.

రాత్రి స్నానం

సాధారణంగానే ప్రతిరోజూ రాత్రి పూట కచ్చితంగా స్నానం చెయ్యాలి. ఈ వేసవిలో తూ.చ తప్పకుండా పాటించాలి. పడుకోవడానికి 1-2 గంటల ముందు స్నానం చెయ్యడం వల్ల మంచి నిద్ర పడుతుంది.

మరి కొన్ని చిట్కాలు

- రాత్రి పూట తేలికైన ఆహారం తీసుకోవాలి.
- సాయంత్రం పూట వ్యాయామం చెయ్యకూడదు.
- మధ్యాహ్నాలు చాలా వేడిగా ఉంటుంది కనుక బెడ్ రూం తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. ఇలా చెయ్యడం వల్ల గది ఎక్కువ వేడిగా ఉండదు.
- సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత తలుపులు తెరచి చల్లని గాలి ఇంట్లోకి వచ్చేలా చూడాలి.
- నేల మీద పడుకోవడం మంచి ఆప్షన్. అలవాటు లేని వారు స్ప్రింగ్ పరుపులు వాడుకోవడం మంచిది.

మరో విద్యుత్ ఉద్యమం తప్పదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా వామ పక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడం జరుగు తుందని అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని సింగ్‌నగర్ 58, 59 డివిజన్ల పరిధిలో విద్యుత్ పోరు బాట పాదయాత్ర కార్యక్రమం రెండవ రోజు సోమవారం ఆయన ప్రారంభించారు. నల్లబెలూన్ల ను గాలిలోకి ఎగురవేసి నిరసన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు వారికొచ్చిన అధిక బిల్లులను సిపిఎం నాయకులకు చూపిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, అధిక ధరలు, విద్యుత్ బిల్లులపై నిరసన తెలిపారు. శ్రీనివాసరావు మాట్లా డుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని సర్దుబాటు ఛార్జీల భారం విద్యుత్‌పై రాష్ట్రప్రభుత్వం మోపటం దారుణమన్నారు. అప్పుల కోసం వైసిపి ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సంస్కరణలకు దాసోహం అవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న బిజెపి నేతలు స్మార్ట్ మీటర్లపై అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేయగలరా?అని ప్రశ్నిం చారు. ప్రపంచంలో సోలార్ విద్యుత్ రేట్లు యూని ట్‌కు రూపాయి, 50 పైసలకు పడిపోయిందని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీలు పెంచడం తగదన్నారు. విద్యుత్ భారాలపై సిపిఎం ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే, బాదుడని విమర్శించిన సిఎం జగన్మోహన్ రెడ్డి బాదుడులో అందరిని మించిపోయారని విమర్శిం చారు. విద్యుత్ సంస్కరణలతో కార్పొరేట్ కంపెనీలు బాగుపడ్డాయని, విద్యుత్ రంగం నాశనం అయ్యిం దని, ఫలితంగా ప్రజలపై తీవ్రమైన భారాలు పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డి కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఎపిఇపిడిసి ఎల్ సిఎమ్‌డిని నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ నగరంలోని గ్రీన్ పార్కు హోటల్ ఎదురుగా ఉన్న విద్యుత్తు కార్యాలయం వద్ద లాంతరు పట్టుకొని, భారీ విద్యుత్ బిల్లును ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. నెల్లూరులో మిలీనియం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా ధర్నా చేపట్టారు. గుంటూరులో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాడేపల్లి పట్టణం నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, మండలంలోని మెల్లెంపూడి విద్యుత్ ఉపకేంద్రం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

బందరు ఓటర్ల నమోదుపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

మచిలీపట్నం అసెంబ్లీ ఓటర్ల నమోదు ప్రక్రియ చట్ట ప్రకారం, పాదర్శకంగా జరిగేలా ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల అధికారి, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. మచిలీపట్నంకు చెందిన వ్యాపారి ఇమదాబత్తుల దిలీప్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందర్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేసింది. ఒకే ఇంట్లోని వారందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసేలా చేయాలన్న నిబంధన అమలు కావడం లేదని, అర్హులకు ఓటు హక్కు కల్పించాలని పిటిషనరు తరపున న్యాయవాది రమణకుమారి వాదించారు. ఓటరు నివశించే ప్రాంతానికి రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ బూత్ ఉండేలా చేయాలన్నారు.

విలువల గురించి మోడీ మాట్లాడటం హాస్యాస్పదం

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యం, విలువల గురించి మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ మాట్లాడటం హాస్యాస్పదమని మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1975లో విధించిన అత్యవసర పరిస్థితి గురించి మోడీ మాట్లాడటం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని పేర్కొన్నారు. అప్పట్లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇస్తే ఆమె ఎమర్జెన్సీ విధించారని తెలిపారు. ఇప్పుడు ప్రలోభాలు పెట్టి ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్న మోడీ పౌరహక్కులు, పత్రికా స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్న సామాజిక ఉద్యమకారులను వేధించడం దివైర్, కారవాన్, న్యూస్‌క్లిక్ లాంటి ప్రఖ్యాతమీడియా సంస్థలపైనా, జర్నలిస్టులపైనా తప్పుడు కేసులు పెట్టిస్తున్న మోడీ మాటలు కట్టిపెట్టాలని వడ్డే తెలిపారు. రుణాలు ఎగ్గొడుతున్న వారికే రుణాలు ఇప్పించాలని మోడీ ఆదేశించడం దుర్మార్గమని పేర్కొన్నారు. అప్రజాస్వామిక, అవినీతికర, రైతాంగ, సామాన్య ప్రజావ్యతిరేక మోడీ ప్రభుత్వానికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి (చిత్తూరుజిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో ఎర్రగదిరేపల్లి గ్రామానికి చెందిన రైతు హనుమతురెడ్డి (43) ఒకటిన్నర ఎకరం భూమిలో టమోటా పంట సాగుచేసి రూ.నాలుగు లక్షలు అప్పు చేసి బోరు వేశారు. పంటకు గిట్టుబాటు ధర రాక పోవడంతో వడ్డీలు కట్టలేక మనస్తాపానికి గురై చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

ఫెన్సింగ్‌లో భవానీ దేవి కొత్త రికార్డు

- ఆసియా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం

కాంస్య పతకంతో భవానీ దేవి(బ్లూ జెర్సీ, కుడి)

న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా ఫెన్సర్ సిఎ భవానీ దేవి నయా చరిత్ర నెలకొల్పింది. ఆసియా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సోమవారం జరిగిన కాంస్య పతకం సాధించి ఈ రికార్డు నెలకొల్పింది. క్వార్టర్‌ఫైనల్లో భవానీ దేవి ప్రపంచ ఛాంపియన్ మిసాకి ఎమురాను ఓడించి సెమీస్‌కు చేరి.. సెమీస్‌లో జనాబ్ చేతిలో ఓటమిపాలై కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్‌ఫైనల్లో భవానీ దేవి 15-10పాయింట్ల తేడాతో ప్రపంచ ఛాంపియన్‌కు షాక్ ఇచ్చింది. అంతకుముందు మిసాకితో జరిగిన మూడు మ్యాచుల్లోనూ ఓడిన భవానీ.. నేటి మ్యాచ్‌లో ప్రారంభం నుంచే అద్భుత ప్రదర్శను ఆకట్టుకుంది. విజయం సాధించిన అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచంలోని అత్యున్నత క్రీడాకారిణులను ఓడించాలన్నది తన కల అని.. టాప్ క్లాస్ ప్లేయర్ మిసాకిపై విజయం సాధించినందుకు సంతోషంగా ఉందని పేర్కొంది. అలాగే చరిత్రలో తొలిసారి ఫెన్సింగ్ విభాగంలో భారత్‌కు పతకం సాధించినందుకు గర్వంగా ఉన్నట్లు తెలిపింది. గత ఆసియా క్రీడల్లో మిసాకి చేతిలో ప్రి క్వార్టర్స్‌లో ఓడానని, ఈసారి ఓ ప్రణాళిక ప్రకారం ఆమెపై విజయం సాధించానని వెల్లడించింది. ఇక సెమీస్‌లో భవానీ దేవి 14-15పాయింట్ల తేడాతో జనాబ్ దయిబేకోవా(ఉజ్బెకిస్తాన్) చేతిలో పోరాడి ఓడింది.

14-14పాయింట్లతో సమంగా ఉన్న దశలో రిఫరీ ఎర్లీ స్టార్ట్ కోసం భవానీ దేవికి రెడ్‌కార్డ్ ఇవ్వగా.. ఆ సమయానికి ఇద్దరు ఎల్లోకార్డులతో ఉన్నారు. వీడియో రెఫరల్‌ను భవానీ దేవి కోరినా.. రిఫరీ దానిని తిరస్కరించారు. 'బ్లేడ్ కాంటాక్ట్' ఉంటేనే రెఫరల్‌కు అవకాశముందని రెఫరీ పేర్కొనడంతో భవానీ దేవి ఓటమిపాలైంది. దీంతో సెమీస్‌లో ఓడిన భవానీ దేవికి కాంస్య పతకం దక్కింది. భవానీ దేవి చారిత్రాత్మక విజయాన్ని సాధించినందుకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహతా అభినందనలు తెలిపారు.

హసరంగకు ఆరు..

యుఏఇపై 175పరుగుల తేడాతో గెలుపు
వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్

హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలి ఫయర్స్‌లో శ్రీలంక జట్టు 175పరుగుల తేడా తో యుఏఇపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 355 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. నిస్సంక(57), కరుణరత్నే(52), కుశాల్ మెండీస్ (78), సమరవిక్రమ(73) అర్ధసెంచరీలతో మెరి సారు. బసిల్, అయాన్, ముస్తఫ, నసీర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యుఏఇ 39ఓవర్లలో 180పరుగులకే కుప్పకూలింది. హసరంగ(6/24)కి తోడు కుమార, తీక్షణ, ధనుంజయకు ఒక్కో వికెట్ దక్కాయి. అలీ నాసిర్‌కు రెండు వికెట్లు దక్కా యి. ప్లేయ ర్ ఆఫ్ ది మ్యాచ్ హసరంగకు లభించగా.. శ్రీలంక జట్టు 23న ఓమన్‌తో తలపడనుంది.

ఓమన్ సంచలనం..

గ్రూప్-బి మరో మ్యాచ్‌లో ఓమన్ జట్టు సంచలనం నమోదు చేసింది. సోమవారం జరి గిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో ఓమన్ జట్టు 5 వికె ట్ల తేడాతో పటిష్ట ఐర్లాండ్ జట్టుపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాం డ్ 7వికెట్ల నష్టానికి 281పరుగులు చేయగా.. ఛేదనలో ఓమన్ జట్టు 48.1ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 285పరుగులు చేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జీషాన్ మసూద్‌కు లభించింది.

టాప్‌లో జకోవిచ్

ఏటిపి ర్యాంకింగ్స్ విడుదల

పారిస్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఏటిపి) తాజా ర్యాంకింగ్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకాడు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌కు ముందు 2వ ర్యాంక్‌కే పరిమితమైన జకోవిచ్.. ఆ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకోవడంతో యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్‌ను వెనక్కి నెట్టి టాప్ ర్యాంక్‌కు ఎగబాకాడు. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం నొవాక్ జకోవిచ్ 7595పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. అల్కరాజ్ 7175పాయింట్లతో రెండోస్థానానికే పరిమితమయ్యాడు. ఆ తర్వాత మెద్వదేవ్(రష్యా), కాస్పర్ రూఢ్(నార్వే), సిట్సిపాస్(గ్రీక్) టాప్-5లో కొనసాగుతున్నారు.

ఏటిపి టాప్-10 ర్యాంకింగ్స్..

1. నొవాక్ జకోవిచ్(సెర్బియా)	-7595పాయింట్లు
2. కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్)	- 7175 ,,
3. డానియెల్ మెద్వదేవ్(రష్యా)	- 5845 ,,
4. కాస్పర్ రూఢ్(నార్వే)	- 4960 ,,
5. స్టెఫానస్ సిట్సిపాస్	- 4875 ,,
6. హోల్గర్ రూనే(డెన్మార్క్)	- 4375 ,,
7. ఆండీ రుబ్లేవ్(రష్యా)	- 4000 ,,
8. టేలర్ ఫ్రిట్జ్(అమెరికా)	- 3515 ,,
9. జన్నిక్ సిన్నర్(ఇటలీ)	- 3300 ,,
10. ఫెన్సె టఫీ(అమెరికా)	- 3085 ,,

రసకందాయంలో యాషెస్ టెస్ట్

ఆస్ట్రేలియా లక్ష్యం 281పరుగులు

బర్మింగ్‌హామ్: యాషెస్ సిరీస్ తొలిటెస్ట్ రసకందాయంలో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ జట్టు 273పరుగులకు ఆలౌట్ కావడంతో ఆస్ట్రేలియా జట్టు 281పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. మరో రోజు ఆట ముగిలి ఉన్న నేపథ్యంలో ఈ టెస్ట్ ఫలితం రానుంది. ఓవర్ నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 27పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 273పరుగులకు కుప్పకూలింది. రూట్(46), హెన్రీ(46), స్టోక్స్(43) బ్యాటింగ్‌లో రాణించారు. లియాన్, కమిన్స్‌కు నాలుగేసి, హేజిల్‌వుడ్, బోలండ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 8వికెట్ల నష్టానికి 393పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయగా.. ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్ 386పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68